1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుటి : 6
సంచిక : 7
పుటలు : 52
రు. 20 లు
తెనాలి

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు

డిసెంబరు 2020

యు.జి.సి. గుర్తింపు పొందిన తెలుగు పత్రిక



- భాషాబోధనలో భాషాశాస్త్రం
- ప్రైవేటు బడులలో ఆంగ్ల మాధ్యమం-వాస్తవాలు
- పునాది భాష

శ్రీలంకలో
ఎనిమిదివ ప్రపంచ వింతగా భావించే
సిగిరియా...
సీగిరి కొండ...
శ్రీపర్వతం !
**జగమునేలిన తెలుగు...**

భాషలపట్ల వేరుచూపుతో సమైక్యత కుదరదు, ముందడుగూ పడదు

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు

## **అమ్మనుడి** పత్రికకు యూజీసీ-కేర్ గుర్తింపు

University Grants Commission

Consortium for Academic and Research Ethics (UGC-CARE)

| Sr.No. | Print Journals (Included in UGC-CARE List) |
| --- | --- |
| 5 | Title- *Ammanudi*<br>Language: Telugu<br>Publisher: Samala Ramesh Babu<br>ISSN: NA<br>URL : https://www.ammanudi.org |

పరిశోధనలలో నాణ్యతను పెంచి తద్వారా ప్రపంచ ప్రమాణాలతో సరిపోల్చేందుకు వీలుగా, దాని పరిధిలోని అన్ని విద్యా విభాగాలలో, విశ్వవిద్యాలయాల విరాళాల సంఘం (యుజిసి) కొన్ని "నాణ్యతా నియమాలను" ప్రతిపాదించి తద్వారా భారతీయ విద్యారంగాన్ని ఉత్తేజపరిచేందుకూ శక్తిమంతం చేయడానికీ ఉపక్రమించింది. ఈ నిర్ణయాన్ని నెరవేర్చడానికి ప్రత్యేకమైన కన్సార్టియం ఫర్ అకాడెమిక్ అండ్ రీసెర్చ్ ఎథిక్స్ (CARE)ను ప్రకటించింది (2018). దీని లక్ష్యాలలో కొన్ని, భారతీయ విశ్వవిద్యాలయాలలో నాణ్యమైన పరిశోధనలతో కూడిన ప్రామాణిక రచనలనూ వాటి ప్రచురణలనూ ప్రోత్సహించడం, ప్రపంచంలో అత్యున్నత స్థాయి(ర్యాంకు)లను సాధించడంలో సహాయపడేందుకు వీలుగా ప్రసిద్ధ పత్రికలలో నాణ్యత గల ప్రచురణలను ప్రోత్సహించడం. అలాగే, మంచి నాణ్యమైన పత్రికలను గుర్తించడానికి ఒక విధానాన్నీ పద్ధతినీ అభివృద్ధి చేయడం. దోపిడీ, సందేహాస్పద లేక అప్రామాణిక పత్రికలలో ప్రచురణలను నిరోధించడానికీ ఇది పనిచేస్తుంది. అన్ని విద్యా ప్రయోజనాల కోసం "యుజిసి-కేర్ నాణ్యమైన పత్రికల జాబితాను" (యుజిసి-కేర్ లిస్ట్)ను తయారుచేయడం నిర్వహించడం పరిశోధనా ప్రచురణల విశ్వసనీయతకోసం చాలా ముఖ్యం. ఎందుకంటే సంస్థాగత ర్యాంకింగ్, నియామకాలు, అధ్యాపక సభ్యుల పదోన్నతులు, విద్యాకమిటీల సభ్యత్వం, పరిశోధనా డిగ్రీల పురస్కారం వంటి వివిధ విద్యా ప్రయోజనాల కోసం పరిగణించబడే ప్రపంచవ్యాప్తంగా ఆమోదించబడిన సూచికలలో ప్రసిద్ధ పత్రికలలో ప్రచురించబడిన పరిశోధనా వ్యాసాల సంఖ్యే ప్రమాణం.

భారతీయ పత్రికల జాబితా, ముఖ్యంగా ఆర్ట్స్, హ్యూమానిటీస్, లాంగ్వేజెస్, కల్చర్ ఇంకా భారతీయ జ్ఞాన వ్యవస్థల విభాగాల నుండి (యుజిసి-కేర్ గ్రూప్) వడపోసి తయారు చేసి, ప్రతి మూడు నెలలకూ ఒకసారి నవీకరించబడుతుంది.

ఈ జాబితాలోకి **అమ్మనుడి** పత్రిక చేరిందని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం.

-సంపాదకుడు

- తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
- తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
- ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...


తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు 9848016136

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి




డిసెంబరు 2020

**రచయితలకు సూచనలు**

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట –రచనను ఏ రూపంలో నైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి గాని వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్‌చేసి *editorammanudi@gmail. com* కు పంపాలి. కొరియర్ / రిజిష్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ-మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

4. రచన స్వంతమేనని, ఇతర పత్రికల కుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ రచనతో జోడించాలి. ముందుగా సోషల్ మీడియాలో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించలేము.

వలగూడు (ఇంటర్నెట్)లో *www.ammanudi.org* చూడండి.

**లోపలి పుటలలో....**


| | | | |
|---|---|---|---|
| **సంపాదక హృదయం:** | భాషలపట్ల వేరుచూపుతో సమైక్యత కుదరదు.... | | **07** |
| **విద్య-మాధ్యమం:** | భాషాబోధనలో భాషాశాస్త్రం | **ప్రొ. రాజ్యరమ** | **09** |
| **విద్య-మాధ్యమం:** | ప్రైవేటు బడులలో ఆంగ్ల......... | **ప్రకాష్, బాపూజీ, నరేశ్** | **11** |
| **విద్య-మాధ్యమం:** | పునాది భాష: ముప్పేట వాడుక | **వెన్నెలకంటి ప్రకాశం** | **15** |
| **భాష-సంస్కృతి:** | జనగణమనతో నా ప్రయాణం | **సి.వి.క్రిష్ణయ్య** | **16** |
| **సంప్రదాయం-సాధికారత:** | ఆఫ్రికాలో అమ్మనుడి..... | **డా॥.పి.శివరామకృష్ణ'శక్తి'** | **19** |
| **నదీవిజ్ఞానం:** | పెన్నానది పేర్ల వెనుక చరిత్ర | **అప్పిరెడ్డి హరినాథరెడ్డి** | **26** |
| **వార్తావ్యాసం:** | తెలుగు జాలవేదిక 24వ సమావేశం | **జె.డి.ప్రభాకర్** | **46** |
| **తిరగమోత:** | త్రాగుడును కొనసాగించాలా? | **సడ్లపల్లె చిదంబరరెడ్డి** | **48** |
| **గ్రంథాలయం:** | | | **50** |
| **మాటల నిర్మాణం:** | పదనిష్పాదనకళ | **వాచస్పతి** | **30** |
| **నవల :** | మాఊరు | **అగరం వసంత్** | **36** |
| | జగమునేలిన తెలుగు- 13 | **డి.పి.అనూరాధ** | **41** |
| **ధారావాహికలు:** | అడుగుజాడలూ ఆనవాళ్లు-4 | **ఈమని శివనాగిరెడ్డి** | **23** |
| | పడమటి గాలితో... | **ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి** | **33** |
| **కవితలు :** | జన సమరసతా"నానీలు" | **సామల కిరణ్** | **29** |



| కార్టూన్లు | ఫోటోలు | కంప్యూటర్ |
|---|---|---|
| **సరసి** | **తమ్మా శ్రీనివాసరెడ్డి** | **బండారు రఘురాం** |


రచనలను, వార్తలను, వాట్స్‌యాప్‌లో పంపవద్దు

'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలను కొందరు వాట్స్‌యాప్ (WhatsApp) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు స్వీకరించలేము. దయచేసి కొరియర్‌లో / రిజిష్టర్డ్ పోస్టులో, లేదా **editorammanudi@gmail.com** కు పంపించండి. - సంపాదకుడు


రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:

సంపాదకుడు: **అమ్మనుడి**, జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ-520004.

కార్యాలయం : *0866-2439466* సంపాదకుడు : *9848016136* *e-mail* : editorammanudi@gmail.com



రచయితల అభిప్రాయాలు వారి స్వంతం. వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

## రచయితలకు విన్నపం

❖ ప్రచురణ కోసం పంపే రచనలను, వార్తలను ప్రతి నెల 15వ తేదీలోపుగా మాకు చేరునట్లు పంపి సహకరించండి. 20వ తేదీ దాటిన తరువాత చేరే వాటిని పరిశీలించడం ఇబ్బంది అవుతుందని గమనించండి.

❖ రచయితలు సరళమైన తెలుగు మాటలతో వ్రాయాలని మా విన్నపం. అచ్చతెలుగులోనే వ్రాయాలని మేము కోరడం లేదు. ఇతర నుడుల మాటలను తప్పనిసరైతేనే, వీలైనంత తక్కువగా వాడండి. మీ ప్రాంత తెలుగు మాండలికాల్ని, నుడికారాల్ని ఉపయోగించడానికి వెనుకంజ వేయవద్దు. తాపీ ధర్మారావు గారు చెప్పిన మాటలను ఇక్కడ గుర్తుకు తెచ్చుకొందాం:

'చదివిన విన్నా జనులందరికీ – చక్కగ తెలిస్తె రాతా/
మెదడు చించుకొని నిఘంటులన్నీ – వెదికించేదే రోతా'

'వాడుక మాటల వల్లనె భావాల్ – ప్రకటించిందే రాతా/
పాడు ముష్టితో పెద్ద సమాసాల్–వాడిందైతే రోతా'

'చిన్న మాటలనె గొప్పభావములు – చెప్పగలిగితే రాతా/
మిన్ను విరిగినట్టు ధ్వనించి – భావం సున్నచుట్టితే రోతా'

## పాఠకులకు, అభిమానులకు విన్నపం

❖ 'అమ్మనుడి' పత్రికను చందాదారులకు మాత్రమే పోస్టులో పంపించగలము. బయట ఎక్కడా అంగళ్లలో అమ్మకమునకు పెట్టడంలేదు. కనుక కావలసినవారు దయచేసి చందాదారులుగా చేరవలసిందిగా కోరుతున్నాము. వివరాలు ఈ పుటలోనే గలవు. దయచేసి ఆ సూచనలను అనుసరించ ప్రార్థన.

❖ చందా కాలం ముగిసిపోయిన తర్వాత పత్రిక పంపబడదు. దయచేసి వెంటనే చందా పైకం పంపి, చందాను కొనసాగించుకోగోరుతున్నాము.

❖ నెట్‌లో పత్రికను పొందగోరేవారు దయచేసి తమ 'మెయిల్ ఐడి'ని తెలుపండి. చందాదారులకు మాత్రమే పంపించబడుతుంది.

❖ 'అమ్మనుడి' పత్రికను నడుపడం ఆర్థికంగా ఎంతో ఇబ్బందిగా ఉంది. చందాలే ముఖ్య ఆధారంగా ఉన్నది గనుక – మీ మిత్రులను, సంస్థలను ప్రోత్సహించి వారిని చందా దారులుగా చేర్పించగోరుతున్నాము.

–ప్రచురణకర్త

| చందా వివరాలు చెల్లించే విధానం | తెలుగుజాతి పత్రిక **అమ్మనుడి** మాసపత్రిక | బ్యాంక్ ఖాతా, ఫోను వివరాలు |
|---|---|---|

### చందా వివరాలు

| | | |
|---|---|---|
| జీవిత చందా | : | రూ.5000 |
| 4 సం॥ చందా | : | రూ.1000 |
| 1 సం॥ చందా | : | రూ. 300 |

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు చెక్కు లేదా డి.డి.ని **'తెలుగుజాతి'** పేర పంపాలి.
**గూగుల్ పే/ ఫోన్ పే** ద్వారా చందా పంపదలచిన వారు ఫోను నెంబరు **94929 80244** కు పంపించ గలరు

### చందాదారులకు సూచనలు

1. చందా కాలం ముగింపు తేదీ – పత్రిక కవరుమీద మీ చిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
3. మీ ఇంటి నెంబరుతో పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలపాలి.
4. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'తెలుగుజాతి'**–యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

**TELUGU JAATHI - AXIS BANK, TENALI**

అక్కౌంట్ నెం. **91402002038788O**

**IFSC Code : UTIB0000556**

ఆన్‌లైన్‌లో చందాను పంపేవారు వెంటనే, ఇంటినెంబరు, వీధి పేరు, పిన్‌కోడ్ నెంబరు, ఫోన్ నెంబరు, గల తమ పూర్తి చిరునామా, మెయిల్ ఐడి తదితర వివరాలను జాబు ద్వారా గాని, ఫోన్ నం:9492980244 కు ఫోన్ సందేశం గాని, వాట్సయాప్ ద్వారా గాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలకు చిరునామా

**డా॥ సామల లక్ష్మణబాబు,** ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు,
**తెనాలి,** గుంటూరు జిల్లా – 522 211.
ఫోన్ : 9492980244
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

**చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. ఇందుకోసం మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలుపగలరు.**

# అన్ని కేంద్ర ప్రభుత్వకార్యాలయాల్లో స్థానిక రాష్ట్ర అధికార భాషల్ని ఉపయోగించి తీరాలి
## మహారాష్ట్ర ప్రభుత్వం పట్టుదల అందరికీ ఆదర్శం

**అన్ని** కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లోనూ మరాఠీ భాషను ఉపయోగించాలని మహారాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. కేంద్రం యొక్క త్రిభాషా సూత్రం అన్ని కార్యాలయాల్లో ప్రాంతీయ భాషను ఉపయోగించడం తప్పనిసరి చేసినందున, ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్ మంగళవారం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో, కేంద్రం నడుపుతున్న అనేక కార్యాలయాలు ఆ నిర్ణయాన్ని పాటించడంలేదన్నది తమ రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి వచ్చినట్లు పేర్కొన్నారు. రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాలు, బ్యాంకులు, టెలిఫోన్ ఎక్స్ఛేంజీలు, కేంద్రం నడుపుతున్న అన్ని సంస్థలూ ఇంకా కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలలో మరాఠీ భాషను ఉపయోగించాలని రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

మహారాష్ట్ర అధికారిక భాషల చట్టం 1964 ప్రకారం, మరాఠీ రాష్ట్రంలో అధికారిక భాష యొక్క హోదాను పొందింది. కేంద్రం తెచ్చిన త్రిభాషా సూత్రం ప్రకారం కార్యాలయాలకు ప్రాంతీయ భాషను ఉపయోగించడం తప్పనిసరి. అయితే, ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్ మంగళవారం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో, కేంద్రంలో నడుస్తున్న అనేక కార్యాలయాలు ఇందుకు కట్టుబడి లేవని రాష్ట్రం దృష్టికి వచ్చినట్లు పేర్కొన్నారు. "ఈ విషయంలో పదేపదే ఫిర్యాదులు వచ్చాయి. అనేక మంది ప్రజా ప్రతినిధులు కూడా ఈ విషయంలో ఫిర్యాదులను లేవనెత్తారు," అని నోటిఫికేషన్ పేర్కొంది. నిబంధనను అమలు చేయడానికి, ప్రతి మూడు నెలలకొకసారి ప్రాంతీయ భాషను తప్పనిసరిగా ఉపయోగించడం గురించి అన్ని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల నుండి స్వీయ-డిక్లరేషన్ ఫారమ్ పొందాలని ఇంకా ఈ విషయంలో త్రైమాసిక నివేదికను సమర్పించాలనీ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు జిల్లా కలెక్టరేట్లు ఇంకా భాషా డైరెక్టరేట్‌ను ఆదేశించింది. గత బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం కూడా ఇలాంటి ఆదేశాలు జారీ చేసిందని అధికారులు తెలిపారు. శివసేన నేతృత్వంలోని మరాఠీ భాషా విభాగం రాష్ట్రంలో మరాఠీ వాడకాన్ని ముందుకు తెస్తోంది.

(టైమ్స్ ఆఫ్ ఇండియాలో వార్త ఆధారంగా)

# గొప్పకవి, జర్నలిస్టు దేవిప్రియ కనుమరుగు



**71ఏళ్ల** వయసులో ప్రముఖ కవి, రచయిత, జర్నలిస్టు 'దేవిప్రియ' కాలంలో కరిగిపోయారు. నవంబరు 21న ఆయన మరణంతో తెలుగు ప్రజలు ఎంతో కోల్పోయారు.

కేంద్ర సాహిత్య అకాడమీతో సహా చాలా సంస్థల పురస్కారాలను, గౌరవాలను ఆయన అందుకొన్నారు. ఆయన ఎంత భావుకుడైనా, అది జనజీవితంతో, సమస్యలతో ముడిపడి ఉండేది. శివసాగర్, శ్రీశ్రీల వంటి వారితో పోల్చి ఆయన రాజకీయ కవితల్ని గురించి కొందరు ప్రశంసించారు. వేమన సులభశైలితో పాటు వ్యంగ్య కవితాధోరణి ఆయనలో ఉందని కూడా అభిప్రాయపడ్డారు. ఆయన చేపట్టిన తనదైన ప్రత్యేక ధోరణులను మనం గమనించాలి. ఎంతో బలమైన విమర్శకుడు. ప్రజల జీవితంతో ఆడుకొంటున్న రాజకీయుల్ని తనదైన శైలిలో, మాటల విరుపుతో, బలంగా, సున్నితంగా విమర్శించే కవితలు ఆయన కలం నుండి వెలువడ్డాయి. సమీస్యలను ఎంతో లోతుగా పరిశీలించనిదే, తన ఆలోచనల్లో ఇంకింపజేసుకోనిదే ఆయన వ్రాసేవారు కాదు. ఆయన 'రన్నింగ్ కామెంటరీ'యే ఇందుకు నిదర్శనం.

తెలుగు భాషోద్యమం గురించి ఆయనతో రెండు సార్లు మాట్లాడడం జరిగింది. ఈ ప్రభుత్వాలకు తెలుగు అంటే ఎంతోభయం, ప్రజలెక్కడ డెమోక్రసీ గురించీ విప్లవం గురించీ బాగా నేర్చేసుకుంటారో అన్నదే ఆ భయం. 'మీ పని మీరు చేయాల్సిందే, ప్రజలభాషతేనే చైతన్నాన్ని పెంచగలం' అన్నారు దేవిప్రియ. కీ.శే. సి.ధర్మారావు గారితో పాటు నేను ఒక పెద్ద సభలో ఆయనను తొలిసారి కలిశాను. ఆ తర్వాత ఎప్పుడు కనబడినా ఆప్యాయంగా పలుకరించేవారు. నిజాయితీ కలిగిన పదునైన ఒక కవిని కోల్పోవడం పెద్దలోటు.

మరణం సహజమైనదే. కాని, కొందరి మరణం తీరని లోటును మిగుల్చుతుంది.

-సామల రమేష్‌బాబు, సంపాదకుడు

# ప్రాంతీయ భాషల్లోనూ పోటీపరీక్షలు నిర్వహించండి

## కేంద్రానికి సి.ఎం. కేసీఆర్ విజ్ఞప్తి

**కేంద్ర** ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల్లోని ఉద్యోగాల భర్తీకి నిర్వహించే వివిధ పోటీ పరీక్షల్లో ప్రాంతీయ భాషలకు అవకాశం కల్పించాలని ప్రధాని నరేంద్రమోదీని రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు కోరారు. ఈ మేరకు ప్రధానికి, కేంద్ర కమ్యూనికేషన్లు, ఐటీ శాఖ మంత్రి రవి శంకర్ ప్రసాద్ కు కేసీఆర్ శుక్రవారం లేఖలు రాశారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థలు, రైల్వే, రక్షణ రంగం, జాతీయ బ్యాంకుల్లోని ఉద్యోగాల భర్తీకి హిందీ, ఇంగ్లీషులోనే పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. దీంతో ఇంగ్లీషు మాధ్యమంలో చదువుకోని వారు, హిందీయేతర రాష్ట్రాల అభ్యర్థులు నష్టపోతున్నారని వివరించారు. అన్ని రాష్ట్రాల అభ్యర్థులకు సమాన అవకాశాలు కల్పించాలన్న ప్రాతిపదికన పరీక్షలను నిర్వహించాలని కోరారు. యూపీఎస్సీ, ఆర్డీబీ, ఐబీపీఎస్, స్టాఫ్ సెలెక్షన్ కమిషన్, తదితర నియామక సంస్థల పోటీ పరీక్షలను ప్రాంతీయ భాషల్లో నిర్వహించాలని సీఎం కోరారు. తెలుగు అభ్యర్థులకు

**మొదటి నుంచీ అన్యాయమే:** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి చేపడతున్న నియామకాల్లో తెలుగు అభ్యర్థులకు మొదటి నుంచీ అన్యాయమే జరుగుతోంది. ప్రతిభ, నైపుణ్యాలు ఉన్నప్పటికీ కేంద్ర ఉద్యోగాలను ఆశించిన సంఖ్యలో పొందలేకపోతున్నారు. ఒక్క తెలుగు రాష్ట్రాల్లోనే కాదు... దక్షిణాది రాష్ట్రాల అభ్యర్థులంతా నష్టపోతున్నారు. హిందీ మాట్లాడే రాష్ట్రాల అభ్యర్థులతో పోటీ పడి ఉద్యోగాలు సాధించ లేకపోతున్నారు. కేంద్ర నియామక సంస్థలు హిందీ, ఇంగ్లీషు భాషల్లోనే పోటీ పరీక్షలు నిర్వహిస్తుండటంతో హిందీ రాని తెలుగు అభ్యర్థులు, ఆంగ్ల మాధ్యమంలో చదువుకోని అభ్యరులకు నష్టం వాటిల్లుతోంది. అన్ని రాష్ట్రాలకు సమాన అవకాశాలు కల్పించాలన్న సమాఖ్య విధానానికి ఇది విఘాతమన్న విమర్శలున్నాయి. అందుకే పోటీ పరీక్షల్లో ప్రాంతీయ భాషలను అనుమతించాలన్న డిమాండ్లు దక్షిణాది రాష్ట్రాల నుంచి వస్తున్నాయి. అదే పరంప రలో సీఎం కేసీఆర్ తాజాగా ప్రధానికి లేఖ రాశారు. హిందీ, ఇంగ్లిష్ భాషల్లోనే పోటీ పరీక్షలు నిర్వహించడంవల్ల దక్షిణాది రాష్ట్రాల అభ్యర్థులు 10 శాతానికి మించి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు పొందలే. కపోతున్నారు. ఉత్తరప్రదేశ్, బిహార్ వంటి రాష్ట్రాల యువత 40 శాతం ఉద్యోగాలను తన్నుకుపోతున్నారు. వీరికి హిందీ మాతృభాషగా ఉండటం, విద్యాభ్యాసం కూడా హిందీలోనే కొనసాగడంతో పోటీ పరీక్షల్లో సులభంగా నెట్టుకువస్తున్నారు. ఢిల్లీ, ఉత్తరాఖండ్ అభ్యర్థులు సైతం 50 శాతానికి పైగా ఉద్యోగాలను సాధించుకోగలుగుతున్నారు. 2013లో కేంద్రంలోని సెకండరీ విద్యా విభాగంలో 3034 పోస్టులకు పోటీ పరీక్ష నిర్వహిస్తే... ఉత్తరాదికి చెందిన అభ్యర్థులు 1585 ఖాళీలను కైవసం చేసుకోగా, దక్షిణాది అభ్యర్థులకు 48ఉద్యోగాలే లభించాయి. సెంట్రల్ రీజియన్ పరిధిలోకి వచ్చే బిహార్, ఉత్తరప్రదేశ్ అభ్యర్థులు 859 పోస్టులకు ఎంపికయ్యారు. 2018లో నిర్వహించిన ఇదే పరీక్షలో 6431 పోస్టులకుగాను నార్త్, సెంట్రల్ రీజియన్ల అభ్యర్దులు 4,522 పోస్టులకు ఎంపికయ్యారు. దక్షిణాది అభ్యర్థులకు 515 ఉద్యోగాలే లభించాయి."

**కేంద్ర ఆర్థిక మంత్రి భరోసా ఇచ్చినా...** తెలుగు, కన్నడ, మలయాళం, తమిళం భాషల్లో బ్యాంకు పోటీ పరీక్షలను నిర్వహిస్తామని 2019లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ హామీ ఇచ్చారు. అయినా అది కార్యరూపం దాల్చలేదు. *(ఆంధ్రజ్యోతి దినపత్రిక నుండి)*



సంపాదక హృదయం

# భాషల పట్ల వేరుచూపుతో సమైక్యత కుదరదు, ముందడుగూ పడదు

**దేశం** సమైక్యంగా ఉంటేనే అభివృద్ధి పథంలోకి దూసుకుపోగలమని ప్రధానమంత్రి నుండి కిందివరకూ మన నాయకులు అనుదినం పిలుపునిస్తూనే ఉంటారు. ఒక కుటుంబాన్ని నడిపే తల్లిదండ్రులూ, సంస్థలను నడిపే బాధ్యులూ వ్యవస్థలను నడిపే నేతలూ అందరినీ కలుపుకురావడంలో ఎంత బాధ్యతతో, ఎంత కూరిమితో పరిపాలించాలి. ఏ సందర్భంలోనైనా, ఏ స్థాయిలోనైనా ఇది తప్పదు. మరి, అనేక భాషాజాతులతో కలిసి ఏర్పడిన మన దేశం ఒక సమైక్య భారతదేశంగా ముందడుగు వేయాలంటే, అభివృద్ధి చెందాలంటే మన నేతలు ఎలా వ్యవహరించాలి!

రాజుల నుండి, విదేశీపాలకుల నుండి మెల్లమెల్లగా విముక్తి చెందుతూ ఒక ఆధునిక స్వతంత్ర దేశంగా రూపొందడానికి ఎంతో బలిదానం జరిగింది. సంఘర్షణ జరిగింది. పోరాటాలూ జరిగాయి. చివరకు మనకు మనం ఒక రాజ్యాంగాన్ని ఏర్పరచుకొని, స్వతంత్రజాతిగా నిలబడ్డాం. ఎన్నో లోపాలున్నా, ఎన్నో సమస్యలున్నా ఎంతో కొంత ముందడుగు వేస్తున్నాం. అనేకరంగాల్లో నెలకొనివున్న వైవిధ్యాలను సమన్వయం చేసుకొంటూ ముందుకు సాగుతున్నాం. అయినా, ఇన్నేళ్లయినా అనేక రంగాలలో దోపిడీ, అణచివేత, ఆధిపత్యం కొనసాగుతూనే ఉంది. విదేశీ పాలన నుండి బయటపడ్డామనుకున్నా, మన పాలకుల చేతగానితనం, స్వార్థపూరిత ప్రవర్తన, దోపిడీల నుండి బయటపడలేదు. పైకి కనిపించినట్లుండకపోయినా ఇందువల్ల దేశ ప్రజలమధ్య సమైక్యత సాధ్యపడటం లేదు. భాషల ఆధారంగా జాతులు సహజంగా ఏర్పడతాయి.

జాతుల మనుగడకూ, వికాసానికీ భాషలే ఆధారం. దీన్ని గుర్తించిన మన నేతలు, స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగాన్ని రూపొందించేటప్పుడే దేశ అధికార భాష విషయంపైనా, ఇతర సంబంధిత అంశాల మీదా సుదీర్ఘచర్చలు జరిపి రాజ్యాంగంలో అనేక అంశాలను పొందుపరచారు. వాటిని అర్థంచేసుకొవడానికి తిరస్కరిస్తున్నందువల్లనే మన నేతలు ఈ సమస్యను పరిష్కరించ లేకపోతున్నారు. ఇది అనేక భాషాజాతుల సమైక్య దేశమేనని, ప్రజాస్వామ్యవ్యవస్థలో ప్రజల భాషలన్నిటికీ సమస్థానం, సమన్యాయం ఉండాలనేదే ఆ వాస్తవం. దీన్ని సాధిస్తే తప్ప, నిజమైన పరిష్కారం లభించదన్న సత్యాన్ని ఇప్పటికైనా గుర్తించదానికి వాళ్లెందుకు తిరస్కరిస్తున్నారు?

రాజ్యాంగ నిర్మాతలు, 22 దేశభాషలను ఒక షెడ్యూల్‌లో చేర్చడంతో పాటు, తమ తమ రాష్ట్రాల్లో అధికారభాషా చట్టాలను రూపొందించి, దానిప్రకారం ప్రజాభాషలో పరిపాలించుకోవడానికి రాజ్యాంగరీత్యా అవకాశం కలిగించారు. అంతేగాకుండా, తమ భాషల్లో చదువులను సాగించుకోడానికి కూడా అన్ని అవకాశాలు రాజ్యాంగ రీత్యా ఇవ్వబడ్డాయి. రాజ్యాంగం షెడ్యూల్‌లో ప్రకటించిన 22 భాషలదీ ఒకటే ప్రతిపత్తి. వాటి మధ్య ఎక్కువ తక్కువలేమీ లేవు. ఉపయోగించుకునేదాన్ని బట్టి వాటి అభివృద్ధి వుంటుంది. ఇందుకు ఎన్ని అవరోధాలు ఉన్నా వాటి రాజ్యాంగబద్ధ ప్రతిపత్తికేమీ మార్పులేదు. ఆయా ప్రజల, వారి నేతల చైతన్యం పైనా, వారి ఉద్యమశక్తి పైనా, ఆధారపడి ఉన్న సంగతే అది

కూడా.

సాంకేతికంగా ఇప్పుడు ఎంతో అభివృద్ధి చెందాం. కనుక ఎన్నిభాషల్లోనైనా దేశం మొత్తానికీ నిరంతర అందుబాటులో ఉండవచ్చునని అందరకూ తెలిసిన సంగతి. కంప్యూటర్ టెక్నాలజీ పుణ్యమా అని, నిమిషాల్లో ప్రపంచంలోని వారందరూ పరస్పరం అందుబాటులోకొస్తున్న రోజుల్లో – దేశం మొత్తానికీ ఒకటే అధికారభాషగా ఉండాలనీ, ప్రపంచం మొత్తాన్నీ ఒకే భాషతో శాసించగలమనీ అనుకోవడం కాలం చెల్లిన సంగతి. ఇందువల్ల అన్ని భాషలకూ శక్తి పెరిగింది గనుక, ఏ భాషకూ పెత్తనం చేసే అవకాశం లేదు. కాకపోతే ఆచరణలో ఇందుకు ఉన్న అవరోధాలను దాటటానికి నిపుణులు ఇంకా కృషిని కొనసాగించాలి. ఉద్యమకారులు మన స్వార్థ ప్రభుత్వాలను గాడిన పెట్టుకోవాలి.

ఇప్పుడు తాజాగా మన మాతృభాష – మన అమ్మనుడి తెలుగు పరిస్థితిని చక్కబరచుకోవాలి. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ భయంకరమైన పరిస్థితి నెలకొన్న సంగతి మనకు తెలుసు. ఇందుకు కారణం కేవలం ప్రభుత్వాల పట్టనితనమే. అవగాహన, ఆలోచనా లేని రాజకీయ నిర్ణయాలే. అందులోనూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఘోరంగా వ్యవహరిస్తోంది. తెలంగాణ ప్రభుత్వం ఈ విషయంలో కొంత నయం.

ఈ పరిస్థితుల్లో ఇంచుమించు 21 తేదీ ప్రాంతంలోనే పత్రికల్లో, ప్రచార సాధనాల్లో తెలంగాణ ముఖ్యమంత్రి భారత ప్రభుత్వానికి వ్రాసిన లేఖ వివరాలూ, మహారాష్ట్ర ముఖ్యమంత్రి విడుదల చేసిన ఆదేశాలూ మెచ్చుకోదగ్గవి. వాటిని ఈ పక్క (5,6) పుటల్లోనే ఇచ్చాము. వివరంగా చూడండి. ఆలోచించండి.

ఈ అంశాల గురించి 'అమ్మనుడి'లో వ్రాస్తూనే ఉన్నాము. అంతేకాదు, తెలుగు భాషోద్యమ సమాఖ్య, రాష్ట్రాల్లోని తెలుగు ఉద్యమకారులు ఎంతోకాలంగా ఆందోళన చేస్తూనే ఉన్నారు. న్యాయస్థానాలను కూడా కదిలిస్తూనే ఉన్నారు. బోధనారంగానికి సంబంధించిన అంశాలు ఇప్పుడు చర్చలో ఉన్నాయి. ప్రస్తుతం సుప్రీంకోర్టులో కూడా కీలకాంశాలు పరిశీలనలో ఉన్నాయి. అయితే ప్రభుత్వాల విధానపర నిర్ణయాల్లో జోక్యం చేసుకొనేందుకు న్యాయస్థానాలకు పలు కారణాల వల్ల పరిమితులేర్పడుతున్నాయి.

కేంద్రప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థల నిర్వహణలోని సంస్థల ఉ ద్యోగాలను నింపేందుకు జరిగే పోటీపరీక్షల్లో హిందీ భాషేతరులకు జరుగుతున్న అన్యాయంపై తెలంగాణ ప్రభుత్వం ఇప్పుడు గొంతు విప్పింది. అలాగే మహారాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులలో రాజకీయంగా కీలక అవసరాలున్నాయి. తమిళనాడులో రాజకీయాలన్నీ తమిళ గౌరవం పైనా, హిందీ ద్వేషం పైనా సహజంగానే ఆధారపడి ఉంటాయి. తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వ నేతలకు తక్కిన స్థానిక భాషల పైన కూడా కంటగింపే. ఇవి మన పత్రిక చదువరులకే కాదు, అందరికీ తెలిసిన సంగతులే!

చివరగా చెప్పుకోవలసిన సంగతేమిటంటే ఈ భాషా రాజకీయాలు, ఆధిపత్య ధోరణులు మన దేశ సమైక్యతనూ, ప్రగతినీ ప్రమాదకరస్థాయికి చేర్చుతున్నాయి. కాని, కేంద్రంలోని నేతలూ, అక్కడి అధికారపక్షాలు – ముఖ్యంగా ఎన్‌డిఏ, యుపియేలు ఈ సంగతిని లోతుగా ఆలోచించడం లేదు. ఇప్పటి పాలకపార్టీ ఈ విషయంలో పైకి చెప్పే ఆశయాదర్శాలు ఎలా ఉన్నా, ఆచరణలో అవలంబిస్తున్న పద్ధతి సమంజసంగా లేదు. వారికి సమస్య లోతుపాతులు అందరికంటే బాగా తెలుసు. అయినా, వారి ప్రాథమ్యాలు, లక్ష్యాలు వేరే ఉన్నాయి. రానున్న ప్రమాదాలను, భాషారాజకీయాల సున్నితత్వం వంటి అంశాలను వారు తీవ్రంగా పరిగణించడం లేదు.

భాషల పట్ల వివక్ష (వేరుచూపు)తో సమైక్యత కుదరదనీ, ముందడుగూ పడదనీ పాలక వర్గాలు గ్రహించాలి.

తేదీ : 23-11-2020

సామల రమేష్‌బాబు

ప్రొ. రాజ్యరమ
98494 90086

# భాషాబోధనలో భాషాశాస్త్రం

'**భాషా** బోధన ఇంకా మూల్యాంకనం' అనే విషయాన్ని బోధించేటప్పుడు తరచూ ఇలా అనుకుంటూ ఉంటాను: భాషా బోధనలో పరిశోధన ఎక్కువగా యూరోపియన్ భాషలు ముఖ్యంగా ఆంగ్లభాషాబోధన (ELT) గురించినవే. అంతర్జాలంలో ఆంగ్లభాషాబోధనకు సంబంధించిన పరిశోధనా పత్రాలూ, పాఠ్య పుస్తకాలూ, వ్యాసాలూ, మార్గదర్శకాలూ ఇబ్బడిముబ్బడిగా లభ్యమౌతాయి. అదే ఆంగ్లేతరభాషలు, ముఖ్యంగా మన భారతీయభాషల విషయానికి వస్తే, ఈ రకమైన వనరులు అంటే విస్తృతమైన పరిశోధనలు, పరిశోధనా వ్యాసాలు చాలా అరుదుగా కనిపిస్తాయి. అంతేకాదు, భాషా బోధనలో భాషాశాస్త్రం వల్ల ఒనగూడే ప్రయోజనాలూ, శాస్త్రీయ దృక్పథం, పటిష్ఠమైన బోధనా పద్ధతుల గుర్తింపు- తెలుగూ తదితర భాషలలో కనిపించడంలేదు. అందువలన తెలుగు భాషాబోధనా లక్ష్యాలు ఏవి, వాటిని సాధ్యం చేసే బోధనా పద్ధతులు ఏవిధంగా ఉండాలి? అనే కోణంలో మన పరిశోధనలు జరగవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఈ గ్రహింపు ప్రతి భాషకూ వర్తిస్తుంది. ప్రస్తుత తరుణంలో దాని అవసరం ఎక్కువగానే కనిపిస్తోంది.

తెలుగు భాషా బోధనా సందర్భాలు రెండు రకాలుగా ఉండొచ్చు: మొదటిది- తెలుగు ప్రథమ భాషగా ఉన్న సందర్భాలు కాగా, రెండవది, తెలుగు ద్వితీయ భాషగా ఉన్నవీ. సందర్భం ఏదైనా శాస్త్రీయ దృక్పథం లోపించిందనే చెప్పాలి. తెలుగును ప్రథమ భాషగా ఎంచుకున్న విద్యార్థుల్లో తెలుగువారూ ఇంకా తెలుగేతరులూ ఉండవచ్చు. విద్యార్థుల భాష లేదా సామాజిక నేపథ్యం ఏదైనా, వారికి అనుగుణంగా భాష ఏవిధంగా బోధించాలి? అందులో ఏఏ అంశాలు ఉండాలి? ఉపాధ్యాయులు ఎటువంటి శిక్షణ కలిగి ఉండాలి? వారు ఏ పద్ధతులు పాటించాలి? అనే అంశాలపై దృష్టి సారించాల్సి ఉంటుంది. భాషాబోధనలో మొట్టమొదటగా లక్ష్యాలను నిర్దేశించుకోవాలి. పటిష్ఠమైన ప్రణాళికతో, శాస్త్రీయ బోధనా పద్ధతులతో, సమకాలీన సమాజన్ని ప్రతిబింబించే పాఠ్యాంశాలతో బోధన సాగాలి. మాతృభాషని మొదటి భాష (First Language) గా ఎంచుకున్న విద్యార్థులు అదనంగా పాఠశాలలో ఏం నేర్చుకోవాలని ఆశిస్తారు? అప్పటికే వారు భాషా వ్యవహార జ్ఞానాన్ని పొంది వ్యవహర్తలుగా చలామణీ అవుతున్నారు. వారికి భాషను ఒక విషయంగా బోధించడం ద్వారా ఒనగూడే ప్రయోజనం ఏమిటి?

అయితే ఇక్కడ గమనించవలసిన విషయం ఏమిటి అంటే, పిల్లలు బడికి వచ్చేటప్పటికి భాషావ్యవహార జ్ఞానం ఉన్నప్పటికీ వారికి అక్షర జ్ఞానం ఉండదు. కాబట్టి భాషాబోధన ఆ దిశగా సాగాలి. అక్షర జ్ఞానంతో పాటు చదవడం, రాయడం, వినడం, మాట్లాడటం (RWLS) వంటి భాషా నైపుణ్యాలను నేర్పాలి. విద్య, వాణిజ్యం, వివిధ వృత్తులలో వాడే 'నిర్దిష్టమైన' భాషా ప్రయోగంలో శిక్షణ నివ్వాలి. ఇది భాష పట్ల శాస్త్రీయ దృక్పథంతోనే సాధ్యం కాగలదు. భాషా నైపుణ్యాలు వృత్తి నైపుణ్యాలను పొందడంలో ఎంతో ఉపయుక్తంగా ఉండి తద్వారా ఆర్థిక పరిపుష్టికి దోహదం చేస్తాయి. ఒక వృత్తిలో రాణించడానికి, ఆ వృత్తికి సంబంధిత విషయ పరిజ్ఞానాన్ని పొందడానికి, భాషా నైపుణ్యాలు ఎంతో అవసరం. భాషానైపుణ్యాలు వృత్తినైపుణ్యాలకు పదునుపెడతాయి. ఇలాంటి నైపుణ్యాలను అందించాలంటే- భాషలో మనకు ఏమి అవసరమవుతాయి? ఉద్యోగంలో భాగంగా భాషని లిఖిత మౌఖిక రూపాల్లో ప్రయోగించవలసిన సందర్భాలు ఏన్నో ఉంటాయి. ఉత్తర ప్రత్యుత్తరాలు జరపాల్సి రావచ్చు, సమావేశాలు నిర్వహించవలసి రావచ్చు. ఇటువంటి భాషా ప్రయోగజ్ఞానాన్ని కూడా అందించగలిగేలా రూపొందించాలి- మన భాషా బోధనలోని.

అంతేకాదు, సమాజంలో భాషను ఏవిధంగా వాడితే, సమాజం మనని సభ్యులుగా అంగీకరిస్తుందో ఆజ్ఞానం మనం నేర్చుకునే భాషలో ఉండాలి. సమాజంలో భాషను ఏవిధంగా ఉపయోగించాలి? ఎలామాట్లాడాలి? అనేవిషయాలపై సామాజిక భాషా శాస్త్రంలో అనేక పరిశోధనలు జరిగాయి. **భాషాబోధన అనేది ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠ్యాంశాలు, పాఠ్యపుస్తకాలు, బోధనాపద్ధతులూ, ప్రభుత్వ విధానాలు, మొదలైన ఎన్నో అంశాలతో కూడిన ఒక సంక్లిష్ట వ్యవస్థ.** ఇందులో ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషిస్తారు. వీరు సమకాలీన భాషపై పట్టు, సమగ్ర అవగాహన, సానుకూల దృక్పథం కలిగినవారై ఉండాలి. వీరికి ఎప్పటికప్పుడు సరికొత్త శాస్త్రీయ బోధనా పద్ధతులలో శిక్షణ ఇవ్వాలి. భాషాబోధనలో జరిగే కొత్త పరిశోధనలు వారికి అందుబాటులోకి తీసుకురావాలి. వాస్తవ పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి.

దీనికి తోడు భాషను బోధించే ఉపాధ్యాయులు, గ్రాడ్యుయేట్స్, పోస్టుగ్రాడ్యుయేట్స్ అయినప్పటికీ వారిది ఎక్కువగా సాహిత్య నేపథ్యం. ఈ నేపథ్యం నుంచి వచ్చినవారికి భాషపై శాస్త్రీయదృక్పథం కంటే సంప్రదాయ బద్ధత కొంచెం ఎక్కువగానే ఉంటుందని చెప్పవచ్చు. భాషాబోధన కేవలం కొన్ని కావ్యాలూ, పద్యాలూ బోధించడానికే పరిమితం కాకూడదు. అలా అని కొన్ని వ్యాకరణ సూత్రాలూ, మరిన్ని సంధులూ సమాసాల బోధనతో చేతులు దులిపేసుకో కూడదు. భాషా బోధన ఎప్పుడూ భాషా శాస్త్ర ఆధారిత శాస్త్రీయ దృక్పథంతో కొనసాగాలి. భాషను ఒక పనిముట్టుగా వాడే చాతుర్యం గానీ, చాకచక్యత గానీ విద్యార్థుల్లో పెంపొందించడం భాషాబోధన యొక్క ముఖ్య లక్షణంగా గుర్తించాలి. దీనికి భాషా శాస్త్రంపై

ఉపాధ్యాయులకు అవగాహన ఎంతో అవసరం.

భాషాశాస్త్రం- వర్ణ, పద, వ్యాకరణ వ్యవస్థల అభ్యసననే కాదు సమాజంలో భాష యొక్క పాత్ర ఏమిటి? ఏ విధంగా మనం దాన్ని గ్రహించాలో, కూడా బోధిస్తుంది. ఉపాధ్యాయులు కేవలం పాఠ్యపుస్తకాల్లో ఉన్న అంశాలను మాత్రమే బోధించి వెళ్లిపోకుండా, బయట సంభాషణల్లో భాషని ఏవిధంగా ఉపయోగించాలన్న విషయాలను విద్యార్థులకు బోధించాలి. దానికి శాస్త్రీయ దృక్పథం ఎంతో అవసరం. వీటితోపాటు భాషపై సమగ్ర అవగాహన, సానుకూలదృష్టి ఎంతో అవసరం. విద్యార్థుల అవసరాలను గుర్తెరిగి వాటికి అనుగుణంగా పాఠ్యాంశాలను తయారు చేయడం ఎంతోముఖ్యం. తద్వారా విద్యార్థులను ఉత్తేజపరిచి, భాష ఉపయోగాన్ని తెలియచేసిన వారం అవుతాం.

టైమ్స్ ఆఫ్ ఇండియా, ఫిబ్రవరి 24, 2020 న ప్రచురించిన ఒక సమాచారం ప్రకారం- ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఓ నాలుగో తరగతి విద్యార్థి రెండో తరగతి హిందీ పాఠ్య పుస్తకాన్ని చదవలేక పోయాడు. తెలుగు కూడా ఇదే దీనావస్థలో ఉంది. మా విద్యార్థులు వారి ప్రాజెక్ట్ పనిలో భాగంగా చేసిన సర్వేక్షణలలో చాలా మంది పాఠశాల విద్యార్థులు తెలుగులో చదవడానికీ, రాయడానికీ కష్టపడుతున్నారని తేలింది. తరగతి గదుల్లో తెలుగుభాష -చాలా దీనస్థితిలో ఉందని తేలింది. విద్యార్థుల యొక్క సామాజిక, ఆర్థిక నేపథ్యాలే కాకుండా, ప్రభుత్వ పాఠశాలల్లో వారికి లభిస్తున్న విద్య, తల్లిదండ్రుల యొక్క నిరక్షరాస్యత, పేదరికం- దీనికి కారణాలు కావచ్చు. ఉపాధ్యాయులు ఈ అవరోధాలను ఎదిరించి వారికి శాస్త్రీయపద్ధతిలో భాష నేర్పడానికి సిద్ధపడాలి. భాషాబోధన ప్రాథమికస్థాయిలో ఏవిధంగా జరుగుతోంది? అన్నది ఇంకా సర్వేక్షణలు చేసి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (2017) వారి అంచనాల ప్రకారం తెలుగు విద్యార్థుల సగటు మార్కులు జాతీయ సగటు స్థాయి కంటె చాలా తక్కువలో ఉంది. వీరికి భాషా వినిమయంలో తెలుగు ఒక బలహీనమైన లంకెగా ఉంది. దీనికి కారణాలు ఏమిటి?

విచిత్రంగా భాషా బోధకుల నియామకంలో మాత్రం విద్యావ్యవస్థలు ఏ విధమైన కనీస అర్హతలనీ పాటించడం లేదనిపిస్తోంది. కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ, ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలల్లోనూ భాషలో ఎటువంటి ప్రత్యేక శిక్షణా లేని ఉపాధ్యాయులు, విజ్ఞాన శాస్త్రాలూ, ఇంజనీరింగ్ చదివిన వారు కూడా భాషను బోధించడం గమనించదగ్గ విషయం. భాషలని బోధించడానికి ప్రత్యేకంగా టీచర్లని నియమించకుండా ఇతర సబ్జెక్ట్ టీచర్ల చేత బోధింపచేయడం కూడా జరుగుతుంది. **అంటే మాట్లాడడం వచ్చిన ప్రతివారూ భాషను బోధించగలిగి వుంటారనే అభిప్రాయం చాలా మందికి ఉంది.** అదే ప్రభుత్వ పాఠశాలల విషయానికొస్తే ఇక్కడి ఉపాధ్యాయులు ఉన్నత విద్యార్హతలు కలిగి ప్రవేశ పరీక్షల ద్వారా ఎంపిక కాబడ్డవారు. కానీ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు విద్యని అభ్యసించడంలొ కృతకృత్యులు కాలేకపోతున్నారు. ఘోరంగా విఫలమౌతున్నారు. ఎందువల్ల? ఈ పరిస్థితులలో మార్పు రావాలంటే బాషాబోధనా వ్యవస్థలో ఈ కింద సూచించిన మార్పులు తీసుకురావాలి:

1. భాషా బోధన శాస్త్రీయ పద్ధతులననుసరించి జరగాలి.
2. భాషా బోధనలో భాషా శాస్త్ర ఆవశ్యకతని గుర్తించాలి.
3. సమకాలీన భాషావసరాలని గుర్తించి, వాటికి అనుగుణంగా పాఠ్యపుస్తకాలని రూపొందించాలి.
4. శాస్త్రీయ బోధనా పద్ధతులని ఉపయోగించాలి.
5. నూతన భాషా బోధనాపద్ధతులలో ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులకి శిక్షణ ఇవ్వాలి.
6. భాషాబోధనలో జరుగుతున్న నూతన ప్రయోగాలూ, పరిశోధనలూ బోధకుల దృష్టికి తేవాలి.
7. తరగతి గదిలో విద్యార్థికి తగినంత స్వేచ్ఛను ఇచ్చి, బోధనా క్రమంలో వారిని భాగస్వాములను చేయాలి.
8. అన్నిటికన్నా ముఖ్యమైనది విద్యార్థుల భాషా నేపథ్యం గుర్తించి వారిపట్ల సానుభూతితో వ్యవహరించాలి.

మరికొన్ని సంబంధిత అంశాలలో మార్పులు తీసుకువచ్చి భాషాబోధన ఒక ఆసక్తికరమైన పనిగా రూపొందించవచ్చు.

బెంజమిన్ ఫ్రాంక్లిన్ చేసిన ఈ వ్యాఖ్య విద్యార్థి అంతరంగానికి అద్దం పడుతుంది: *"నాకేదయినా చెప్పు మర్చిపోతా! బోధించు, గుర్తు పెట్టుకుంటా, నన్ను భాగస్వామిని చెయ్యి నేర్చుకుంటా."*

ఈ అవగాహనతో సాగే భాషాబోధన వంద శాతం మంచి ఫలితాలనిస్తుంది.

అనువర్తిత భాషాశాస్త్ర, అనువాద అధ్యయనాల కేంద్రం,
హైదరాబాదు విశ్వవిద్యాలయంలో భాషాబోధన,
సంగణక భాషాశాస్త్రములలో పరిశోధకురాలు.



**"మనం విద్యను ఎంతగా నిర్లక్ష్యం చేస్తే మన అవిశ్వాసం కూడా అంతగా పెరిగిపోతుంది. మన విద్య కూడా మన జీవితం నుండి, అవసరాల నుండి వెనక్కి మళ్ళి నిర్లక్ష్యధోరణి కూడుకున్న దవుతోంది. మన శీలంమీద, మన వ్యావహారిక జీవితం మీద ఎటువంటి ప్రభావమూ యీ చదువు కలగచేయటం లేదు. అంటే మన చదువుకూ జీవితానికీ మధ్య అంతరాలు, అగాధాలు పెరిగిపోతున్నాయి. యీ రకమైన అపూర్ణ జ్ఞానం, అపూర్ణ జీవితం దయవల్ల భారతీయుల జీవితం ఒక నాటకంలా, అనుకరణమాత్రంగా తయారవుతోంది."**

పి. ప్రకాష్, మెండెం బాపూజీ, అన్నం నరేశ్

# ప్రైవేటు బడులలో ఆంగ్ల మాధ్యమం: తల్లిదండ్రుల అంచనాలు మరియు కొన్ని వాస్తవాలు

### పరిచయం

**భా**రతదేశం భిన్న భౌగోళిక, మతాలూ, సంస్కృతులూ, భాషల నిలయం. ఇలాంటి ఒక ప్రత్యేకమైన భూభాగంలో ఎన్నో భిన్న భాషాకుటుంబాలకు చెందిన వందలాది భాషలతో కాలక్రమేణా భారతదేశం ఒక ప్రత్యేక భాషా ప్రాంతంగా అవతరించి భారతీయ భాషలు ప్రత్యేక ప్రాదేశిక భాషలుగా రూపాంతరం చెందాయి.ఆ విధంగా రూపాంతరం చెందిన నూతన భాషలు ఒక్కొక్క ప్రాంతీయ భాషగా అభివృద్ధి చెందాయి. అభివృద్ధిలో భాగంగా అనేకమంది రచయితలు ఆయా భాషల సారస్వత అభివృద్ధికి ఎంతగానో తోడ్పడినారు. కాలక్రమేణా ఈ విధంగా అభివృద్ధి చెందిన భాషలు- ఆయా రాష్ట్రాల అధికారిక భాషలుగా, పాలనాభాషలుగా ఇంకా విద్యామాధ్యమ భాషలుగా ఆవిర్భవించాయి. ఇలాంటి ప్రాంతీయ భాషలలో చదివిన ఎంతోమంది విద్యావంతులు అనేక ఉన్నత శిఖరాలను అధిరోహించారు. అంతేకాక, సమాజంలో గొప్పగొప్ప పేరు ప్రఖ్యాతులను కూడా సంపాదించారు. ఇందుకు, వారు తమ తమ మాతృభాషలలో విద్యను అభ్యసించడమే ప్రధాన కారణం. మాతృభాషలు ఎంతో గొప్పగా విలసిల్లుతున్న తరుణంలో అనేక ఐరోపా దేశవాసులు భారతదేశానికి వ్యాపారం నిమిత్తం వచ్చినప్పటికీ, ఆంగ్లేయులు మాత్రం మన భూభాగాలను కైవసం చేసుకొని, రెండు శతాబ్దాల పాటు పాలకులుగా వ్యవహరించారు. పంతొమ్మిదవ శతాబ్దంలో వారి పరిపాలనా సౌలభ్యం కొరకు ఆంగ్ల భాషకు భారతదేశ ఉపఖండంలో పునాది వేసినారు. పాలకులు చూపించిన ఉద్యోగఉపాధి అవకాశాలకు తప్పనిసరి పరిస్థితులలో చాలా మంది ఆంగ్ల భాషకు ఆకర్షితులయినారు. కాలక్రమంలో ఇరవయ్యవ శతాబ్దం చివరి అంకంలో భారతదేశ సహఅధికార భాషగా ఇంగ్లీషు దాని ఉనికిని సుస్థిరం చేసుకుంది.అది మొదలుకొని ఆంగ్ల భాష భారతీయ భాషల వాడుక రంగాలపై అడ్డూఅదుపూలేని ప్రభావం చూపించటం మొదలు పెట్టింది. క్రమక్రమంగా వివిధ భారతీయ మాతృభాషలు వాడుకలో ఉన్న పాలనా విద్యారంగాలతోబాటు అన్ని ముఖ్యమైన రంగాలలోనూ ప్రవేశించి వాటి ఔన్నత్యాన్ని దెబ్బతీసి, వాటి ఉనికినే ప్రశ్నార్థకంగా మార్చివేసింది. దీనితో పాటుగా ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు తీసుకున్న భాషా పరమైన నిర్ణయాలు మాతృభాషల ఉనికిని దెబ్బతీసే విధంగా తయారయినాయి.

### ఆంగ్లభాషపై తెలుగు రాష్ట్రాల మక్కువ

రెండు తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్ ఇంకా తెలంగాణా రమారమి పదికోట్ల జనాభా కలిగి ఉన్నాయి. గత శతాబ్దపు ఎనిమిదవ దశకం నుంచి ఇప్పటి వరకు ఆంగ్ల మాధ్యమంతో నడిచే బడులకు నిబంధనలతో నిమిత్తంలేకుండా ఇబ్బడిముబ్బడిగా అనుమతులు ఇవ్వడంతో వీధికొక ఆంగ్ల మాధ్యమ బడి వెలసింది. అంతేకాక అనుమతులు పొందిన బడుల యాజమాన్యాలు ఆంగ్ల మాధ్యమంలో చదివితే ఉద్యోగం వస్తుందనే నినాదాన్ని వ్యాపార ధోరణిలో భాగంగా తెరపైకి తీసుకొచ్చాయి. ఈ నినాదానికి ప్రభావితమైన పేద, మధ్య తరగతికి చెందిన తల్లిదండ్రులు ఆంగ్ల మాధ్యమ చదువుల పర్యవసానం ఆలోచించకుండా తమ పిల్లలను ప్రాథమిక విద్య నుంచే ఆంగ్ల మాధ్యమంలో చేర్పించడం మొదలుపెట్టారు. దానితో పాటుగా సమాజంలో వ్యక్తుల కీర్తి ప్రతిష్ఠలను ఆంగ్లభాషా జ్ఞానంతో ముడిపెట్టడం వలన తెలుగు రాష్ట్రాల్లో ఆంగ్ల మాధ్యమంపై మక్కువ పెరిగింది. ఫలితంగా ఆంగ్ల భాషా మాధ్యమ పాఠశాలలు పుట్టగొడుగులుగా పుట్టుకొచ్చినవి. ఇప్పుడు ఒక సాధారణ ఆంగ్ల మాధ్యమ పాఠశాలను ఉదాహరణగా తీసుకుందాం. దీని కోసం విజయవాడ పట్టణంలో ఆంగ్లం మాధ్యమంగా కొనసాగిస్తున్న ఒక పాఠశాల యొక్క తల్లిదండ్రులను ప్రత్యక్షంగా కలిసి, వారి అభిప్రాయలను తెలుసుకొని, వారు ఇచ్చిన సమాచారం ఆధారంగా, కింది పట్టికను తయారుచేయుటం జరిగింది. ఈ పట్టిక, ఆ పాఠశాల రుసుముల (ఫీజు) విధివిధానాలను తెలియజేస్తుంది. ఉదాహరణగా ఇచ్చిన సాధారణ

**ఒక సాధారణ ఆంగ్ల మాధ్యమ పాఠశాల మాతృక**

| క్ర.సం. | తరగతి | సెక్షనుకు 60 చొప్పున 7 సెక్షన్లలో మొత్తం 12 తరగతులలో విద్యార్థులు | అభివృద్ధివిరాళం ఎల్.కే.జీ విద్యార్థికి | రుసుం 10,000 చొప్పున 3విడతలుగా | ఆటో ప్రయాణం ఖర్చునెలకు | పుస్తకాల ఖరీదు ఏడాదికి | దుస్తులు | ప్రతి విద్యార్థికీ ఏడాదికి ఖర్చు | మొత్తం |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | ఎల్.కే.జీ | 420 | 20,000 | 30,000 | 1000 | 4000 | 2000 | 57,000 | 2,29,40,000 |
| 2 | యూకేజీ | 420 | 0 | 30,000 | 1000 | 4000 | 2000 | 37,000 | 1,55,40,000 |
| 3 | 1-10 | 4200 | 0 | 30,000 | 1000 | 4000 | 2000 | 37,000 | 15,54,00,000 |
| 4 | 12 | 5040 | | | | | | | 19,48,80,000 |

ఆంగ్లమాధ్యమ పాఠశాలలో ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు రమారమి ఐదు వేల పైచిలుకు విద్యార్థులు ఉన్నారు. వీరిలో ఎక్కువ శాతం ఆర్థికంగా స్థిరపడిన ఉన్నత వర్గాలవారు, ఆపైన పేదా మధ్య తరగతి వర్గాలకు చెందినవారూ ఉన్నారు. ఒక సంవత్సర కాలంలో ఒక సాధారణ ఆంగ్ల మాధ్యమ పాఠశాల దాదాపుగా ఇరవై కోట్ల రూపాయలను ప్రత్యక్షంగానో లేదా పరోక్షంగానో ఆర్జిస్తోంది. ఒక సాధారణ పాఠశాలే ఇరవై కోట్ల రూపాయలను ఆర్జిస్తుంటే, కార్పొరేటు హంగులతో పుట్టుకొచ్చిన ఆంగ్ల మాధ్యమ పాఠశాలలు ఎంతగా ఆర్జిస్తున్నయో తల్లిదండ్రుల ఊహలకే వదిలేయవచ్చు.

విద్యార్థులు పదవ తరగతి మధ్యలో ఉండగానే ఆంగ్లమాధ్యమ కార్పొరేటు కళాశాలల యొక్క ప్రజాసంబంధాల అధికారులు (పీ.ఆర్.ఓ) పరీక్షా ఫలితాలు వచ్చే సమయానికి ఆకర్షణీయమైన ప్రతిపాదనలతో తల్లిదండ్రులతోనూ, తల్లిదండ్రుల ద్వారా పిల్లలతోనూ ముందుగానే ప్రవేశాలకు తెరతీస్తారు. వచ్చిన ఏ ప్రజాసంబంధ అధికారైనా తమ కళాశాలలో ప్రొజెక్టర్లతో డిజిటల్ క్లాస్ రూంలు ఉన్నాయి అనీ, తరగతి గదులు శీతలీయయంత్రాలతో (ఏ.సి)అమర్చి ఉన్నాయనీ డాంబికాలు పలుకుతారే తప్ప; మా దగ్గర ఆంగ్ల మాధ్యమంలో కళాశాలను నడపటానికి అర్హత కలిగిన మానవవనరులు ఉన్నాయని గానీ, ఆంగ్ల మాధ్యమం చదవడం వలన ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలలో, భారతీయ వైద్య కళాశాలలలో ప్రవేశాలు దొరుకుతాయనీ ప్రజాసంబంధ అధికారిగానీ, కళాశాలల యాజమాన్యాలు గానీ హామీలు ఇవ్వవు. పర్యవసానంగా పేద, మధ్య తరగతికి చెందిన అత్యధిక శాతం విద్యార్థులు కార్పొరేటు వలలో చిక్కుకుపోతున్నారు.

**ఆంగ్లమాధ్యమంపై తల్లిదండ్రుల అంచనా - కొన్ని వాస్తవాలూ**

ఆంగ్ల మాధ్యమంలో చదివితేనే ఐ.ఐ.టీ.ల్లో ప్రవేశం దొరుకుతుందా? అలా చదివివారే నీట్ (NEET) లాంటి ప్రవేశ పరీక్షలో అర్హత సాధిస్తారా? వీటిలో చదివిన వారికే ఖచ్చితంగా నీట్ పరీక్షల్లో అర్హత పొందడం సాధ్యమని చెప్పలేం. ఎందుకంటే, ప్రవేశ పరీక్షలలో అర్హత సాధించటం, కేవలం విషయ అర్థావగాహన మీద ఆధారపడి ఉంటుంది. ఎవరైతే విషయాన్ని సంపూర్ణంగా అర్థం చేసుకోగలుగుతారో, అలా అర్థం చేసుకున్న విషయ పరిజ్ఞానాన్ని సందర్భోచితంగా పరీక్షా సమయంలో ఎవరైతే రాయగలుగుతారో- వారే అర్హత సాధిస్తారు. కానీ, కేవలం ఆంగ్ల మాధ్యమంలో మాత్రమే చదవడం వలన అర్హత సాధిస్తారు అనేది అపోహ. ఒకవేళ ఆంగ్ల మాధ్యమంలోనే చదివితే ఐ.ఐ.టీ.ల్లో, నీట్ ద్వారా భారతీయ వైద్య కళాశాలలలో ప్రవేశం దొరుకుతుంది అనుకుంటే- వాస్తవానికి ఆ ప్రవేశ స్థానాలు (సీట్లు) ఎన్ని ఉన్నాయి, ఉంటే అవి ఏ విధంగా అందుబాటులో ఉన్నాయి, ఇంకా అవి ఎవరెవరికి ఎన్ని అందుబాటులో ఉన్నాయి అనేది- ఈ కింది పట్టిక ద్వారా- తల్లిదండ్రుల అంచనాలనూ మరియు వాస్తవాలనూ ప్రస్ఫుటంగా విశదీకరిస్తుంది. రెండు తెలుగు

**ఐ.ఐ.టీ.ల్లోసీట్ల కేటాయింపు**

| ఐ.ఐ.టీల సంఖ్య | సా.సీ. | సా.సీ.-దివ్యాం | సాసీ-ఆ.వె.వి. | సా.సీ.-ఆ.వె.వి. దివ్యాం. | షె.కు | షె.కు.-దివ్యాం. | షె.తె. | షె.తె. దివ్యాం. | ఇవెకు-ఉ.ద.వి | ఇవెకు-ఉ.ద.వి.-దివ్యాం. | మొత్తం |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 23 | 6206 | 328 | 1502 | 71 | 2291 | 116 | 1152 | 58 | 4126 | 203 | 16053 |

**ఎన్ఐటిల్లో సీట్ల కేటాయింపు**

| ఐ.ఐ.టీల సంఖ్య | సా.సీ. | సా.సీ.-దివ్యాం | సాసీ-ఆ.వె.వి. | సా.సీ.-ఆ.వె.వి. దివ్యాం. | షె.కు | షె.కు.-దివ్యాం. | షె.తె. | షె.తె. దివ్యాం. | ఇవెకు-ఉ.ద.వి | ఇవెకు-ఉ.ద.వి.-దివ్యాం. | మొత్తం |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 31 | 9150 | 465 | 2037 | 123 | 3311 | 180 | 1991 | 123 | 5824 | 302 | 23506 |

**ఐ.ఐ.ఐ.టిల్లో సీట్ల కేటాయింపు**

| ఐ.ఐ.టీల సంఖ్య | సా.సీ. | సా.సీ.-దివ్యాం | సాసీ-ఆ.వె.వి. | సా.సీ.-ఆ.వె.వి. దివ్యాం. | షె.కు | షె.కు.-దివ్యాం. | షె.తె. | షె.తె. దివ్యాం. | ఇవెకు-ఉ.ద.వి | ఇవెకు-ఉ.ద.వి.-దివ్యాం. | మొత్తం |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 25 | 2273 | 103 | 483 | 25 | 793 | 47 | 400 | 17 | 1431 | 71 | 5643 |

**జి.ఎఫ్.టి.ఐల్లో సీట్ల కేటాయింపు**

| ఐ.ఐ.టీల సంఖ్య | సా.సీ. | సా.సీ.-దివ్యాం | సాసీ-ఆ.వె.వి. | సా.సీ.-ఆ.వె.వి. దివ్యాం. | షె.కు | షె.కు.-దివ్యాం. | షె.తె. | షె.తె. దివ్యాం. | ఇవెకు-ఉ.ద.వి | ఇవెకు-ఉ.ద.వి.-దివ్యాం. | మొత్తం |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 20 | 2682 | 137 | 517 | 23 | 757 | 41 | 437 | 20 | 964 | 42 | 5620 |

| క్ర.సం. | విద్యాసంస్థల సంఖ్య | విద్యాసంస్థల వర్గం | సీట్ల సంఖ్య |
|---|---|---|---|
| 1. | 23 | ఐఐటీలు | 16053 |
| 2. | 31 | ఎన్.ఐ.టీలు | 23506 |
| 3. | 25 | ఐ.ఐ.ఐ.టిలు | 5643 |
| 4. | 20 | జి.ఎఫ్.టి.ఐలు | 5620 |
| మొత్తం | 99 | అన్నీ కలిపి | 50,822 |

**ఆల్ ఇండియా స్థాయిలో నీట్ సీట్లమాతృకలు**

| క్ర.సం. | కళాశాలల వర్గం | కళాశాలల సంఖ్య | ఎమ్.బిబిఎస్. |
|---|---|---|---|
| 1 | ప్రభుత్వ | 272 | 41,388 |
| 2 | ప్రైవేటు కళాశాలలూ డీమ్డు విశ్వవిద్యాలయాలూ | 260 | 35,540 |
| 3 | మొత్తం | 532 | 76,928 |

రాష్ట్రాల్లోనూ ఏటా సుమారు పది లక్షల మంది విద్యార్థులు మాధ్యమిక పరీక్షలలోఉత్తీర్ణులవుతారు. పైన ఉదహరించిన మాతృకలలోని గణాంకాల ప్రకారం యాభై వేల ఎనిమిదివందల ఇరవై రెండు ప్రవేశ స్థానాలు (సీట్లు) దేశవ్యాప్తంగా ఉన్న ఐ.ఐ.టిల్లోనూ, డెబ్బైఆరు వేలతొమ్మిది వందల ఇరవై ఎనిమిది ప్రవేశ స్థానాలు (సీట్లు) వైద్య కళాశాలల్లోనూ కేటాయించబడ్డాయి. దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం రెండుకోట్ల అరవై లక్షలమంది విద్యార్థులు మాధ్యమిక విద్యను పూర్తి చేసుకుంటున్నారు. వారిలో తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు పది లక్షల మంది విద్యార్థులు ఉంటారు. తల్లిదండ్రులు అవగాహన చేసుకోవాల్సిన విషయం ఏమిటంటే, రెండుకోట్ల అరవై లక్షల మంది విద్యార్థులు ఉంటే, కేవలం ఒక లక్షా ఇరవై ఏడు వేల ఏడు వందల నలభై నాలుగుప్రవేశాలు (సీట్లు)మాత్రమే సాంకేతిక, వైద్య కళాశాలల్లో అందుబాటులో ఉన్నాయి. ఈ ఒక లక్షా ఇరవై ఏడు వేల ఏడు వందల నలభై నాలుగు ప్రవేశ స్థానాలకూ (సీట్లు) దేశవ్యాప్తంగా రిజర్వేషన్ ప్రకారం జాతీయ స్థాయిలో కేటాయించబడతాయి. ఆంగ్ల మాధ్యమంలోనే చదివితే ఉన్నత సాంకేతిక ఇంకా వైద్య కళాశాలల్లో ప్రవేశాలు (సీట్లు) సాధిస్తారు అనుకున్నా, తల్లిదండ్రుల పైన ఉదహరించిన మాతృకలలో వారి వారి పిల్లలు ఏ స్థాయిలో ఉంటారో పూర్తిగా అర్థం చేసుకోవలసి ఉంటుంది.

పైన చెప్పిన విధంగా ఐ.ఐ.టీల్లో మరియు వైద్య కళాశాలల్తో పాటుగా, భారతదేశంలోని ఇంజినీరింగు కళాశాలల్లోనూ వాటి ప్రవేశ స్థానాలను గమనించితే, ఇక్కడ కూడా అదే పరిస్థితి పునరావృతం అవుతున్నట్టు అనిపిస్తుంది. భారతదేశంలో మొత్తం ఇంజినీరింగు కళాశాలలను గమనించితే. మొత్తం 3,289 ఇంజినీరింగు కళాశాలలు ఉంటే, అందులో 15,53,809 ఇంజినీరింగు ప్రవేశస్థానాలు (సీట్లు) అందుబాటులో ఉన్నాయి. అదే విధంగా పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంజినీరింగు కళాశాలలు 2,234 ఉంటే, అందులో 1,97,018 ప్రవేశ స్థానాలు (సీట్లు) అందుబాటులో ఉన్నాయి. ఇక రెండు తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే, ప్రతి సంవత్సరం రెండు తెలుగు రాష్ట్రాల్లో మొత్తం ఇంటర్మీడియట్ విద్యార్థుల సంఖ్య 9,18,861 అందులో 4,11,631 తెలంగాణలోను మరియు 5,07,230 ఆంధ్రప్రదేశ్‌లోను ఉన్నారు. ఇక రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇంజినీరింగు కళాశాలల విషయానికి వస్తే, తెలంగాణలో 284 కళాశాలలు ఉంటే అందులో 1,41,118 ప్రవేశ స్థానాలు అందుబాటులో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 328 కళాశాలలు ఉంటే అందులో 1,72,476 ప్రవేశ స్థానాలు అందుబాటులో ఉన్నాయి. వీటినిబట్టి అర్థం చేసుకోవలసిన విషయం ఏమిటంటే, ఆంగ్ల మాధ్యమంలో చదువుకున్న విద్యార్థులందరూ పైన చెప్పిన ఉన్నత కళాశాలల్లో గానీ ఇంజినీరింగులో గానీ అందరూ అర్హతసాధిస్తారు అని నమ్మడం ఒక అపోహగానే చెప్పవచ్చు.

**ఆంగ్ల మాధ్యమ కళాశాలలో ఆంగ్లభాష పాత్ర**

ఎన్నో ఆశలతో తమ పిల్లలను వారి తల్లిదండ్రులు ఆంగ్ల మాధ్యమ కళాశాలల్లో చేర్పిస్తారు. ఆ ఆశలతో తమ పిల్లలు చక్కగా ఆంగ్లం నేర్చుకుంటారని, ఇంకా ఉన్నత సాంకేతిక, వైద్య కళాశాలలో ప్రవేశాలు (సీట్లు) సాధిస్తారని అనుకుంటారు. **వాస్తవానికి ముఖ్యంగా ఆంగ్ల భాషావిషయాన్ని ఎన్ని రోజులు బోధిస్తారు, ఇంకా ఎలా బోధిస్తారు అనేది ముఖ్యం.** మాధ్యమిక విద్యలో ప్రవేశం పొందిన తరువాత ఆంగ్ల మాధ్యమ కళాశాలల్లో డిసెంబర్ నెలలోపే ఆంగ్ల భాషావిషయంలో పాఠ్య బోధనను పూర్తి చేస్తారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన అని చాటి చెప్పుకుంటున్న కళాశాలలు కేవలం ఐదు నెలలు మాత్రమే ఆంగ్లాన్ని ఒక విషయంగా బోధిస్తారు. ఈ విధంగా ఆంగ్ల మాధ్యమంలో తర్ఫీదు పొందిన విద్యార్థులు ఉన్నత సాంకేతిక, వైద్య కళాశాలల్లో ప్రవేశం పొందిన తరువాత ఆ కళాశాలల్లో ఆచార్యులు ఆంగ్లమాధ్యమంలో బోధించే విషయాలను అర్థం చేసుకునే శక్తి చాలక, చాలా మంది విద్యార్థులు మధ్యలోనే అర్థాంతరంగా చదువును విడిచి వెళ్ళవలసి వస్తోంది. కొన్ని సందర్భాలలో బలవన్మరణాలకు కూడా దారితీస్తోంది.

**ఆంగ్ల మాధ్యమ చదువులు-ఉద్యోగ అవకాశాలూ- వాస్తవాలూ**

పైన చెప్పిన విధంగా ఆంగ్ల మాధ్యమం ద్వారా ప్రాథమిక, మాధ్యమిక, సాంకేతిక వైద్య విద్య పూర్తి చేసిన విద్యార్థులకు ఎక్కడెక్కడ ఎన్నెన్ని ఉద్యోగ అవకాశాలు వస్తున్నాయో గారపాటి ఉమా మహేశ్వరరావు గారి తెలుగు రాష్ట్రాల్లో భాషా సంక్షోభం అనే పుస్తకంలో వివిరంగా వివరించారు. భారతదేశం 4000 విద్యాసంస్థల నుండి ప్రతి సంవత్సరం 1.5 మిలియన్ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లను తయారు చేస్తోందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఇది చైనా, యుఎస్ఏ రెండు దేశాలలోనూ తయారయే ఇంజనీర్ల మొత్తం కంటే ఎక్కువ. మన దేశంలోని అనేక సంస్థల నివేదికల ప్రకారం, ముంబై, బెంగళూరు, హైదరాబాద్ వంటి ప్రధాన నగరాల్లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లలో 18.26 శాతం మందికి ఉద్యోగం

సిద్ధంగా ఉంటే, పూణే, నాగ్‌పూర్ ఇంకా సూరత్ వంటి రెండవ తరగతి నగరాల్లో 14.17 శాతం మందికి మాత్రమే ఉపాధి అందుబాటులో ఉంటోంది. న్యూఢిల్లీకి చెందిన ఉపాధి పరిష్కార సంస్థ ఒకటి 2013లో పట్టభద్రులైన 1,50,000 మంది ఇంజనీరింగ్ విద్యార్థుల ఆధారంగా ఉద్యోగార్హతపై దృష్టిసారించి అధ్యయనం జరిపింది. మొత్తం గ్రాడ్యుయేట్లలో కేవలం 3 శాతం మందికి మాత్రమే సాఫ్ట్‌వేర్ లేదా ప్రొడక్ట్ మార్కెట్‌లో ఉద్యోగం చేయడానికి తగిన నైపుణ్యాలు ఉన్నాయని కనుగొనింది. ఇంకా, వారిలో కేవలం 7 శాతం మాత్రమే సాంకేతిక నైపుణ్యం ఉన్న పనులను నిర్వహించగలవారని తేల్చింది. ఈ సాంకేతిక విశ్వవిద్యాలయాలూ కళాశాలలూ తమ ప్రస్తుత పాఠ్యాంశాలను నవరించడంలోనూ నవీకరించడంలోనూ తరచుగా విఫలమవుతున్నాయి. ఇది తరచుగా పాతబడ్డ బోధనా ప్రణాళికలకూ పాత బోధనా పద్ధతులకూ దారితీస్తోంది. చాలా ఇంజనీరింగ్ కళాశాలలు తమ విద్యార్థులకు మధ్యంతర (ఇంటర్న్‌షిప్) శిక్షణ అవకాశాలను అందించవు. ఈ కారణంగా విద్యార్థులు పరిశ్రమలలో వాస్తవికతను ఎదుర్కొన్నప్పుడు వారికి విషయపరంగానూ అనుభవపరంగానూ అవగాహనాలోపంతో ఉండిపోవాల్సి వస్తుంది. దేశంలో ఇంజనీరింగ్ విద్యా కార్యక్రమాలను అందించే విశ్వవిద్యాలయాలూ కళాశాలల సంఖ్య అధికంగా ఉన్నప్పటికీ, నాణ్యమైన విద్యను అందించేవి లేకపోవడం అనేది దశాబ్దాలుగా కొనసాగుతోంది. దీనికి కారణం ఆంగ్లంలో పట్టులేపోవడమే అని తప్పుగా అంచనా వేయడం మరో పెద్ద తప్పని ఈ నివేదికలు తెలుపుతున్నాయి.

**విదేశీ ఉద్యోగ భద్రత–ఒక అపోహ**

ఇక విదేశీ ఉద్యోగ భద్రత గురించి ఆలోచిస్తే, ఆంగ్లభాషా దేశాలు అనగా ఇంగ్లాండు, అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా, ఇంకా కొన్ని ఆంగ్ల పాలిత దేశాలలో మొత్తం కలిపి ఇరవై నుంచి ముప్పై వేల ఉద్యోగాలు భారత దేశంలో ఉన్న అన్ని రాష్ట్రాలలో ఉన్న భారతీయులకు కేటయించబడతాయి. అందులో సుమారు పదిపన్నెండు వేల ఉద్యోగాలు కేవలం పునరుద్ధించబడేవి. అంటే కేవలం ఇరవై వేల ఉద్యోగాలు మాత్రమే కొత్తగా కేటాయించబడుతున్నాయి. దీనిని బట్టి మనం అర్థం చేసుకోవాల్సిన విషయం ఏమిటంటే, ఆంగ్లంలో చదివిన ప్రతి విద్యార్థికీ ఆంగ్లం మాతృభాషగా ఉన్న దేశాల్లో ఉద్యోగం వస్తుందనేది అపోహ మాత్రమే. అంతే కాక, ఆంగ్ల మాధ్యమంలో విద్యను అభ్యసించిన వారి కంటే మాతృభాషలో అభ్యసించినవారే భారతదేశ స్థూల జాతీయ ఉత్పత్తికి ఎక్కువగా తోడ్పడుతున్నారనే వాదనను తెలుగు రాష్ట్రాల్లో భాషా సంక్షోభం' అనే పుస్తకంలో వాస్తవం అని నిరూపించారు. నిరూపించటమే కాకుండా, ఆంగ్లమాధ్యమమే మనకు ఉద్యోగ ఉపాధి అవకాశాలను అందిస్తుందనే దానికి వంత పాడటం ఆపేయాలనే వాస్తవానికి అద్దం పడుతోందన్నది నిజం.

**ఆంగ్లమాధ్యమ బోధన**

**పేద మధ్య తరగతి తల్లిదండ్రులూ– విద్యార్థుల బాధలు:**

తెలుగు రాష్ట్రాల్లో ఎక్కువ మంది ప్రజలు గ్రామీణ ప్రాంతానికి చెందినవారే. వీరిలో తొంభై శాతం తల్లిదండ్రులు మాతృభాషలో విద్యను అభ్యసించినవారు. ఆంగ్ల మాధ్యమ పోకడలు చూసి, వారి పిల్లలను ఆంగ్ల మాధ్యమ బోధనాపాఠశాలలలో చేర్పిస్తున్నారు. కానీ తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ఆంగ్ల మాధ్యమ భాషాబోధనా పాఠశాలలు ఒక్కొక్కటి ఒక్కొక్కవిధంగా వాటి బోధనా పాఠ్యప్రణాళికలను రూపొందించుకున్నాయి. ఈ పాఠ్య ప్రణాళికల లోని పాఠాలు ఎక్కువగా ఆంగ్ల సంస్కృతిని ప్రతిబింబించే విధంగా ఉంటాయి. వీటి వలన విద్యార్థుల ప్రవర్తనలో కౌమార దశ వచ్చేసరికి పెను మార్పులు చోటుచేసుకుంటున్నాయి. దీనితో పాటుగా విద్యార్థులకు ఆయా పాఠాలలో వచ్చిన సందేహాలను ఆంగ్ల భాషలో నివృత్తి చేసే సామర్థ్యం తల్లిదండ్రులకూ, ఇంటి చుట్టుపక్కల వారికీ లేకపోవడం వలన – ప్రపంచ బ్యాంకు (2019) చెప్పిన విధంగా విద్యార్థులలో నేర్చుకోవడంలో పేదతనం (learning poverty)కొట్టొచ్చినట్లు అది ఇంకా పెరుగుతోందనీ పేర్కొన్నారు. పర్యవసానంగా తెలుగు రాష్ట్రాలలో చాలా మంది విద్యార్థులు పైన చెప్పిన కారణాల వలన మధ్యంతరంగా పాఠశాల విద్యను వదిలివేస్తున్నారు. అలాగాక, విద్యార్థులందరూ తల్లిదండ్రులకు తెలిసిన భాషలో విద్యను అభ్యసించినట్లయితే విషయ పరిజ్ఞానంలో వచ్చిన సందేహాలను చక్కగా నివృత్తి చేసుకొని పైచదువులు చక్కగా కొనసాగించే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

**ముగింపు**

అనేక భాషాశాస్త్ర సిద్ధాంతాల ప్రకారం మాతృభాషలో ఏ విషయాన్నైనా ఆకళింపు చేసుకోవడంలోనూ మరీ ముఖ్యంగా విద్యను సులభంగా నేర్చుకోవడంలోనూ ప్రతిభ చూపిస్తున్నారనేది నిజం, కానీ పరాయి భాషలో అది సులభం కాదనేది అంతే నిజం. దానితో పాటు మాతృభాషలో నేర్చుకొనే సమయంకన్నా పరాయి భాషలో నేర్చుకొనే సమయం ఎక్కువ పడుతుంది. ఈ కారణం చేత చాలా మంది పాఠశాల విద్యార్థులు చదువుని మధ్యలోనే వదిలేస్తున్నారు. అంతేకాకా, ఏ విద్యార్థులయితే తల్లిదండ్రులకు తెలిసిన భాషలో చదువుకుంటారో– వారు చక్కగా వారిచదువుని పూర్తి చేసుకొని గొప్ప గొప్ప పదవులు అలంకరించవచ్చు. చివరగా మాతృభాష గురించి ఒక మాట చెప్పాలంటే, అమ్మనుడితోనే ఆకలి అంతం అవుతుంది, కానీ పరాయి నుడితో కాదు.

> 'ఆకలితోపాటు అన్నం, చలితోపాటు వస్త్రం, భాషతోపాటు భావం, విద్యతో పాటు జీవితం ఒకేచోట కలగచేయమని, ఒక దానితో ఒకటి కలపమని' భగవంతుడిని వరమడుగుతున్నాను.
>
> – రవీంద్రనాథ్ ఠాగూర్

వెన్నెలకంటి ప్రకాశం
98484 84161

# పునాది భాష: భాషా త్రిశూలం

**మా**నవుడి మనుగడకు మాటలు మూలం. అమ్మలో నుంచే మాటలు విన్న బిడ్డ బయటికొచ్చి, అమ్మతో మాట్లాడుతూ ఎదుగుతాడు. ఆ ఎదుగుదలకు, మానసికాభివృద్ధికి తోడు నిలిచేది, తోడు నడిపేది అమ్మ అన్నమాట.

అమ్మలోనుంచే, అమ్మతోటే వినే ఆ మాటే- మానవుడి ఆలోచనకు విడదీయలేని పునాది. ఆ పునాది గట్టిపడడంతోనే ముడిపడి ఉంది, ఆలోచనకున్న చిక్కదనం. పునాది బలహీనమైతే ఆలోచనా స్రవంతి నీరుగారవచ్చు.

ఇసుమంత అడ్డు లేకుండా ఆ ఆలోచన అమ్మనుడి మాటల వాడుకతో నడిస్తే విద్యార్జన సమయంలో బలపడగలడు విద్యార్థి. ఈ లోపల ఆలోచనకు బంధనంగా వేరే మాటలే ముఖ్యమైతే, శబ్దానికి దృశ్యానికి ఉన్న అవినాభావ సంబంధం బలహీనమయ్యే ప్రమాదముంది. పర్యవసానంగా ఆలోచనా ప్రమాణాల్లో పల్చదనం ఏర్పడుతుంది. **అందుకనే మనిషికి ఊహవచ్చే వరకు అంటే ఏడవ సంవత్సరం వరకు ఎలాంటి పరభాషా ప్రభావం లేకుండా ఉంటే పునాది భాష అన్ని రూపాల్లో బుద్ధిని వికసింప చెయ్యగలదు.**

ఏడవ ఏట కొత్తను గుర్తించి, పునాదితో అన్వయించుకుంటూ, ప్రస్తుతం ఉన్న భాషా భావ బాంధవ్యాన్ని సడలింప కుండా బలపర్చుకోగలడు విద్యార్థి. పరభాషా వస్తు సామాగ్రి విద్యార్థులకున్న జ్ఞానానికి వ్యతిరిక్తంగా ఉండకుండా, సులభంగా అన్వయించుకోగలిగేట్లు ఉండాలి. ఉదాహరణకు చేపలు పట్టుకొనే సమాజానికి కోతులను వేటాడి భుజించే సమాజపు కథలు అనవసరపు ప్రశ్నలకు దారి తీస్తాయి. ఈ పునాది భాష నుండి పరభాషకు దారి తీసే బోధనా సామాగ్రి, బోధనా విధానాలు ఈ సందర్భంలో చాలా అవసరం. అమ్మ మాటలకు వాక్యాలకు అనుగుణంగా ఉండే బంధు భాషా మాటలు, వాక్యాలు అటు సౌలభ్యము ఇటు ఉపయోగకరము అవుతాయి.

ఏడోఏట నుండి పదిహేనవ ఏట వరకు ఆలోచనలు స్థిరపడతాయి. కొత్త పుంతలు తొక్కుతాయి. కార్యాచరణ వైపు దారి తీస్తాయి. కొత్త భాషలు బంధు భాషలు ఈ సమయంలో పునాది భాషకు ఎలాంటి కష్టం కలిగించకుండా తను ప్రవేశాన్ని సుగమం చేసుకోవాలి.

జ్ఞాన సముపార్జన పునాదితోనే పెరగాలి. కట్టడాలు పునాది మీదనే ఆధారపడాలి.

ఇక్కడ ఇంకొక విషయం. అన్ని భాషల భావవ్యక్తీకరణ సమర్థత ఒక్కటే అవకాశాన్ని బట్టి, అవసరాన్ని బట్టి, అనుభవాన్ని బట్టి వాడుక విస్తృతమౌతుంది. ప్రపంచం గురించి చక్కగా ఆలోచించడం ఏడవ ఏటనే మొదలౌతుంది. దానికి తోడు నిలిచేది పునాది భాష 15వ ఏట తర్వాత అన్య భాషల వాడుక వల్ల ఆలోచనలకు, గ్రహణ శక్తికి ఎలాంటి ఇబ్బంది కలగదు. కాస్తో కూస్తో మెరుగు ఏర్పడుతుంది. పునాదికి పక్క స్తంభాలు అవి. బలము ఏర్పడ వచ్చు కూడా.

విభిన్న పాత్రల్లో, విభిన్న ప్రాంతాలతో జరిగిన వ్యాపకాల వల్ల ఉపాధులు పెరుగుతుంటాయి. ఆ ఉపాధికి పునాదితో పాటు అన్య ప్రాపక స్తంభాలు పనికి వస్తాయి. సమస్య లేదు. ఒక వ్యక్తి పరిపూర్ణతకు భంగం కాదు.

పునాది భాషకు భంగపాటు తెచ్చే పని చేస్తే ఒక ప్రమాదముంది. ఏ భాష మీద పట్టులేకపోతే ఏకభాషి, ద్వీభాషి, పలుభాషి కాకుండా 'అర్ధభాషి' (Semi lingual) గా మిగిలిపోతారు అటువంటివారు. అంతే కాదు దేనికీ కొరగాని అ భావచైతన్యం ఏర్పడుతుంది.

3వ ఏట నుండి కథలు, పాటలు, దృశ్య శబ్ద వారధులు ఏర్పరచాలి. తర్వాత శబ్ద వారధులు ఏర్పరచాలి. తర్వాత రచన వైపుకు 5వ ఏట నుంచి నడవవచ్చు. ఇప్పటికే మాట కట్టూ బొట్టుకు అవసరమైన హంగులేర్పడతాయి. పునాది భాష విద్యా భాషగా ఉన్నప్పుడు విద్యార్థి బాగా అభివృద్ధి చెందుతాడు.

భాష ఉపయోగం మూడు విధాలుగా ఉంటుంది. 1. అవసర భాష 2. విషయ భాష, 3. ఆనంద భాష. అవసర భాషా పని మన నిత్యదైనందిన కార్యక్రమాలకు పరిమితమౌతుంది. లేనిపోని విషయాలకు కూడా భాషను వాడుకోవాలంటే విషయ భాష వంకకు నడవాలి. నిత్య జీవితానికి కొత్త విషయాలు పనికివస్తాయి గూడ. ఇప్పుడు ఎదురుగా లేని, ఊహించుకొన్న వాటిని గురించి మాట్లాడ గలుగుతాం, రాయ గలుగుతాం. ఆనంద భాష మౌఖిక సాహిత్యం, గ్రాంధిక సాహిత్యంలో మనం వాడేది. ప్రతి భాషలో కథకుడు, కవి ఉంటారు. సామెతలు గూడ ఆనంద భాషారూపాలే. 15వ ఏడు వచ్చేటప్పటికి పునాది భాష విద్యార్థులు ఈ మూడు భాషాత్రిశూలాయుధ ధారులౌతారు. భాషకు సంబంధించిన మూడు రంగాల ప్రయోజనాల పట్ల అవగాహన పొందివుంటారు. ఈ గట్టి పునాది మీద ఎన్నైనా భవంతు లేర్పడగలవు.

మిగిలిన బంధు భాషలు, విదేశీ భాషలు పక్క వాయిద్యాలతో తమ విలువైన పాత్ర ధరిస్తాయి. 16వ ఏట నుంచి వ్యక్తుల ఉపాధి కోరికలను బట్టి అన్యభాషల మద్దతు తీసుకోవడం అన్ని విధాల ఉపయోగమే.

రచయిత- ఇంగ్లీష్ తదితర
విదేశీ భాషల విశ్వవిద్యాలయం,
హైదరాబాదులో ఆచార్యులుగా పనిచేశారు

గుండె లోతుల్లోంచి వచ్చేదీ, మనసు విప్పి చెప్పగలిగేదీ 'అమ్మనుడి'లోనే

సి. వి. క్రిష్ణయ్య
93965 14554

# జనగణమనతో నా ప్రయాణం

భావాలు వెల్లడించడంలోనూ, విషయాన్ని అర్థం చేసుకోవడంలోను మా మాతృభాషకున్న సౌలభ్యాన్ని ఎవరూ కాదనలేరు. ఈ సౌలభ్యాన్ని గురించి ఎవరెన్ని మాటలు చెప్పినా, కథలు రాసినా, తర్కబద్ధవాదనలు వినిపించినా అవన్నీ అసంపూర్ణంగానే ఉంటాయి.

మనందరికి భాషకు సంబంధించి ఏవో కొన్ని ఇబ్బందులు తప్పని సరిగా ఉంటాయి. పరభాషకు సంబందించి ఈ ఇబ్బందులు మరీ ఎక్కువగా ఉంటాయి. అవన్నీ బయటకు చెప్పుకోం. మర్యాద కోసమో, ఇతరుల దృష్టిలో బుద్ధిహీనుడుగా కనిపించకూడదనో మన స్సులోనే దాచుకొంటాం. ఇలా ఇన్నాళ్లూ నామనస్సులో అణిగిపోయిన భాషకు సంబంధించి ఒక బాధను తెలియచేస్తాను. ఈ నా బాధకు అర్థం ఉందో లేదో పాఠకులే నిర్ణయించాలి.

మొదట నా బాధ, కష్టం జనగణమన- జాతీయ గీతంతో మొదలయింది. ఆరో ఏట నన్ను బడిలో వేశారు. అప్పటి నుండి జనగణమన అంటూ మన జాతీయగీతాన్ని అందరితో కలసి ఆలపిస్తున్నాను. ఆనాడు దాని అర్థం ఏమిటో తెలియదు. ప్రతిరోజు దాన్ని ఎందుకు పాడుతున్నామో తెలియదు. రోజూ బడిముగింపు సమయంలో సంచులు భుజాలకు తగిలించుకొని జయహే అంటూ ఇంటికి వరుగెత్తేవాళ్లం. జనగణమన అంటే ఇంతటితో ముగిసిపోయింది అనే భావం స్థిర పడిపోయింది. హైస్కూల్లో చేరాను. తొమ్మిదో తరగతిలో ప్రశ్న మొదలయింది. జనగణమన ఏ భాష? దాని భావం ఏమిటి? తెలుసుకోవాలనే కుతూహలం రోజురోజుకు ఎక్కువైంది. ఒక రోజు తెలుగు క్లాసులో "సార్, జనగణమన పాటకు అర్థం చెప్పండి" అని తెలుగుమాస్టార్ని అడిగాను. పరీక్షించడానికి అడిగానని భావిండాడో, దానికి అర్థం ఆయనకు కూడా తెలియదో ఏమోగాని, రెండుక్షణాలు మవునంగా ఆలోచించి "నీకు జాతీయ గీతానికే అర్థం గావాలా? అధిక ప్రసంగి నిన్ను చెప్పిన పద్యం చెప్పు అది ప్రశ్నించడమో, శిక్షించడమో తెలియదుగాని, పద్యం చెప్పలేక అరచేతిలో రెండు బెత్తం దెబ్బలు తిని, దిగాలుగా కన్నీళ్లతో కూర్చున్నాను.

కానీ నా బుర్రలో పుట్టిన తెలుసుకోవాలనే కుతూహలాన్ని ఎంతగా బయటకు నెట్టేయడానికి ప్రయత్నించినా, అది మరింత బలంగా నా మెదడులో తిష్టవేసి కూర్చున్నది.

హైస్కూలు చదువు పూర్తయింది. కాలేజీలో చేరాను. పుస్తకాలు చదవడం బాగా అలవాటయింది. ఈ సందర్భంలో రవీంద్రనాథ్ ఠాగూరు రచించిన రచనలు చదివాను. గీతాంజలి చదివాను. మన జాతీయ గీతాన్ని రవీంద్రుడు రాసాడని తెలుసుకొన్న తర్వాత రవీంద్రుడి పైన జాతీయ గీతంపైనా మరింత అభిమానం ఏర్పడింది. అప్పుడే జాతీయ గీతం భావాన్ని గూడా తెలుసుకొన్నాను. ఓహో ఇదా దీని భావం అని తెలుసుకొన్నానేగాని ఆ భావం నాలో ఎలాంటి ఉత్తేజాన్ని కల్పించలేదు. ఆ తర్వాత రోజుల్లో కూడా ఆలపించేటప్పుడు నేను తెలుసుకొన్న ఆ భావం నామెదడు స్వీకరించేది కాదు. శబ్ద గాంభీర్యం, సంగీతం, వేగవంతమైన దాని నడక ఆకర్షించినంతగా భావం ఎలాంటి స్పందనలు కల్గించలేకపోయింది.

టీచర్నయిన తర్వాత పిల్లలు పాడేటప్పుడు గమనించడం ప్రారంభించాను. నిరుత్సాహంగా, నీరసంగా, మొక్కుబడిగా పాడడం గమనించాను. ఎందుకనో జనగణమన అంటూ పాడడం వినడం ఒక శిక్షగా భావించసాగాను. చాలా కాలాకాలంగా వినడంవల్లనో, అర్థం వెంట నేను చలించకపోవడమో, పరభాషా గీతం కావడమో నా వైముఖ్యానికి కారణం కావచ్చు.

మన జాతీయ గీతానికి సంబంధించిన ఇంత గోల ఎందుకు? ఇదేమైనా మానసికమైన జబ్బా? దేశభక్తి లేకపోవడమా? ఈ నా బాధకు అర్థంఅయింది?

నా బాధకు అర్థం ఉంది. ఈ విషయం గురుజాడ రచించిన దేశభక్తి గీతం విన్నప్పుడు తెలిసింది. రెంటిని పోల్చిచూసుకొన్నప్పుడు అర్థముందా?

దేశమును ప్రేమించుమన్నా మంచియన్నది పెంచుమన్నా అంటూ పాట పూర్తయ్యేవరకు నాలో స్పందనలు కలుగుతూనే ఉన్నాయి. ఎన్ని సార్లు విన్నా అవే స్పందనలు, జాతీయ గీతం విన్నప్పుడు ఎందుకు కలగలేదు. భాష హృదయంలోపలికి దిగిపోయే అచ్చతెనుగు పదజాలం-ఎంతగొప్పమాటలు

దేశమును ప్రేమించుమన్నా అంటూ 'అన్నా' సంబోధన, జనగణమనలో స్తుతిమాత్రమే ఉంది. గురజాడ గేయంలో సందేశం ఉంది. హెచ్చరిక ఉంది. దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్ అనడంలో ఎంతో గొప్ప సందేశం ఉంది. కొండలు, గుట్టలు, నదులు, సరిహద్దులు కాదురా వెధవాయ్, ఆ సరిహద్దుల లోపల నివశిస్తున్న జనం బాగోగులు పట్టించుకోరా అని హెచ్చరిస్తూన్నాడు. వట్టి మాటలు కట్టిపెట్టి, గట్టిమేల్ తలపెట్టవోయి' ముత్యాల్లాంటి తెలుగు పలుకులతో వేలితో గుండెలను పొడిచిబెదుతున్నట్లులేదూ. తిండిగగ్లితే కండగలదోమ్ కండగలవాడే మనిషోయి. ఈసురోమంటూ మనుషులుంటే, దేశమే రీతిని బాగుపడునోయి. బలమైన ఆరోగ్య వంతమైన జాతిగా రూపొందాలని చెబుతున్నాడు. చెట్టపట్టాల్ పట్టుకొని దేశస్థులంతా నడువవలెనోయ్ అన్నదమ్ముల వలెను జాతులు మతములన్నియు మెలగవలెనోయి. అచ్చతెనుగు వాడుక పదాలు, పదాలవెనుక ఉన్న అర్థం మొత్తం ఈ పాట భారతదేశసింహాసనంపై కూర్చుండబెట్టదానికి అర్హత గల పాట. ప్రపంచంలో ఏ దేశమైనా ఏ జాతియైనా పాడుకోగల విశ్వగీతం. ఇక్కడ గురజాడను రవీంద్రుడిని పోల్చి చూడడం కానేకాదు. రవీంద్రుడు

విశ్వకవి. 'జనగణమన' భారతదేశం జాతీయగీతం. మరి 'దేశమును ప్రేమించుమన్నా" పాట తెలుగు వారు రోజూ పాడు కోవలసిన తెలుగు జాతీయ గీతం ఎందుకు కాదు !

భాషకు సంబంధించి ఈ బాధ జాతీయ గీతంతో ముగిసిపోలేదు. నేను తెలుగు పండితుడనై ఒక్క తెలుగు పదంలేని తెలుగు పద్యాలు పాఠాలుగా చెప్పి, ఆ పద్యాలకు ప్రతి పదానికి అర్థం చెప్పాల్సిన దౌర్భాగ్య పరిస్థితి దాపురించినప్పుడు- నాగోడు ఎవరికి చెప్పుకోను! నా తెలుగు పిల్లలు ఇంగ్లీషు, హిందీ రెండు పరభాషలు నేర్చుకోవడంతో పాటు అర్థంగాని తెలుగును గూడా మూడో భాషగా నేర్చుకోవల్సిన దుస్థితికి కారణం ఎవరు?

పోనీ నా భాషకు పట్టిన దరిద్రాన్ని తొలగించమని దేవుడితో మొరపెట్టుకొందామని పండ్లూ, పూలు తీసుకొని దేవాలయానికి వెళితే, అక్కడ పూజారి ఏవో అర్థంగాని మంత్రాలు శ్లోకాలు చదివి, చెవుల్లో పూలు, చేతిలో కొబ్బరి చిప్ప పెట్టి పంపిస్తాడు.

మసీదుకెళ్లితే మక్కావైపు మైకును బెట్టి అర్థంగాని అరబ్బీ భాషలో 'అల్లాహోఅక్బర్' అంటూ రోజుకు ఏడు సార్లు అరుస్తూ ఉంటారు. అక్బర్ చక్రవర్తే అల్లా గాబోలు అనుకొనేవాడిని. చర్చికెళితే ఇంగ్లీషువాడి యాసలో చిత్రమైన తెలుగు భాషలో ప్రార్థన చేసి, మాటిమాటికి 'హలెలూయా' 'ఆమెన్' అంటూ ఉంటారు. ఆ మాటకు అర్థం ఏమిటో తెలియదు !

ఎవరో తెలిసినవాళ్లు వచ్చి పెళ్లి పిలుపుకు సంబంధించిన పత్రిక ఇస్తారు. ఆ పత్రిక తెరిచిచూస్తే 'స్వస్తి శ్రీ భాద్రపద శుద్ధ పంచమీ' తో ప్రారంభమై, అర్థంగాని సంస్కృత శబ్దాలతో నిండిపోయి ఉంటుంది. పెళ్లికెళ్లితే వధూవరులను కూర్చుండబెట్టి గంటల తరబడి అర్థంగాని మంత్రాలు చదువుతూ, వధూవరులకు పట్టపగలు అరుంధతీ నక్షత్రాన్ని చూపిస్తాడు. పెళ్లికెళ్లిన వారి ఆకలిని సహనాన్ని పరీక్షిస్తూ ఉంటాడు.

ఆకలికి తట్టుకోలేక హోటల్‌కెళితే అక్కడ సర్వర్లు, క్లీనర్లు, స్వీపర్లు, కుక్కులు ఇంగీషు పేర్లు తగిలించుకొని, అంతా హడావిడిగా తిరుగుతుంటారు. టేబుల్ ముందు కూర్చుని మెనూ చూస్తే, వందల పదార్థలు వడ, ఇడ్లీ, దోశ, తప్ప మనకు తెలిసిన పదార్థం ఒక్కటీ లేదు. పిజ్జాలు, బర్గర్లు, మటన్, ఫిష్, ప్రాన్, అంటూ అంతా ఇంగ్లీషులోనే. సినిమాకెళ్లితే హీరో, హీరోయిన్, విలన్, ఫైట్లు, డ్యూయిట్లు, డాన్సులు; హాస్పటల్‌కెళితే డాక్టర్లు, నర్సులు, పేషంట్లు, బెడ్లు, ఆపరేషన్లు, ఇంజక్షన్‌లు, టాబ్లెట్లు; పోనీ జబ్బులైనా తెలుగులో మిగిలాయా అంటే, అవి ఇంగ్లీషులోనే మారిపోయి చాలాకాలమైంది. బి.పి., షుగర్, క్యాన్సర్, అల్సర్, గ్యాస్ట్రిక్ ట్రబుల్, ఫీవర్, డయేరియా! పోనీ వంట్లో భాగాలైనా మిగిలాయా అంటే అవీ ఇంగ్లీషులో మారిపోయాయి, హార్టు, లివర్, లంగ్స్, కిడ్నీస్, స్టమక్, జాయింట్లు.... టోటల్‌గా మనిషి శరీరమే బాడీగా మారిపోయింది. బాడీలో శవం అని అర్థం తప్ప మనిషి అనే అర్థమే స్ఫురించదు.

బస్టాండుకెళ్లు, రైతుబజారుకెళ్లు, బడికెళ్లు అన్నీ ఇంగ్లీషు పదాలే – పోనీ అమ్మా, నాన్నా, అక్కా అన్నా వంటి ఆప్యాయతతో కూడుకొన్న అచ్చతెనుగు మాటలైన మిగిలి ఉన్నాయా, మొత్తం అన్నీటినీ కలిపేసి ఆంటీ, అంకుల్, అనే రెండు ఇంగ్లీషు ముక్కలుగా మార్చేశారు. ఈ పదాల్లో ఎలాంటి ఆప్యాయతా అనుబంధాలు లేవు.... పోనీ తెలుగులో మాట్లాడు కొంటున్నారులే అని సరిపెట్టుకొందామనుకుంటే, మాట్లాడుతూ మాట్లాడుతూ మధ్యలో సో, వాట్, బట్, వెరీగుడ్, కంగ్రాచులేషన్, థెన్, అంటూ ఇంగీషులోకి జారిపోతుంటారు.

ఇంట్లో ప్రశాంతంగా ఉందామంటే ఇళ్లు, దాబాలు మిద్దెలు అన్నీ పోయి 'అపార్టుమెంట్లు' వచ్చాయి. అదీ ఇంగ్లీషు పదమే, ఇంటిలోపల అంతా ఇంగ్లీషు మయం అంతస్తులు ఫ్లోర్లుగానూ, మెట్లు లిఫ్ట్‌గాను మారిపోయాయి. ఇంట్లో అడుగుపెడితే హాలు, టి.వి., టీపాయ్, సోఫాలు, కుర్చీలు, ఒక పక్క డ్రాయింగు రూం, బాల్కనీ, బాల్కనీలో ఉన్న పూలకుండీలు తెలుగు పదమే గాని, వాటిలో బంతులు, చామంతులు లేవు. క్రోటన్స్, బోన్సాయిలు, వంటిల్లు కిచెన్ అయిపోయింది. కిచెన్ షెల్ఫులు, షెల్ఫుల నిండా టీస్పూన్లూ, ప్లేట్లు, బౌల్సు, గ్లాసులు, కప్పులు, సాసర్లు, పక్కన గ్యాస్‌స్టవ్, సిలిండర్, మిక్సీ, గ్రైండర్లు, ఫ్రిజ్, డైనింగ్ హాలు, డైనింగ్ టేబులు, టేబుల్ మీద హాట్ బాక్సులు, పికిల్ బాటల్స్ సాల్ట్‌టిన్నూ; బెడ్ రూంలోకి వెళ్లి చూస్తే డబుల్‌కాట్, పైన బెడ్, బెడ్ పైన బెడ్ షీట్లు, పిల్లోసు, పైన ఫ్యాన్లు, విండోస్ కర్టన్లు; షెల్ఫులు తెరిచిచూస్తే శారీసు, షర్టులు, ప్యాంట్లు, జాకెట్లు- తెలుగులో ఏమున్నాయో ఆలోచిస్తే ఒక్కటీ గుర్తుకు రాదు.

నా ఏడ్పు ఇంగ్లీషు పదాల గురించికాదు. ఎన్నీ ఇంగ్లీషుపదాలైనా రావచ్చు. కాని ఉన్న తెలుగు పదాలు పోగూడదు. ఆ పాత తెలుగు పదాలు కూడా ఉంటే పదసంపద ఎక్కువై నమ భావల స్పష్టంగా వెల్లడించడానికి వీలవుతుంది.

**"మన ఆనందరహిత, నీరసమైన, నిర్జీవమైన విద్యవల్ల ఆ జీవదాయక శక్తి వ్యర్థమయిపోతుంది. కొద్దిపాటి వల్లె వేసిన విషయాల బరువును మోసుకుంటూ మనం బాల్యం నుండి యవ్వనం లోకి ప్రవేశిస్తాం. బట్టీ పట్టడంలోనే మన మనసులు విరిగిపోతాయి. యింత చేసినా మన మానవత బాగా పుష్పించి ఫలించదు. మనం ఆంగ్లభావభూమిలో ప్రవేశించినప్పుడు అక్కడ కూడా చక్కగా ఆట పాటలలో విహరించలేం. భావాలని మనం అర్థం చేసుకున్నా మనసులో వాటిని ముద్రించుకోలేం. వాటిని మాటి మాటికి వల్లెవేస్తూ వుంటాం కానీ మన వాస్తవ జీవితంలో వాటిని ప్రయోగించలేం. అవి మన వెలుపలనే వుండిపోతాయి, లోపలికి చొచ్చుకోవు. మన మనస్సుతో వాటికి ఎటువంటి సంబంధమూ, సంపర్కమూ వుండదు."**



తెలుగు పదజాలమంతా తెలుగు సంస్కృతికి సంబంధించిన తెలుగు వారి జీవితాలతో ముడివేసుకొన్నది. తెలుగు వారి హృదయాలకు సంబంధిచినది. కొన్ని వందల వేల సంవత్సరాలుగా వస్తున్న పదసంపద ఆస్తి. మన దగ్గర డబ్బులుంటే మన దగ్గర మరికొంత అదనంగా సంపాదిస్తే సంపద పెరుగుతుంది. మన దగ్గర ఉన్న డబ్బులు పోగొట్టుకొని, ఎవడో ఇచ్చినవి తీసుకొని మురిసిపోవడం ఏమిటి?

"అమ్మ"లో ఉండే కమ్మదనం మమ్మీలో ఎందుకుంటుంది. గురువులో ఉండే గొప్పదనం టీచర్లో ఉంటుందా. వీధి'అరుగు'చుట్టూ ఉన్న మన పల్లెజీవన సౌరభం 'స్టేజి' అనే పదంలో ఉంటుందా? అంకెల్నే తీసుకొందాం రెండు అంటే రెండు వస్తువులు మాత్రమే కాదు. జంట, జత అనే భావనలూ ఉంటాయి. మూడు ముచ్చటగా అంటాం. త్రిమూర్తులు త్రికాలములు అంటూ మూడుతో ఎన్నో ముడిపడి ఉన్నాయి. ఇలా నాలుగు, ఐదు, ఆరు, ఏడు, ఎనిమిది, తొమ్మిది, పది- వరస అంకెలు వెనుక కథలు గాథలు ఉన్నాయి.

మన శరీర అవయవాలే తీసుకొందాం 'గుండెలు' అనే మాటచుట్టూ గుండెలు పిండే, తలంపులు దాగి ఉన్నాయి. గుండెలు మండి పోతున్నాయి అంటాం. గుండెల్లో బాకు, గుండెల్లో గునపాలుగుచ్చు, గుండెలు నీరుగారు, గుండెల్లో గుబులు ఇలా ఎన్నో జాతీయాలు ఉన్నాయి. హార్టులో ఏముంది హర్టు! గావడం దప్ప. కండ్లల్లో ఉన్న కసి, కామం 'ఐస్' లో ఉండవు. ఇంటి ముందు ముగ్గులోనే మూడు తరాల కథలుంటాయి. ఇలా చెప్పుకుంటూ పోతే, చాలా ఉంటాయి. ఇంత అవేదనతో చెప్పడం వెనుక ఉన్న ఉద్దేశ్యం ఒక్కటే. మన జీవితాలతో పెనవేసుకొన్న భాష ఏదో ఆ భాషతోనే ఆ పదజాలం తోనే ప్రపంచాన్ని అర్థం చేసుకోడానికి మన మెదడు ప్రయత్నిస్తుంది. ఆ భాష, ఆ పదాల్లో ఆ జాతి హృదయం ఉంది. ఆ హృదయంతోనే ప్రపంచాన్ని చూస్తాం. అప్పుడు మాత్రమే ప్రపంచాన్ని, మనుషుల్ని సరిగా అర్థం చేసుకోగలం. అమ్మనుడి పక్కన బెట్టి పరభాషలో ప్రపంచాన్ని అర్థం చేసుకోవడం గానీ, జ్ఞానాన్ని సంపాదించడంగానీ, సాధ్యంకాదు. అర్థం చేసుకొన్నట్లు నటిస్తూ ఉండవచ్చు. ఈ నటన ఎప్పుడో ఒక రోజు భళ్లున బయట పడుతుంది. 'మళ్లీ' మొదటికొస్తాం. చరిత్ర ఎప్పుడూ ఒక అడుగు వెనక్కు, రెండు అడుగులు ముందుకు అన్నట్లు నడుస్తూ ఉంటుంది. మనుషులు ముందుకే నడుస్తారు. జరిగిన తప్పులు తెలుసుకొంటారు. సరిదిద్దుకొంటారు.

మాతృభాషలో తప్ప, పరభాషలో అభివృద్ధి అయిన జాతీలేదు దేశమూలేదు. ఇది సాధ్యం కూడా కాదు. రాబోయే రోజుల్లో ప్రజలు ఇవన్నీ అర్థం చేసుకొంటారు. మాతృభాషకు పట్టంకడతారు. పరిపాలనా భాషగా కూడా మారుతుంది. ఈ లోపు మనం తల్లిభాషకు చదువులకు, జ్ఞానానికి, మంచితనానికీ గల పరస్పర సంబంధాన్ని వివరిస్తూ, ప్రజల్ని చైతన్య వంతుల్ని చేస్తూ ఉండాలి. అవసరమైతే తెలుగు భాషను తెలుగు వాచకాలను ఆధునిక కాలానికి తగినట్లు సంస్కరించుకోడానికి కూడా ఆలోచనలు చేయాలి.

**మానవ ప్రయత్నం లేకుండా సమాజం దానికే అది మారదు.**



డా॥ పి. శివరామకృష్ణ 'శక్తి'
94414 27977

# ఆఫ్రికాలో అమ్మనుడి 'మూలాలకు తిరిగి రావాలి'.

**కెన్యా** రచయిత గుగి వా తియంగో జైలు రచన 'బందీ' లో తనకు స్ఫూర్తినిచ్చిన అనేక విషయాలను తలచుకుంటాడు. 'బ్రిటిష్ వాళ్ళు రాకపూర్వం, ఆఫ్రికన్లు తమ వ్యవహారాలను నిర్ణయించగలిగి ఉంటే - ఇప్పుడు కూడా వాళ్ళు ఆపని చేయగలరు' అని తెల్లవాడి కోర్టులో వాదించిన మాఖేన్ సింగ్, పూర్వీకులు ఆసియా వాళ్ళు అయినప్పటికీ 'ప్రజల భాష నేర్చుకోండి.మీ సంస్కృతిలో ఉత్తమమైన దాన్ని నేర్చుకోండి. ఇదే మన విముక్తి మార్గం. ఇందులోనే మనకు గమ్యం ఉంది' అని ఉద్బోధించి,. కెన్యాలో కార్మికోద్యమానికి అందించిన సేవలు, రచనలు పేర్కొంటూ పదేళ్ళు జైల్లో పెట్టి చివరకు అతన్ని కాల్చిచంపినందుకు బాధ పడతాడు.(140)

మనకు మన్యం, వాళ్ళ ఆఫ్రికాలో ఉద్యోగ, వ్యాపారాలు, ఉద్యమాల రీత్యా' స్థిరపడిన వలసవాదులు' ఉత్పత్తి చేసిందేమీ లేదు. కళలేదు. సాహిత్యం లేదు. సంస్కృతిలేదు. ఒక చిన్న సామ్రాజ్యాన్ని తయారు చేసుకున్నారు. సృజనాత్మక సాహిత్యంలో వాళ్ళు చేరుకున్న ఎత్తు ఎంతంటే.. వాళ్ళు గిలికింది యాత్రా గైడ్ లు మాత్రమే.' అని నిరసిస్తాడు

'వలసవాదులకు పూర్వం, ఆఫ్రికా రైతాంగ సంస్కృతిలో ఉన్న అణచివేత, అభివృద్ధి నిరోధక ధోరణులు ,జాతి దురహంకారం, భయం, మౌనం, వలసవాదుల ధోరణులకన్నా కొంచమే తక్కువ తీవ్రతగలవి అని నేను అనుకుంటున్నాను. వాటికీ వ్యతిరేకంగా పోరాడాలిసిందే. కాకపోతే వేరే ఆయుధాలతో పోరాడి తీరాలి'.(155). అంటూ తన సమాజం లో సరిచేసుకోవలసిన పద్ధతులను గమనిస్తాడు. (199) వలస ప్రభుత్వం పాలనా విధానాలు, వాళ్ళ కోర్టులు 'మోసేవాని చేతులనుంచి దొంగతనం చేసిన వైపు లాగే వాని ఆస్థిని కాపాడటానికి న్యాయశాస్త్రం పరిగెత్తుతుంది'(176). అని దుయ్య బడతాడు.

కెన్యా, సోమాలియా జానపద సాహిత్యం లో 'చీఫ్ మొహమ్మద్ కాబాలఫ్, ఎగాల్ని డాడ్ వీరోచిత గాధలు వివరించే అద్భుతమైన సోమాలి జానపద కథలు .. ఆలిదుబాద్, వాసొంగా పిజేయు జానపద గాథలకు గనులు (199)సయిద్ అబ్దుల్లా హసన్ గొప్ప ఆఫ్రికా దేశభక్తుడు. ఇతని చరిత్రను కెన్యాతో పాటు సోమాలి పంచుకుంటుంది.(183) అని తలచుకుంటూ జైలులో.' మేం కథలు చెప్పే సెషన్లు ఏర్పాటు చేసే వాళ్ళం.. ' అని చెప్పుకొస్తాడు.మేఘసందేశం లాంటి కపోత స్వేచ్ఛ జానపద కథ(215) ను వివరిస్తాడు..

'మూలాల దగ్గరకు తిరిగి రావాలి. స్థిరపడిన వలసవాది, ఆదివాసీ రైతాంగ భాషలను అసహ్యించుకున్నాడు. వాటికి గ్రామీణభాషలు అని పేరుపెట్టాడు. రైతాంగం తల్లిదండ్రుల భాషలు,వాటి ద్వారా మాత్రమే ప్రజల సామూహిక జీవితాలతో మమేకం కావటం సాధ్యమౌతుంది. వాటిద్వారానే రైతుల జీవితం, సమస్యల దైనందిన లయల నుండి ప్రేరణ లభిస్తుంది' అని ప్రసంగిస్తాడు (249) తను ఇంగ్లీష్‌లో రాసినంతసేపు ఎవరూ పట్టించుకోలేదు. తన మాతృభాషలో నాటకం రాసి ప్రదర్శనలు ఇవ్వటం మొదలుపెట్టే సరికి ప్రభుత్వం విరుచుకుపడి, తనను జైలులో పెట్టింది అంటూ ఆ పరిణామాలను గుర్తు తెచ్చుకుంటాడు..

**'చిరిగిపోయిన గుడ్డల నుంచి చిన్న దోషాలు కనిపిస్తాయి. నిండా కప్పే దుస్తులు, బొచ్చు గౌనులు అన్నీ దాస్తాయి' అని విల్లియం బ్లేక్ ను ఉదహరిస్తూ స్థిరపడిన వలస వారి నాగరికత బడాయిని ఎద్దేవా చేస్తాడు. (బందీ (1982). అనువాదం స్వేచ్ఛాసాహితి 1996)**

**క్రమంగా అతడు మాతృభాషలోనే రాస్తానని శపథం చేస్తాడు. విశ్వవిద్యాలయాల్లో ఇంగ్లీష్, ఫ్రెంచ్, డచ్ వగైరా భాషలలో సాహిత్యాన్ని బోధించే బదులు, ఆ భాషలలో ఆఫ్రికా గురించి రాసింది బోధించాలని పోరాడి నెగ్గుతాడు.** 'to starve or kill a language is to starve and kill peoples memory' **పరాయి భాష, పరాయి సాహిత్యం మన జ్ఞాపకాలను, ఆయా దేశ కాలాలతో మన అనుబంధాలను చంపేస్తాయి అని ఆయా భాషల శాఖల పాఠాలు మార్పిస్తాడు.**

**ఇటువంటి రచనలు అనువాదాలు చేసేవారు రచయితలను ఏ ప్రభుత్వమైనా నిర్బంధిస్తుంది అనే పోలిక తెస్తారు. కానీ గుగి తన భాష, తన జ్ఞాపకాలను సజీవంగా అందించే జానపద సాహిత్యం, దాన్ని చాటిచెప్పే అమ్మనుడి కోసం స్వేచ్ఛను కోరుకున్నాడనే విషయం విస్మరిస్తారు. మన గిరిజన సాహిత్యం దగ్గరకు వచ్చేసరికి 'గెరిల్లాల ద్వారా ప్రచార మయ్యే ఉద్యమసాహిత్యం తప్ప, గిరిజనులు అమ్మమ్మ నాయనమ్మ కథలను ఎప్పుడో మరిచిపోయారు' (జంగల్ నామా తెలుగు అనువాదం ముందుమాట) అంటూ తీసిపారేస్తారు. త్రిపురనేని మధుసూదనరావు రామరాజుగారి 'జానపద గేయ సాహిత్యం'లో పాటలు పదే పదే ఉదహరిస్తారు. కే.వి. రమణారెడ్డి తంగిరాల సిద్ధాంత గ్రంథం వీరగాథలు 'సమాంతరసాహిత్యం' గా వర్ణిస్తూ, భారతిలో వ్యాసం రాసారు. ఇక గిరిజనుల సాహిత్యం అనగానే 'అమ్మమ్మ నాయనమ్మ' కథలైనాయి. కాని ఆఫ్రికన్లు జానపద సాహిత్యానికి** Orature (Oral literature) **గా విశిష్ట స్థానమిచ్చారు. తెల్లవాళ్ళు రాకముందు వారిదంతా మౌఖిక**



రెండవ ముద్రణ 2018

**సాహిత్యమే.**

**గుగికి ముందే, తెల్లవాళ్ళు వచ్చేనాటికి ఆదివాసీ జీవితాన్ని ఆంగ్లంలో నవలగా రాసిన చినువా అచ్చే ప్రపంచ ఖ్యాతి పొందాడు.**

1958లో వచ్చి, నోబెల్ బహుమతి పొందిన అతని నైజీరియా నవలకు 2003లో 'ప్రజాసాహితి' అనువాదం 'చెదిరిన సమాజం' లో 'ఉపయోగించిన సామెతలు, జానపద కథలతో' ఒక పెద్ద జాబితా తయారు చేయవచ్చు. అలాగే వారి సంప్రదాయాల, నిషిద్ధాల జాబితా కూడా రూపొందించవచ్చు' నని సంపాదకులు ఈ రచన ప్రత్యేకత వెల్లడిస్తారు. వివాహపద్ధతి, అంతిమ సంస్కారం, వ్యవసాయ పద్ధతులు, పంట 'కొత్త'పండుగలు (యాం పండుగలు) ఊరంతా పండుగకు తయారు కావటం, పుట్టలు పగిలి ఉసిళ్లు వచ్చినపుడు వాటిని తెచ్చుకోడానికి సందడి, దుంపలు తవ్వటంలో పడే శ్రమ, భూమికి సంబంధించిన ఆచారాలు. తాగి తందనాలాడేజనాన్ని కలుపుతూ రచయిత ఒక కథ అల్లుతాడు'. నవల ప్రారంభంలో 'ఇగ్బో తెగ ప్రజలలో సంభాషణా కళకు ఎంతో ప్రాముఖ్యం ఉంది. సామెతలు ఆ కళకు జవసత్వాలనిస్తాయి' అని ఆదివాసీ నేపథ్యంతో రచించవలసిన పద్ధతిని నొక్కి చెప్పారు..

ఈ నవలలో కనిపించే జీవితం ఇప్పటికీ మన గిరిజనుల మారుమూల గ్రామాలలో కనిపిస్తుంది.' ఈ గ్రామాలలో చాటింపు చేసే వాడి ద్వారానే ప్రజలందరికీ సమాచారం అందించటం. తీసుకు వచ్చిన కన్యను అప్పగించటంలో న్యాయపద్ధతి, మొదటి భార్య ప్రాముఖ్యత, ఒక స్త్రీ తన భర్తనుంచి పారిపోతే, ఆమెకు ఇచ్చిన ఓలి అతడికి తిరిగి ఇచ్చివేయటం. సంప్రదాయ పద్ధతిలో కాకపోయినా, అంగీకార యోగ్యమైన పద్ధతిలోనే వివాహం, సరైన సాక్ష్యం మీదనే తీర్పు. వయసు ప్రాతిపదిక గా ఒకరి తరువాత ఒకరు వాటాలు . విందుకు రాలేకపోయిన కొద్దిమంది బంధువులకు కూడా, వాళ్ళ మాంసం వాటాలు పక్కకు తీసి అట్టే పెట్టటం(కలిమి ముద్దులు)' ఈ కట్టుబాట్లు మనలోనూ ఉన్నవే.. దుంపలు(యాం, కసావా- కంద,పెండలం) తవ్వడంలో కష్టాలు, కల్లుబసలు, రకరకాల కల్లులు, తాగి తందనాలు, కొత్త పండుగలకు ఇల్లు సిద్ధం చేసుకోటంలో హడాహుడి, నవలలో మల్ల యుద్ధ పోటీలు, మన వాళ్ళలోనైతే విలువిద్య పోటీలు.... ఇవన్నీ మన సామెతలు, నానుడులతో బాగా చెప్పొచ్చు.

తప్పు, వెలి- మనలో ఉన్నాయి. కాని కవలలు పుట్టిన వారిని వెలివేయటం మనలో లేదు. కాని, వెలివేయబడిన వారికి ఆశ్రయమిచ్చే పాపిష్టి అరణ్యం, దానికి ప్రతినిధి కొండచిలువను ఆకాశపు ఇంద్రధనుస్సుగా చూడటం, (దాన్ని మన ఊళ్ళలో ఆబోతును పవిత్రంగా చూసినట్లు). వంటి నమ్మకాలు మనకూ ఉన్నాయి. క్రూరజంతువులుండే అడవికి కొండరాజులు, అడవి దెయ్యాలు, కొండ దానుగుడు (దానవుడు), (కాటమరాయుడు). అధిదేవతలుగా మన గిరిజనులు భావిస్తారు.

ఇటువంటి చోటికి తెల్లవాడు వచ్చాడు. చర్చి కట్టుకోటంకోసం వెలి అయిన వాళ్ళు తలదాచుకునే 'పాపిష్టిఅరణ్యం'లో అతనికి స్థలం ఇచ్చారు. వెలి అయిన వాళ్ళు ఆ మతంలో చేరితే మొదట్లో పీడ విరగడ అయిందనుకున్నారు. కాని వాళ్ళ బలగం పెరుగుతుంది. వాళ్ళు గిరిజన సంప్రదాయాలను దేవతలను తూలనాడసాగారు. పండుగలు మానేసారు. వాళ్ళు కొండచిలువను చంపారనే రుజువుకాని అనుమానాలు మొదలైనాయి. వాళ్ళ చర్చిని ధ్వంసం చేశారు. జనం అటూ ఇటూ మాట్లాడసాగారు. 'ఒకే గొంతుతో ఏమి మాట్లాడాలో తెలియని తరం' తయారైంది. 'చర్చి వాళ్ళు క్రమంగా తమ మతంలో చేరిన వారికి, బానిసలకు, బదుగువర్గాలకు, విదేశీయులు ఉంచుకున్న వాళ్ళకు పుట్టిన పిల్లలకు విద్య నేర్పేవారు. ప్రభుత్వంలో ఈ చదువుకున్న వారికి ఆదరం పెరిగింది. 'క్రిస్టియానిటీ, స్కూళ్ళు, వ్యాపారం, ప్రభుత్వం పరస్పరం సహకరించుకుంటూ పాత వ్యవస్థను ధ్వంసం చేస్తుంటే, తెల్లవాడికి సహాయంగా సైనికులు, వార్తాహరులతో' పాటు వారితరపున పోరాడటానికి మన వారైన క్రిస్తియన్లు ఉంటే ఏమౌతుంది? అతడు తెలివైన వాడు..మనలను కలిపి ఉంచే అంశాలపై అతడొక బాకు గుచ్చాడు' అంటూ జనం నీరసపడిపోతారు.

ప్రధాన పాత్ర ఒక గణనాయకుడు ధీరోద్ధతుడు. 1970 ముందు మన గిరిజన ప్రాంతాలలో కొన్ని గ్రామాలను పాలించే ముఠాదారు (జమిందారు) వంటివాడు. చర్చి తగలపెట్టిన సంఘటన విచారించటానికి అతనితో పాటు పెద్దలను జిల్లా అధికారి కమీషనర్ పిలుస్తాడు. వారు ఆవేశపడి కత్తి దూస్తారు. ఆరుగురు పెద్దలను కమీషనర్ జైల్లో పెడతాడు. అతని సిబ్బంది, ఆ తెగ వాళ్ళే, ఆ పెద్దలను అత్యంత బాధాకరమైన అవమానాలకు గురిచేస్తారు. లంచం గుంజుతారు. అతడు జైలు నుంచి వచ్చాక ప్రతీకారం తీర్చుకోటానికి ఊళ్లోకి వచ్చిన కమీషనర్ పంపిన వార్తాహరుల నాయకుడి తల నరికేస్తాడు. అది చూసి అతని తెగవారు గందరగోళం పడతారుతప్ప, పోరాటానికి సిద్ధపడరు. అతన్ని అరెస్ట్ చేయటానికి కమీషనర్ వచ్చేసరికి అతను ఆత్మ హత్య చేసుకుంటాడు. వారి ఆచారం ప్రకారం అలా చేసుకున్న వారిని అపరిచితులు

మాత్రమే ఖననం చేయవచ్చు. చివరకు ఆ కమీషనర్ మనుషులే శవాన్ని ఖననం చేస్తారు. ఇదీ కథ. Things fall Apart, తో పాటు చినువా రాసిన మరో రెండునవలలు Arrow of God, No longer at ease లను కలిపి కాళిదాస త్రయం లాగా ఆఫ్రికన్ ట్రియోలజిగా ప్రసిద్ధి పొందాయి కాని వాటిలో 'చెదిరిన సమాజం' దే అగ్రస్థానం.. నాటక రచయిత సోఎంకా ఆఫ్రికన్ల స్వతంత్ర కాంక్ష నిలబెట్టటానికి జైలు పాలైనాడు. ఇప్పుడు నవలా రచయిత్రి చిమమండ, ఒకనాటి మార్గరెట్ మిడ్ వలె పాశ్చాత్య ప్రపంచాన్ని నిలదీస్తున్నారు.

అయితే మన పరిస్థితులు వేరు. ఈ అచ్చే నవల వచ్చిన రోజుల్లోనే, పరస్పరం కలహించుకునే ఈ ప్రాంతాలు, తెగలు: ప్రాచీన ధర్మాల అండదండలుగల ఆసియాఖండంలో వలె, ఒక దేశంగా, జాతిగా ఎలా ఎదుగుతారనే చర్చ ఆఫ్రికాలో జరుగుతుండేది.

మన గిరిజనుల సాహిత్యం సేకరించటం, ప్రపంచవ్యాప్తంగా విచారధార నేపథ్యంలో విశ్లేషించటం మన విశ్వవిద్యాలయాలలో 1976లోనే మొదలైంది. అప్పుడే ఈ చర్చలను ఆ అధ్యయనాలు పసిగట్టాయి. 1991లో అచ్చులోకి వచ్చిన ఈ కృషి 'తెలుగు గిరిజన గీతాలు' (పరివర్ధిత ముద్రణ (2007 'కొండకోనలలో తెలుగు గిరిజనులు') ఈ విషయాలను ప్రస్తావించింది. ('African ideologists lack the cultural resources which their Asian counterparts find in the high cultures of Hinduism, Buddhism, and Islamism' (Lloyd A Fallers.Nationalism in Uganda 1964.) అయితే ఈ సనాతనధర్మాలుగల మనకు, తెగలమధ్య ఇచ్చిపుచ్చుకోడాలు, ఘర్షణలు, తెల్లవాడు వచ్చాక పల్లపు వారికీ కొండవారి జీవన విధానాల మధ్య మారుతున్న సంబంధాలు అర్థం కావాలి. ఈ పుస్తకంపై ప్రసంగం విన్న నాటి పాడేరు గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ ఆఫీసర్ 200 కాపీలు కొని ఉపాధ్యాయులకు పంచి పెట్టారుకూడా. కాని గిరిజనతెగలు ఏ జిల్లా వాళ్ళు, ఆ జిల్లాకే పరిమితమై ఉంటారు. వాళ్ళకు తమ అధికారులు, తమ చుట్టూ ఉండే రచయితలు తప్ప తెలియదు. సర్కారీ, ఉద్యమ రచయితలు, గిరిజనుల సంస్కృతి సాహిత్యాలను పట్టించుకోలేదు. ఫలితం గా ఆదివాసీ అస్తిత్వాన్ని చాటే లిఖితసాహిత్యం ఎదీ రాలేదు.

ఈ నవల క్రైస్తవ మతవ్యాప్తి ప్రభావాన్ని చిత్రిస్తే, మన దగ్గర అభివృద్ధి పరిణామాలు గిరిజనులను బానిసలుగా మారుస్తున్నాయి. దీనిని గిరిజన రచయితలు ప్రశ్నించటం మొదలు పెట్టారు. అయితే ప్రశ్నించినంత మాత్రాన సరిపోదు. మూలాలు తెలుసుకోవాలి.

కానీ ప్రాచీన కాలం నుండి తూర్పు కనుమలను పాలించిన వారు గిరిజనులే . దిగువ ప్రాంతాలలో రాజులు, ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పుడు, ఈ కొండ దొరల దగ్గరే తలదాచుకునేవారు. కాస్త స్థిమిత పడినతరువాత వారిమీదనే పెత్తనం చేసే వారు. గిరిజనులు ఎదురు తిరిగే వారు. ఉత్తరాంధ్ర చరిత్ర అటువంటిదే. కృష్ణదేవరాయల కళింగదండయాత్రలో గజపతులు, వారి సామంతులు ఓడిపోయారు. వారిలో పూసపాటి వారు నేటికి మారుమూలలో ఓడిశా కోరాపుట్ జిల్లాలో ఉన్న నందపురం / జేపోర్ కొలువులో చేరారు. క్రమంగా వారి మీద ప్రతాపం చూపించసాగారు. గిరిజనులు తిరుగుబాటు చేశారు. చివరకు తెల్లవాళ్ళు పూసపాటి వారిని కట్టడి చేసి, కొండదొరలను స్వతంత్ర సంస్థానాలుగా గుర్తించారు. పూసపాటి వారు విజయనగరాన్ని అభివృద్ధి చేస్తే, జేపోర్, సాలూరు, పాచిపెంట, సంగంవలస, చెముడు, కురుపాం, మేరంగి పాలకులైన ఈ కొండదొరలు తమ రాజ్యాలను ప్రగతిపథంలో నడిపిస్తూ, విశాఖపట్నాన్ని అంతకంటే గొప్పగా అభివృద్ధి చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం కులపతి కొండదొర విక్రమదేవవర్మ జేపోర్ / నందపూర్ సంస్థానాధీశుడు. రంపపితూరీ చిరకాలంగా కొండవారి నాయకత్వంలో




సాగిన తిరుగుబాటుకు చివరి దశలో అల్లూరి సీతారామరాజు నాయకత్వం వహించిన సంగతి ఒకటి మనకు తెలుసు. ఆయన పేరుతప్ప- ఈ వారసత్వం ఈ తరం గిరిజనులకు తెలియకపోవటం దురదృష్టకరం.

మన రాష్ట్రంలో కూడా 1940 లోనే హైమెండర్ఫ్ చెంచులు, కొండరెడ్లు, గోండులను అధ్యయనం చేశారు. ఈ మౌలిక మైన అధ్యయనాలకు అనువాదాలు ఇంతవరకు రాలేదు. గోండుల మీద ఫిల్మ్ తీసిన ఆయన శిష్యుడు మైఖేల్ యార్క్ ఇటీవల తెలంగాణా పర్యటించారు.

గోపినాథ మొహంతి' అమృత సంతానం' కూడా ఒరియాలో చినువా అచ్చే చెదిరిన సమాజం వచ్చిన కాలంలోనే వెలువడింది. పురిపండా అప్పలస్వామి గారి అనువాదంగా 1966 కేంద్ర సాహిత్య అకాడెమీ ప్రచురించింది. అప్పటికే భద్రిరాజు కృష్ణమూర్తి అరకులోయలో తెగల భాష మీద వ్యాసం ప్రచురించారు. సెన్సస్ వారు ప్రతీ తెగ, కులం, వృత్తి సచిత్రమైన మీద మోనోగ్రాఫ్ లు ప్రచురించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మానవ శాస్త్ర శాఖ అన్ని తెగల మీద అధ్యయనాలు చేసింది. వీటిలో మునిరత్నం రెడ్డి విశాఖ గిరిజన ప్రాంతం మీద సంస్కృతీకరణ ప్రభావం ముఖ్యమైనది. అమృత సంతానం చినువా రచనల తులనాత్మక అధ్యయనాలు కూడా

చాలా జరిగాయి. అయితే ఈ రచనలో లోపించిన చారిత్రక స్పృహ, దార్శనిక మన గిరిజన సాహిత్యంలోని మోదకొండమ్మ, గిరిజన భారతం నంది పదంలో ప్రత్యేకత.

గిరిజన రచయితలు ప్రభుత్వం ఆదరణ కోసం ఎదురు చూస్తుంటే, సంప్రదాయ సాహిత్యం పోగుచేసేవారు తామే అచ్చువేసుకుంటున్నారు. 1976 నుండి ప్రారంభమైన అధ్యయనం, ఆదివాసీ సాధికారిత దిశగా ఎదిగి, ఈ సేకరణకు అండగా నిలబడుతుంది. అటవిహక్కుల గుర్తింపు కు ఈ జ్ఞానాన్ని ఉపయోగిస్తుంది.

అయితే తమ కథనానికి తగ్గట్లు సమాచారంతో సరిపెట్టే రచనలు ఇంత లోతుకుపోవు. ఏవో పరిమితులు చెపుతుంటారు. వీళ్ళకు తగ్గవాళ్ళే విమర్శకులు. ఏదో కాలక్షేపానికి, వచ్చిపోయే ఉద్యమాలకు తప్ప ఇప్పటివరకు వచ్చిన సాహిత్యం గిరిజనులను, వారి సమిష్టి చేతనను మేల్కొలపడానికి సరిపోదు. కాబట్టి చినువా, గోపీనాథ మొహంతి రచనలను మన గిరిజనుల నుడికారంతో తిరిగి రాయటం మొదలైంది. 'ప్రజాసాహితి' గిరిజనుల సాహిత్యం మీద సాహిత్య అకాడమీ సదస్సులలో ప్రసంగాలు 'తెలుగు గిరిజనులవ్యాప్తి, వాంగ్మయం తీరుతెన్నులు', 'తూర్పుకనుమలలో ప్రకృతి -గిరిజన జ్ఞాన పరంపర'లను మే 2011 6, జులై 2018, సంచికలలో ప్రచురించింది. ఈ మూలాలను, మార్పులను గమనించి చైతన్యం కలిగించకపోతే 'గుడ్డిగా శ్రమించే వర్గం, ఆ శ్రమను నిర్దేశించే వర్గం' గా సమాజం మిగిలిపోతుంది.

14 శతాబ్దికి చెందిన స్థలపురాణం ఆంధ్ర రాష్ట్ర గిరిజనోత్సవం మోదకొండమ్మ కథను నాటక ప్రయోక్త దిర్భాసి విజయ భాస్కర్ రూపకంగా, చింతకింది శ్రీనివాసరావు కథలుగా, నవలలుగా రాస్తున్నారు. అధ్యయనం చేసి రాసే ప్రయత్నం మొదలైంది.

**తనంత తానే వచ్చేది ఏమిలేదు'**

ఈ సందర్భంగా త్రిపురనేని, కొ.కు. ఇచ్చిన సలహాలు రచయితలు మరువరానివి.

**'అధ్యయనం లేకుండా ఎవరికీ శబ్ద సంపద పెరగదు. తనంతతానే వచ్చేది ఏమీ లేదు' ( సాహిత్యంలో వస్తు శిల్పాలు.148) అందునా గిరిజన సాహిత్యం అంగడిలో దొరికే వస్తువు కాదు.**

'ఈనాడు రచయితలకు పెద్దగా భాషాజ్ఞానమూ, పాండిత్యము, ప్రాచీన సాహిత్య పరిచయమూ అవసరములేదన్నది ఏనాడో నిర్ణయమయింది. కాని వారికీ జీవితానుభవం, సామాజిక దృక్పథము కూడా అవసరం లేదన్నది రాను రాను రుజువవుతున్నది. ఇతివృత్తాలలో పాత్రపోషణలో, సన్నివేశాలలో ఎలాటి వాస్తవికతా అవసరం లేదు'('కవిత్వం-చైతన్యం'. 157) .

**'సాహిత్యం జీవిత వృక్షానికి పూసే పువ్వు. చెట్టుకు పూలు పూస్తాయి గాని పువ్వుకు పూలు పూయవు. సాహిత్యానికి పుట్టే సాహిత్యం నాకు ఆనాడే కృత్రిమంగాను, కాగితం పూవులాగానూ కనిపించింది. (ప్రజాసాహితి.కొ.కు ప్రత్యేక సంచిక. 10) పరిశీలన గమనించాలి.** నేటివిటీ లేని రచనలు. కాగితపు పూలుగా మిగిలితే-అడవి సంప్రదాయంతో మమేకమైనవి గరికపూలైనా మనసును ఆకట్టుకుంటాయి.

'జాతి జీవనాళిక-జానపద గీతిక'-శ్రీశ్రీ

## స్పందన

**'జగమునేలిన తెలుగు'- గోదావరి నుంచి జావా దాక...**

మీరు చేపట్టిన కార్యక్రమం, మీ లక్ష్యం- ఆశ్చర్యం, అద్భుతం, అనితరసాధ్యం.
చీకటి వంటి గతంలోకి, పరిశోధనా లక్ష్యమనే కాగడాతో మీరు నడిచి వెళుతూ-
తెలుగుజాతి జయించి, పాలించిన లోకాన్ని తెలుగు లోకాన్ని మా ముందు ఆవిష్కరిస్తున్నారు.
ఇది ఎవరూ కనీసం ఊహించలేని కార్యక్రమం.
ఇది మీరు మాత్రమే సాధించగల కార్యక్షేత్రం.
ఇది మీరు సాధిస్తున్న ఆశయం.
ఇదంతా చూస్తూ, వింటూ, చదువుతూ నా గుండెల్లో ఆనందం. ఇందులో అతిశయోక్తి లేదు.
మీరు చేపట్టే కార్యక్రమాలన్నీ జయప్రదం కావాలని కోరుకుంటున్నాను.

-నగ్నముని హైదరాబాదు
12-10-20

## స్పందన

**మూ**లబడిపోతున్న తెలుగు సాంస్కృతిక మూలాలను గ్రహించడంలో, ఎరుక రేకెత్తించడానికీ మనలో తలపు కదలికలు తలిగించగల ప్రయోజన ధారావాహిక **'జగమునేలిన తెలుగు'.** నవలగా చెప్పబడుతూ, యాత్రాచరిత్రగా భాసిస్తూ వ్యాసగుణాల్ని పొదిగించుకుంటూ సాగుతున్న ఈ రచన రచయిత్రి డి.పి. అనూరాధ గారికి ఎదమెచ్చుకోలు.

తెలుగు బాసను, తెలుగు సంస్కృతిని రక్షించుకోవడంలో ఒక రకమైన బానిసత్వంలో కూరుకుపోయిన మనకు ఇటువంటి రచనలు పరోక్ష ప్రబోధాత్మకాలు.

అనూరాధగారు తాము చూసినవి మనం చూసేలా చేయడంలో సహజత్వం కనబడుతోంది. చరిత్ర అధ్యయనం తొంగిచూస్తోంది.

స.వెం.రమేష్, ఈమని శివనాగిరెడ్డి వంటివారిని ఆదర్శంగా తీసుకుంటే ఇంకా ఎంతో చేయొచ్చు. చేస్తున్నారు. 'కుంచమంత అమ్మాయివుంటే మంచం దగ్గరే కూడు' అనేది ఓ సామెత. Non academic research scholars లో తన సొమ్ముతో క్షేత్ర పర్యటనలు చేస్తూ ఒక తపనతో సామాజికోపయోగకర రచనల్ని మనకు ఒనగూడచేసే మేలిపనికి జేజేలు.

- సన్నిధానం నరసింహశర్మ
92920 55531

ధారావాహిక

ఈమని శివనాగిరెడ్డి
98485 98446

## అడుగుజాడలూ ఆనవాళ్లు-4

# నా గురజాల - మాడుగుల యాత్ర

**గు**రజాల. ఆ పేరు వినగానే పల్నాడు, పల్నాటి యుద్ధం గుర్తుకొస్తాయి. గుర్తుకొచ్చి గురజాల చూడాల్సిందేనని ఒక నాటి శనివారం, తెల్లవారు ఝూమున బయలుదేరాను. నాతోపాటు, మూటా ముల్లే సర్దుకొని, చందూ కార్తీక్ కూడ బయలుదేరాడు. ఉ. 6.00 గం. లకు గురజాల చేరుకొన్నాం. గురజాల ట్రావెలర్స్ బంగ్లా దగ్గర, ఈనాడు విలేకరి, అలరాజు మాకు స్వాగతం చెప్పాడు. అలరాజును చూడగానే, నాకు గురజాల ప్రభువైన నలగామరాజు కుమారుడు అలరాజు గుర్తుకొచ్చి, పల్నాటి ప్రభువులకు ప్రణామాలన్నాను. నిజంగానే తాను పల్నాటి ప్రభువునని మీసం మెలి పెట్టి, లేశమంత పల్నాటి పౌరుషాన్ని ప్రదర్శించాడు. మాటామంతీ తరువాత బజారు సెంటర్‌లో పల్నాటి కారందోశలు తిని, ఆనాడు చూడాల్సిన గురజాల, మాడుగుల గురించి ముచ్చటించుకొన్నాం.

ఒకప్పుడు గురివింద తీగలు దట్టంగా ఉండటాన ఆ ప్రదేశాన్ని గురిందాల, గురిజాల అని పిలిచిన గురజాలను ముందుగా చారిత్రకంగా జల్లెడ పట్టాలనుకొన్నాం. అది నిండు ఎండాకాలం. ఉదయం ఏడుగంటలకే మధ్యాహ్నం మూడు గంటల్లా ఉంది. యాత్రకు బయలుదేరే ముందు గురజాల ట్రావెలర్స్ బంగ్లా వెనుకనున్న ఇక్ష్వాకు రుద్రపురుషదత్తుని 5వ పాలనా సం॥ (క్రీ.శ.286) పు శాసనాన్ని ఒకసారి తడిమి, పట్టణానికి ఈశాన్యంగా ఉన్న గురజాలమ్మ గుడికెళ్లాం.

ఒక ఎత్తైన దిబ్బ మీదున్న కాకతీయుల కాలంనాటి ఆలయ శిథిలాలు వ్యథలను వెళ్ళగక్కుతున్నాయి. సగం వరకే మిగిలిన గోడలు, గత వైభవ ప్రాభవాల పరాభవాన్ని దిగమింగుతున్నాయి. మెట్లకిరువైపులా ఒకప్పుడు ఠీవిగా నిలబడి వొరిగిపోయిన ఏనుగుల మూలుగులు వినిపిస్తున్నాయి. పడిపోయిన రాళ్లు, 'పాత' పరిమళాల్ని వెదజల్లుతున్నాయి. ఆలయాన్ని మళ్లీ చూడొచ్చనుకొని, ఎడమవైపు పత్తి పొలంలో అన్ని చాళ్లూ కలియదిరుగుతున్న నాకు, క్రీ.పూ.1-3 శతాబ్దాల శాతవాహన, ఇక్ష్వాకుల కుండ పెంకులు, ఇటుక రాతి ముక్కలు, మట్టి పూసలు, శంఖపు గాజు ముక్కలు, లెక్కలేనన్ని కనపించాయి. దొరికిన ప్రతి పురావస్తువులోనూ నాకు ఒక గౌతమీపుత్ర శాతకర్ణి, వాసిష్ఠీపుత్ర శాతకర్ణి, యజ్ఞశ్రీ శాతకర్ణి, విజయ శాతకర్ణి, ఎహువల ఛాంతమూలుడు, వీరపురుష, రుద్రపురుషదత్తులు, కాలనాళిక పాళీల్లా కనిపించారు. పొలంలో అన్ని చాళ్లూ కాళ్ళరిగేలా తిరిగాను. వదిలేసిన వరికంకుల పరిగేరుకొన్నట్లుగా గుప్పెళ్ల కొద్దీ నలుపు, నలుపు-ఎరుపు, ఎరుపు, మెరుగుగల ఎరుపు మట్టిపాత్రల పెంకులు తెస్తుంటే, అలరాజు ఎదురొచ్చి అందుకొన్నాడు. గురుజాలమ్మగుడి అరుగుమీద పోసి, ఒక్కో శకలాన్ని చూస్తుంటే, చారిత్రక వినీలాకాశంలో తరతరాల తారల్ని చూచినట్లుంది.

కొంచెం సేపటి తరువాత, గరుజాలమ్మగుడిచుట్టూ తిరుగుతున్న నాకు, మాచర్ల పలకరాయిలో చెక్కిన 6 అంగుళాల ఎత్తు, 3 అంగుళాల వెడల్పు, అంగుళం మందం గల బొమ్మ కనిపించింది. అప్పటిదాకా చుట్టుపక్కల పచార్లు చేసిన నా చూపులు ఆబొమ్మ మీదే వాలాయి. ఆశ్చర్యం! క్రీ.శ.4వ శతాబ్ది నాటి మహిషాసురమర్దని బొమ్మ. ఇంతకు ముందు కర్నూలు జిల్లా వీరాపురం, హైదరాబాదు దగ్గర కీసరగుట్టలో బయల్పడిన 3-4 శతాబ్దాల మహిషాసురమర్దని బొమ్మల కంటే కొంచెం అందంగా, మలచబడింది. కుడికాలు దున్న తలపై పెట్టి, కుడిచేత్తో కత్తి ఎక్కుపెట్టి, ఎడమ చేత్తో దున్నతోకను ఒత్తిపట్టి, శూలంతో నొక్కిపెట్టి, రాక్షసుని మట్టుబెట్టడంలో మునిగిపోయింది. ఇక్ష్వాకుల అనంతర శిల్పకళతో తొణికిసలాడుతున్న ఆ శిల్పాన్ని, నాచేతిలోంచి, అలరాజు, ఆయన మిత్రులు అందుకొని పరమానంద భరితులై, ఏమైందో అనుకొన్న గురజాలమ్మ దొరికిందని సంబర పడిపోయారు.



అందరూ కలసి పాతపాటేశ్వరి అలయంలో ఆ విగ్రహాన్ని భద్రపరిచారు. ఒక పాత విగ్రహం, కొత్తగా దొరకటంతో పోగొట్టుకొన్న ఆత్మ బంధువును దొరకబుచ్చుకొన్నంత ఆనందం వారి సొంతమైంది. పాతపాటేశ్వరి ఆలయంలో ఆ సాయంత్రం, పిచ్చుకగుంట్ల పలనాటి వీరభారత కథాగానప్రదర్శన ఉందన్న బోర్డు కనిపించింది. మిస్సవుతున్నందుకు ఇంచుక బాధనిపించింది.

మళ్లీ సాగిన మా ప్రయాణం, గురజాలలో నాయకురాలు నాగమ్మ తవ్వించిన దూబ చెరువుకు చేరింది. క్రీ.శ.

1180లో ఆమె నిర్మించిందనుకొంటున్న ఇష్టకామేశ్వరి ఆలయాన్ని చూశాం. మందపోటు తరువాత, మాచర్లనుంచి, మంచికల్లు, మాడుగుల, రేవంతుల బయళ్ల మీదుగా, గురజాలకు చేరుకొన్న బ్రహ్మనాయుడు, ఆరాత్రికి ఈ ఆలయంలోనే నిద్రపోయిన సంగతి గుర్తొచ్చింది. అర్ధరాత్రి ఆలయపూజారి కొమ్మన, బ్రహ్మనాయునితో మంతనాలాడిన దృశ్యం కళ్లముందు కదలాడి అదృశ్యమైంది. నాయకురాలు నాగమ్మ ప్రతిరోజూ పూజించే ముక్కంటికి మొక్కి, బ్రహ్మనాయునికి ఆతిధ్యమిచ్చిన మొల్లల ముత్తసాని ఇంటికోసం, అప్పటిగురజాల రక్షకుడైన కాళిందిరాజు మేడకొసం వెతికినా జాడ దొరకలేదు. ఆనాటి జ్యోతిష్యుడు జ్యోస్యుల భీమన్న ముంగిలిని ముద్దాడదామను కొన్నాను. ఇష్టకామేశ్వరి ఆలయ పూజారి తంబల కొమ్మన ఇంటిపట్టును కనిపెట్టాలను కొన్నాను. గురజాల నేలిన అలుగురాజు పెద్దకొడుకు నలగామరాజు ప్రాసాదపు పంచపాళిలో కొంచెం సేపు మంచం పై వాలాలనుకొన్నాను. అలనాటి అడుగుజాడల్ని, కాలరక్కసి తన విరిజడల్లో బంధించిందేమో, నా ఆశలు ఆవిరైనాయి. కన్నడ రాజ్యలక్ష్మి కటాక్షం కోసం వెళుతూ శ్రీనాధుడు పల్నాడులో పడిన పాట్లు గుర్చుకొచ్చాయి.



గురజాలలోనే పెద్దగుడిగా పేరున్న

వీరభద్రుని గుడిలో కాలు పెట్టాం. ఎదురుగా ధ్వజస్తంభం పక్కన ఉన్న ఎత్తైన నాగ శాసన స్తంభం, కాకతీయశైలిలో నిర్మించిన ఆలయం, నిలువెత్తు వీరభద్రుని విగ్రహం చూశాం. ఆ విగ్రహానికున్న వెండి మీసాలు, మాచర్ల చెన్నకేశవుని మీసాలతో పోటీపడుతున్నాయా అన్నట్లున్నాయి. మళ్లీ గురజాల వైపు వస్తామో, రామోనని అక్కడీ శాసనాలున్నాయో, లేదో చూద్దామని బయలుదేరాం. బంగ్లా వెనుకనున్న రుద్రపురుషదత్తుని ప్రాకృత శాసనంలో 'తండుకసిరి' అనే వ్యక్తి, తన ఆయుషు కోసం హలంపురస్వామికి కొంతభూమి దానం చేసిన వివరాలున్నాయి. కోటసాని బావి దగ్గరి పల్లినాడు జాబిన్నాల్ కలహబోయుని కొడుకు ఊఋమైయ, ఉగ్ర అనే సైనికుడు కలసి వేసరం దగ్గర జరిగిన గోగ్రహణ యుద్ధంలో ఎఋమాటి గీతాలను ఆలపిస్తూ, జాయమ అనేవాణ్ణి చంపి, తామూ చనిపోయిన విషయాన్ని తెలిపే క్రీ.శ. 9వ శతాబ్ది శాసనాన్ని చూశాం. గురుజాలమ్మగుడి పక్కనున్న వీరుని శిల్పం పైనున్న క్రీ.శ 9వ శతాబ్దినాటి 'స్వస్తిశ్రీ పల్లినాటి అన్యావరంబు నాంటి' అన్న శాసనాక్షరాల్ని ఒకసారి స్పృశించాం.
వీరభద్రాలయంలోని క్రీ.శ 1129 నాటి శాసనంలో కొమ్మన కొడుకు దారుడు, ఇంకా కళ్యాణ చాళుక్య భూలోకమల్ల మూడో సోమేశ్వరుని సామంతుడైన హైహయ బేతభూపతి కలిపి, అప్పుడు మాధవీపట్నంగా పిలువబడిన గురజాలలో బ్రహ్మ, శ్రీపతి, పార్వతీపతులకు, అలయాన్ని కట్టించి, భూమిని దానంచేసిన విషయాన్ని, అక్కడే ఉన్న క్రీ.శ 1556 నాటి శాసనంలో తిరుమలరాజు వెంగళయ మహారాజు, బసవయ కలసి, ఆలయానికి చేసిన దానాలు తెలుసుకొన్నాను. గురజాలను గాలించటంలో మాకు సహకరించిన పాత్రికేయ మిత్రుడు అలరాజు, ఆయన అనుంగు మిత్రులూ, పాతపాటేశ్వరి ఆలయానికి ఎదురుగా ఉన్న ఒక హోటల్లో పల్నాటి రుచుల్ని చూపించారు.

ఆప్యాయంగా వీడుకోలు చెప్పి, మైత్రికి మచ్చుతునకలనిపించారు.

ఇక మా చూపు మాడుగులవైపు. గురజాలకు దక్షిణంగా 10 కి.మి. దూరంలో ఉంటుంది. మడుగు + అల= మాడుగుల. అంటే నీటి మడుగున్న ఊరని అర్థం. కాలేశ్వర, జనార్ధనస్వామి దేవాలయాలను చూద్దామని వెళ్తుంటే, నా కళ్లు ఒక ముళ్ల కంచెపై పడ్డాయి. కంచెలోంచి ఎర్ర ఇసుక రాతితో చెక్కిన ఒక విగ్రహం కనిపించింది. కారుదిగి, ముళ్లను సరిచేసుకొంటూ, విగ్రహాన్ని చూస్తే, అది 24వ జైన తీర్థంకరుడు వర్థమాన మహావీరుని శిల్పం. కేవల జ్ఞానాన్ని బోధించిన మహావీరుని గురించి తెలియక, తలదగ్గర విరిగిన ఆ శిల్పాన్ని చెత్త కుప్పల్లో, తుప్పల నడుమ పడేసి తప్పు చేశారనిపించింది. స్థానికులనడిగితే తాతల కాలం నుంచి అక్కడే ఉందన్నారు. ఒక ఉపాధ్యాయున్ని పిలిపించి, ఆ విగ్రహం చారిత్రక ప్రాధాన్యత చెప్పి పరిరక్షించమని కోరటం కంటే– ఏమీ చేయలేకపోయాను. రాజ కుటుంబంలో పుట్టి సర్వసంగపరిత్యాగి అయిన వర్ధమానుడు ముళ్లకంచెనే, కైవల్య పదంగా భావించాడనుకొని నవకరమంత్రాన్ని పఠించాను.



కాళేశ్వరస్వామి ఆలయం వెలుపల నిర్లక్ష్యంగా పడిఉన్న శిల్పాల్ని చూచి,

చేసేదిలేక ఆలయం లోపలికెళ్లాను. ఆశ్చర్యం! అది శివాలయమైనా, ఆరు బౌద్ధస్థంభాలు అక్కడక్కడా నిలబెట్టి ఉన్నాయి. క్రీ.శ. 2-3 శతాబ్దాల



బౌద్ధస్థావరాన్ని తలపిస్తున్నాయి. నడుముల దాకా కూరుకుపోయిన బాదామీ చాళుక్య శివాలయం, దానికి ఎడమవైపు కొంచెం దూరంలో ఒకప్పుడు పూజలందుకొన్న క్రీ.శ 5-8 శతాబ్దాలకు చెందిన గణపతి, దుర్గ, విష్ణు, సూర్య, కార్తికేయ శిల్పాలు ఒకదానిపై మరొకటి అస్తవ్యస్తంగా పడి, దిక్కుమొక్కూ లేని శవాల గుట్టను తలపించాయి. వారసత్వం



నిట్టూర్పుల్ని నేనే లెక్కబెట్టుకొంటూ, జనార్ధన స్వామి ఆలయంలో ప్రవేశించా. జీర్ణోద్ధరణలో భాగంగా, వైనం తైనం లేని గుడిలా తయారైంది. అక్కడా, ఇక్కడా అర్చనలు జరుగుతున్నాయి గానీ, అపురూప శిల్పాలు అనాధదేవుళ్లు గానే మిగిలిపోయాయి. రాష్ట్ర పురావస్తు శాఖ రక్షిత కట్టడాలుగా ప్రకటింపబడినాయి గానీ, ఆ శాఖ ఆప్యాయతకు నోచుకోలేక పోయాయి. గ్రామ పెద్దల్ని పిలిపించి గ్రామానికి రెండు వేల ఏళ్ల చరిత్ర ఉందనీ, ముందు బౌద్ధ, తరువాత జైన, ఆతరువాత బ్రాహ్మణ మత కేంద్రంగా విలసిల్లిందనీ చెప్పాను. నా విన్నపానికి క్షణికోద్రేక వాగ్దానం లభించటం ఆ క్షణానికి నాకు ఊరటనిచ్చింది.

మాడుగలలో కూడా శాసనాలు లేకపోలేదు. కాలేశ్వర ఆలయంలోని బౌద్ధస్థంభం పైన క్రీ.శ 6వ శతాబ్దిలిపిలో 'సింగధమస', అనీ, మరో స్థంభం మీద క్రీ.శ. 7వ శతాబ్దిలిపిలో 'వికురసంఘాట', 'చిన్తామణి చూఋ శౌవ్య శ్రీ' అని, 'శ్రీ అనాకర్తనీ' అనీ 'శ్రీసంసారభీత దేవర దీపంబు' అనీ 'పాటియఱకఱువు అల్లి దుర్జయ' అని- నాకు అంతగా అర్థం స్ఫురించని శాసనాలున్నాయి. అక్కడ ఉన్న క్రీ.శ. 13వ శతాబ్ది నాటి కాకతీయ గణపతిదేవుని కాలపు శాసనంలో, చక్రవర్తి బిరుదులు తప్ప ఇతర వివరాలు లేవు. అయినా అది గురజాల చరిత్రకు గణపతి దేవుని వేలు ముద్ర. మాడుగుల చరిత్రకు అనవాళ్లైన రెండు గుళ్లనూ, నిర్లక్ష్యానికి సాక్ష్యం గా మిగిలిన వర్ధమాన మహావీరుని శిల్పాలను చూచి విజయవాడకు వెళ్తూ- ఒకసారి వెనక్కుతిరిగి ఊరును చూశాను. పల్నాటి యుద్ధం మళ్లీ కళ్ల ముందు సన్నద్ధం. బ్రహ్మనాయుడు, కోడి పోరుకు గురుజాలకు బయలుదేరి, మాడుగుల చేరుకొని మాడుగుల రెడ్డి ఏర్పాటు చేసిన విందు ఆరగించటానికి ఆరాత్రి మాడుగులలో బసచేసిన విషయం మదిలో మెదిలింది. ఆ రోజు గురజాల చేరాల్సిన బ్రహ్మన్నను, నలగామరాజు వేగులు వచ్చి మరునాటి ఉదయానికి రమ్మని, విన్నవించగా అంగీకరించిన బ్రహ్మన్న, వారికి బహుమతులిచ్చి పంపిన సంగతి గుర్తుకొచ్చింది. మాడుగుల బ్రహ్మిరెడ్డి తన ఇంటి చావడిలో బ్రహ్మన్నకు బంగారు పళ్లెంలో భోజనాన్ని పెట్టడం, బ్రహ్మన్న గోపన్నను శిష్యునిగా స్వీకరించటం, మలిదేవుని తరఫు నాయకులు, రెడ్లు, బ్రహ్మన్నను కోడిపోరు మానుకోమని వేడుకోవడం, తెల్లవారే గురజాలకి బయలుదేరిన బ్రహ్మనాయున్ని మాడుగుల ప్రజలు, పెద్దలు, కాపులు, కరణాలు, రెడ్లు, బ్రహ్మిరెడ్డి, అందరూ కలసి మాడుగుల పొలిమేరదాకా సాగనంపటం, ఒక్కొక్కటిగా గుర్తుకొచ్చాయి. కమనీయ పల్నాటి వీర చరిత్ర బాలచంద్రుని యుద్ధ భాగం వరకూ రాసిన శ్రీనాథుడు, తక్కిన భాగాలు రాసిన కొండయ్య(న్న), మల్లయ్య(న్న)లకు నమస్కరించి, గురజాల చేరుకున్నాను. గురజాలమ్మ దగ్గర శెలవు తీసుకొని, ఆనాటి యాత్రలో చూచిన అడుగడుగునా తడబడుతున్న చారిత్రక ఆనవాళ్లను నెమరువేసుకొంటూ, పలనాటి బ్రహ్మన్న, నాయకురాలు నాగమ్మల పగలు, పౌరుషాలను తలచుకొంటూ విజయవాడ చేరుకొన్నాను. వచ్చీ రావటంతోనే నిద్రలోకి జారుకొన్నాను. కలలో పిచ్చుకకుంట్లు చెప్పిన పల్నాటి వీరగాథను విన్నాను. తరతరాల చారిత్రక దొంతర్లు జోలపాడగా నిద్రమ్మఒడిలో జోగిపోయాను.



"ఆంగ్లభాషతో చక్కని సంబంధం ఏర్పరచుకున్నప్పటికీ భారతీయ భావాలను స్వదేశీ భాషలో వ్యక్తం చేయగలిగినంత అందంగా ఆంగ్లభాషలో చేయలేరు."

**- రవీంద్రనాథ్ ఠాగూర్**

అప్పిరెడ్డి హరినాథరెడ్డి
99639 17187

# "పెన్నానది పేర్ల వెనుక చరిత్ర..."

పెన్నానది పేరు వినగానే పినాకినీ అని గుర్తుకొస్తుంది. పినాకినీ అనే పేరు పెన్నానదికి ఎలా వచ్చిందనే ఆలోచిస్తాం కానీ పెన్నకు ఉన్న నిజమైన అర్థం ఏముంటుందో పెద్దగా పట్టించుకోం.

పెన్నకు శబ్దరత్నాకరంలో పినాకినీ నది అని, బ్రౌణ్య తెలుగు ఇంగ్లీషు నిఘంటువులో The name of the river penna.which falls into the see near Nellor (పినాకినీ నది) అని ఉంది.

పినాకినీ పదానికి పై నిఘంటువు లలో వరుసగా నది విశేషము, The Sanskrit name of the river pennar which rises near Nandidroog and falls into the sea near Nellor అని ఉంది.

పెన్న అనగానే పినాకినీ అని వ్యవహారంలో స్థిరపడడానికి- ఈ నిఘంటువుల అర్థాలు కూడా ఒక ప్రధాన కారణంగా కనిపిస్తుంది.

పెన్నానది పినాకినీగా సంస్కృతీకరణంగానే కాకుండా పెన్న, సుప్రయోగ, మరికొన్ని స్థానిక పేర్లుగా కూడా కొనసాగుతుంది. పెన్నానది నామవాచకంగా, స్థలవాచకంగా, ప్రాంతవాచకంగా శాసనాలలో, ప్రాచీన సాహిత్యంలో కనిపిస్తుంది. వాటిని పరిశీలించ బోయేముందు అసలు పెన్న కు ఉన్న అర్థమేమో చూద్దాం.







**1. పెన్నానది :**

'పెన్'.. అనే మూల ద్రావిడ ధాతువుకు ద్రవిడియన్ ఎటిమలాజికల్ డిక్షనరీ వృద్ధి, పెంపు, అధికం, పెద్ద తదితర అర్థాలు చూపుతుంది. పెన్ - పెనుగా పెద్ద అనే అర్థంలో కనిపిస్తుంది.

పెణ్..అనే మరో ధాతువుకు ద్రవిడియన్ ఎటిమలాజికల్ డిక్షనరీ స్త్రీ, అమ్మాయి తదితర అర్థాలు చూపుతుంది. ఈ పెన్నానది విషయంగా పెన్ అంటే పెద్ద అనే అర్థంలోనే వ్యవహారంలో ఉంది. పెణ్ అనే స్త్రీవాచక సంబంధంగా పెన్న ఉంటుందా? అనేది కూడా పరిశీలించాలి.

పెన్నానది కోలారు జిల్లాలో, ప్రస్తుతం చిక్కబళ్ళాపురం జిల్లా సమీపాన గల నంది కొండలలో జన్మిస్తుంది. ఈ కొండలకు మరో భాగం చెన్నకేశవరాయ బెట్ట అని కూడా పేరుంది. ఈ నంది కొండలలో జన్మించి దక్షిణంగా కర్ణాటకలోని కోలార్ మీదుగా కృష్ణగిరి, ధర్మపురి, తిరుక్కోవిలూర్, విల్లుపురం జిల్లాల మీదుగా కడలూర్ వద్ద సముద్రంలో కలుస్తుంది. మొత్తం ఐదువందల కిలోమీటర్లుగా సాగే ఈ నదిని తమిళ భూభాగంలో తెన్ పెన్నై (దక్షిణ పెన్న) , పెన్నైయార్ గా, తెన్ పెన్నార్ గాను పిలువబడుతుంది. పెన్న+అఱ్వ పెన్నార్ అవుతోంది. అఱు కు తమిళంలో నది అని అర్థం. ఆంగ్లేయుల పాలన రికార్డులలో పెన్నార్ గానే ఉంది. తమిళంలో పెణ్ కాలక్రమంలో తెన్ పెన్నైయ్, పెన్నైయార్గా అయింది. దక్షిణదిశగా ప్రవహించే పెద్దనది అని వ్యవహారంలో ఉంది.

నంది కొండలలోనే పుట్టి ఉత్తరంగా కర్ణాటక, ఆంధ్రలలో ప్రవహించే పెన్నను తమిళులు వడ పెన్నై అంటారు. ఉత్తర పెన్న అని అర్థం. ఈ నది రాయలసీమ గుండా ఆరువందల కిలోమీటర్లు ప్రవహించి నెల్లూరు మీదుగా బంగాళాఖాతంలో కలుస్తుంది.

పెన్ ...అనే ధాతువుకు ముందు అనుకొన్న విధంగా పెంచు, పెనుపు, పెంపు తదితర రూపాలు తెలుగులో ఉన్నట్లు డి.ఇ.డి తెలుపుతుంది. పెన్ అంటే పెనుగా, పెద్ద అనే అర్థంలోను, అఱ్వ ఏఱు గా మారింది. కొన్ని శబ్దాలకు అచ్చు పరమైనపుడు ఉత్వలోపం,




ద్విత్వం రావడం ఉంది.

పెను+ ఏఱు వ పెన్నేఱు, పెన్నేరు అయింది. పెన్నేరుకు తెలుగులో ఔపవిభక్తి అయిన 'టి' చేరడంతో పెన్నేటి రూపం కూడా ఉంది.

రాయలసీమ ప్రాంతంలో పెద్దనది కావడం వలన పెను - పెన్న గా ఉంది. పెన్న అయిన నది పెన్నానది గా విశేషణ పూర్వపద కర్మధారాయ సమాసమయింది.

క్రీ.శ. 1527 శ్రీకృష్ణదేవరాయల కాలం నాటి శాసనంలో నాచిరాజు సోముని అగ్రహారంలోని తురిమిళ్ళదిన్నె చెన్నకేశవాలయం వద్ద శాసనంలో "గండికోట సీమలోని పుష్పగిరి ప్రాంత్యం పెన్నకు వుత్తరం" అని పెన్నానది అని పేరు ప్రస్తావన ఉంది.

పెన్న కేవలం నామవాచకంగా కాకుండా స్థలవాచకంగాను శాసనాలలో కనిపిస్తుంది

గుత్తిరాజ్యం సమీపంలో తాడిపత్రి వద్ద పెన్నానది ఉత్తరంగా ప్రవహిస్తుంది. ఈ తాడిపత్రి ప్రాంతాన్ని తెంకణముగా కీ.శ 1120 నాడు రామేశ్వరాలయంలోని ప్రతాపకుమార ఉదయాదిత్య మహారాజు కన్నడ శాసనం తెలుపుతుంది. ఈ శాసనంలో 'తెంకణ ధారణి యల్లి పెన్నపరినాడు నిరంతర ఒప్పితోరగుఁ' అని స్పష్టంగా పేర్కొన్నారు. పెన్నపరినాడు అని ఒక ప్రాంతంగా ఉంది.

గండికోట కైఫియత్తులో ఆ దుర్గానికి పశ్చిమంగా పెన్నదరిన ఉండే గ్రామాలు పెన్నదాడిగా పేర్కొన్నారు.

గుత్తిరాజ్యంలోని ఈ పెన్నకు రెండు వైపుల ఉన్న ప్రదేశాలను పెన్నబడిగా, పెన్నంబడిగా పిలిచేవారు. 1509 లో తాడిపత్రి గ్రామ శాసనంలో గుత్తి రాజ్యం, పెన్నంబడి స్థలం అని పేర్కొన్నారు. శాసనాల రీత్యా బడి అంటే మార్గము, స్థలము అని అర్థం. తెంకణములోని పెన్నబడి ప్రాంతం, అంటే తాడిపత్రి పరిసరాలలోని స్థలవాచకంగా శాసనాలలో కనిపిస్తుంది.

పాల్కురికి సోమనాథుడు పండితారాధ్య చరిత్రలో పెన్నానది ప్రస్తావన ఉంది.

తిక్కన పెన్నాతీరం నివాసి. సంస్కృత భారతంలో పెన్నానదికి సుప్రయోగ అనే సంస్కృత పదం ఉపయోగించారు. ఆంధ్రభారతం రచనలో తిక్కన సుప్రయోగ అనే సంస్కృత పదం కాకుండా జనవాడుక లోని పెన్న పదాన్ని ఆయా సందర్భాలలో తీసుకొన్నాడు. కుందూరి ఈశ్వరదత్తు ఈ విషయాన్ని ప్రాచీనాంధ్ర చారిత్రక భూగోళం పుస్తకంలో వివరించారు.

"గంగయు, తుంగభద్రయు, వేత్రవతియు, వేదవతియు, కృష్ణవేణియు, బెన్నయు, యమునయు, తమసము, శరావతియు, కావేరియు, గోదావరియు" అని భీష్మ పర్వం ప్రథమాశ్వాసంలోని 38వ వచనంలో పెన్న అని ఉపయోగించాడు.

''పెన్నయును మహానది నాడిన మయూరహంస విమానగతులగుదురు" అని అరణ్యపర్వం ద్వితీయాశ్వాసం 278 వ వచనంలో పెన్న పదం ప్రయోగం ఉంది.

ఈ విధంగా ప్రాచీన సాహిత్యంలోను పెన్న పేరు ప్రతిఫలిస్తుంది.

### 2. హెన్నె, హెన్నయనది:

పెన్నానది కన్నడంలో హెన్న నదిగా ఉంది. క్రీ.శ 1388 నాటి వీరప్రతాప బుక్కరాయలు గౌరిబిదనూరు వద్ద ప్రకటించిన కన్నడశాసనంలో అక్కడి పెన్నానది నుండి హిందూపురం, పెనుకొండకు నీళ్ళు తీసుకెళ్ళే ''బుక్కరాయ మండకాలువ'' వివరాలున్నాయి. ఆ కన్నడ శాసనంలో '' పెనుగొండిగె హెన్నయనదియను తరుబేకేందు" అని ఉంది. ఇందులో పెన్న హెన్నయగా ఉంది.

విజయనగర శాసనాలలో హెన్నయ మాగాణి (గుత్తి రాజ్యంలోని హెంనెయ మాగాణి) వ్యవహరించడం ఉంది. మాగాణి అంటే మండలంలోని భాగం అని అర్థం.

శ్రీకృష్ణదేవరాయల కన్నడశాసనంలో "గుత్తిసీమయూళగణం రంగనూరు తాడిపత్రి తాలూకా హెంనెనాడ యూళగణం వంగనూరు గ్రామ" అని ఉంది. ఇందులో 'హెన్నె నాడు' అని స్థలంగా ఉంది. హోసూరు ప్రాంతంలో పెన్నాగరం, హెన్నేశ్వరం, హెన్నాగరం ఊర్లపేర్లు దక్షిణ పెన్నానది వెంబడి కనిపిస్తాయి.

మూలద్రావిడంలోని 'ప'కారం కన్నడంలో 'హ'కారం కావడం సాధారణం. పల్లి - హళ్ళి అయినట్టుగా. పెన్న - హెన్నగా అయింది. కన్నడంలో హెన్నకు ప్రత్యేక అర్థం లేదు. తెలుగులోని పెద్ద అనే అర్థమే ఉంది.

### 3. పినాకిని :

తెలుగు పదాలు సంస్కృతీకరణం జరుగుతూ వచ్చాయి. పెన్నానది పేరును యథాతథంగా సంస్కృతీకరణం చేస్తే పెనుకొండ - ఘనగిరి అయినట్టు, ఘననది కావాలి. అలా కాకుండా పెన్నానదిని స్వరూప, పురాణ సంబంధంగా సంస్కృతంలో పినాకినిగా

రూపుదిద్దుకుంది.

(పా+ఆకన్, పాతి రక్షతి) పాపులను రక్షించునది పినాక: అది శివుని ధనుస్సు. పినాకము కలవాడు శివుడు. పెన్నానదికి శివుని ధనస్సు పేరైన పినాక: స్థిరమైంది. పినాక: అని ఈ నదికి పేరు కొనసాగడానికి కొన్ని కారణాలు కనిపిస్తున్నాయి.

పెన్నానది నంది కొండలలో జన్మిస్తుంది. ప్రాచీన నందీశ్వరుని ఆలయం నందికొండపై ఉంది. నందికొండలకు ఉత్తరం, దక్షిణం ఈశ్వరుని ధనస్సు వలె ఆకారంతో పెన్నానది దక్షిణ, ఉత్తారాల వైపుల వంపులుగా ప్రవహిస్తుండటంతో పినాక: అయిందని ఒక అభిప్రాయం ఉంది.

పాపాలను తొలగించే నది అనే అర్థంలో పినాక: పేరు ఉండే అవకాశం ఉంది. నందికొండల నుండే తూర్పుకు ప్రవహించి కడప జిల్లాలో పెన్నలో కలిసే ఒక ఉపనదికి పాపఘ్ని అనే పేరు ఉంది. పాపాలను అగ్ని వలె దహించివేసే నది అనే అర్థంలో అక్కడ కనిపిస్తుంది. అదే అర్థంలో ఇక్కడ పెన్నానది కూడా పాపాలను తొలగించే నది అనే అర్థంలోనే పినాక: పేరు ఉండే అవకాశం బలంగా ఉంది.

తెలుగులో ఉన్న లింగవిభక్తి వ్యవస్థ సంస్కృతంలో లేదు. శంభుః - శాంభవి, శర్వ: - శర్వాణి అయినట్టు పినాక: - పినాకినీ అని స్త్రీ లింగంగా రూపొందింది. నది స్త్రీరూపంలో చెప్పడం సాధారణం.

ఈ విధంగా పెన్నానదికి పినాకినీ అనే పేరు కూడా రూపొందింది.

**శాసనాలలోను పినాకినీ నది వివరాలున్నాయి.**

నాచనసోముడు మొదటి బుక్కరాయల నుండి 1344లలో పెంచుకలదిన్నె అగ్రహారం పొందారు. ఆ దానశాసన తామ్రపత్ర శ్లోకంలో..."పినాకినీ తటే పెంచుకల దిన్నాహ్వయం పుర" అని ఉంది.

కడప జిల్లా కత్తెరగండ్లలోని చెన్నకేశవ దేవాలయం మండపం గోడమీద 1529 నాటి శ్రీకృష్ణదేవరాయల కాలం శాసనంలో "సిద్దేశ్వరుని సన్నిధికి పినాకినీ తీరమందు్ద అయ్యప్పరుసయ్య వారి తల్లిగారికి అచ్చమ్మకుం" అని ఉంది. ఈ విధంగా పినాకినీ నది ప్రస్తావన శాసనాలలో కనిపిస్తుంది.

**4. సుప్రయోగ:**

పెన్నానదికి సుప్రయోగ అనే పేరు సంస్కృత సాహిత్యం, శాసనాలలో కనిపిస్తుంది. కళ్యాణదుర్గం ప్రాంతంలోని గురువేపల్లి నరసింహులు 2018 లో 'సుప్రయోగ' శీర్షికన కవితా సంపుటిని ప్రచురించారు. మత్స్యపురాణంలో దక్షిణాపథనదులను వివరించే శ్లోకంలోని సుప్రయోగ పదం పెన్నానదికి నామాంతరంగా ఉంటుదని, ఈ విషయమై మరింత అధ్యయనం చేయాలని కవి పేర్కొన్నారు. సుప్రయోగ అంటే ప్రయోగించడానికి అనుకూలమైనది పినాకినీ (ధనస్సు) అనే అర్థంలో స్వీకరించి ఉంటారు.

సుప్రయోగ నది విషయమై "కుందూరి ఈశ్వరదత్తు" గారి "ప్రాచీనాంధ్ర చారిత్రక భూగోళం" పుస్తకంలో కింది వివరాలున్నాయి.

వాయుపురాణం, 45 వ అధ్యాయం, 104 శ్లోకంలో..

"గోదావరీ, భీమరథీ, కృష్ణవేణ్యాంచ వంజులా

తుంగభద్రా సుప్రయోగ కావేరిచ తథావగా

దక్షణాపథ నద్యాస్తు సహ్యాపాదాద్వినిశ్రుతా:" ...

ఈ శ్లోకంలో దక్షిణాపథంలో పడమటి కనుమల పాదాలనుండి జన్మించే నదుల వివరాలున్నాయి. కృష్ణ, తుంగభద్ర, సుప్రయోగ, కావేరి వరుస క్రమంలోని సుప్రయోగ పెన్నానదే అవుతుంది. నందికొండలు పడమటి కనుమలలోని దిగువభాగం లోనివే అవుతాయి. పెన్నానది నందికొండలలో ప్రారంభమవుతుంది.

మార్కండేయపురాణం, 54వ అధ్యాయం, 26వ శ్లోకంలో నదుల గురించి వివరిస్తుంది. ఇందులోను వాయుపురాణ శ్లోక వరుస క్రమమే ఉంది. మార్కండేయ పురాణాన్ని అనువదించిన 'మారన' సుప్రయోగ అనే పదమే యథాతథంగా రాశాడు.

సంస్కృత భారతం, అరణ్యపర్వం,222 అధ్యాయం, 24 వ శ్లోకంలో..

"వేణోప వేణా భీమాచ బడ బాచైవ భారత

భారతి సుప్రయోగాచ కావేరీ ముమ్మరాతథా:"..అని సుప్రయోగ నదిని పేర్కొన్నారు.

భీష్మపర్వం, 9 వ అధ్యాయం , 19వ శ్లోకంలో..

"కావేరీం చులకాంచాపి వీణాం శతబలనుపి

నీవారం మహితాంచాపి సుప్రయోగం జనాధిప!"...అని సుప్రయోగ పద ప్రయోగం ఉంది.

ఈ రెండు శ్లోకాలను తిక్కన ఆంధ్ర భారతంలో అనువదించే సందర్భంలో సుప్రయోగ పద స్థానంలో పెన్న అనే పదం ప్రయోగించడం ఇదివరకే చూశాం.

పల్లవ యువరాజు విష్ణుగోపుని ఉరువుపల్లి శాసనంలో..

"దక్షిణాందిశి సుప్రయోగ నదీ అవధి:" అని పేర్కొన్నారు.

రేనాటి చోళ రాజైన పుణ్యకుమారుడి మాలెపాడు తామ్ర శాసనంలో..

"ఆత్రేయ గోత్రాయ చిరువనహాళ కేశవశమ్మణే హిర

ణ్య రాష్ట్రే సుప్రయోగనద్యా బిరపారు(శకటరేఫం) నామగ్రామి:" అని ఉంది.

హిరణ్య రాష్ట్రం, సుప్రయోగ నదీతీరాన (పెన్నానది) బిరిపర్రు గ్రామంలోని కొంత భూమిని చిరువణహ గ్రామానికి చెందిన కేశవవర్మ అనే బ్రాహ్మణునికి దానమిచ్చినట్లు ఈ శాసనం తెలుపుతుంది. పుణ్యకుమారుడు క్రీ.శ 625 నాటి కాలం వారు. హిరణ్య రాష్ట్రం నెల్లూరు మండలంలోని ఉత్తర,పశ్చిమాలు, కడప మండలంలోని కొంత భాగం పెన్న పరిసరాలుగా ఉన్నాయి.

ఈ ఆధారాల బట్టి పెన్నానదికి సుప్రయోగ అనే పేరు ఉందని తెలుస్తుంది.

**5. మరికొన్ని స్థానిక పేర్లు:**

పెన్నానది పరిసర గ్రామాలలో స్థానికంగా అనేక పేర్లు వ్యవహారంలో ఉన్నాయి. పెన్నానదికి "ముచ్చేరు" అని అనడం ఉంది. పై ప్రాంతాలలో వర్షాలు పడి, చెరువులు తెగి దిగువ ప్రాంతాలలోకి అనుకోకుండా హఠాత్తుగా నది ప్రవహిస్తుండేది. ఎప్పుడొస్తుందో, ఎప్పుడూ పోతుందే తెలియదనే అర్థంలో ముచ్చేరు అనడం ఉంది.

"పీనుగులపెన్న" అని కూడా అంటారు. వరదలు తదితర సందర్భాలలో నది విపరీతంగా ప్రవహించి అందులో మనుషుల, పశువుల శవాలు కొట్టుకొని పోయేవి. అందుకే పీనుగులపెన్న అని

వ్యవహారంలో ఉంది.

విద్వాన్ విశ్వం గారు తన "పెన్నేటిపాట"లో పెన్న, పెన్నేటి, పినాకినీ అని ప్రయోగించారు. ఈ కావ్యంలో పీనుగుల పెన్న పదబంధానికి..

"వేయారు పీన్గు లిచ్చట,

నే అంత్యక్రియల బొందు నెప్పటి కపుడే" అని పేర్కొన్నాడు. పెన్న వెంబడి శవాల అంత్యక్రియలు జరగడానికి కేంద్రమవుతోందనే అర్థంలో ప్రయోగించాడు. పెన్నకు మరెన్నో స్థానికంగా వ్యవహారంలో ఉండే అవకాశం ఉంది.

పెన్నమ్మ, పెన్నప్ప, పెన్నోబిలేసు వంటి పేర్లు ఈ పెన్నానది నేపథ్యంగా విస్తృతంగా ఉన్నాయి. ఈ విధంగా పెన్నానది పేర్ల వెనుక అనేక చారిత్రక, సాంస్కృతిక అంశాలు ముడిపడి ఉన్నాయి.

పెన్నానది పరిసరాల ఆధారంగా వెలువడిన సాహిత్యం, భాష, ఆచార సంప్రదాయాలు, జనజీవనం తదితర సాంస్కృతిక అంశాలను ఇంకోసారి తెలుసుకొందాం. అ

## స్పందనలు

నవంబర్ నెల అమ్మనుడి ముఖచిత్రం నాట్యమయూరి శోభానాయుడు గారిది శోభాయమానంగా ఉన్నది. జూలియా "ఆమెలేఖలు" మొదటి నుండి చదివి చాలావిషయాలు తెలుసుకొంటిని. క్రీ.శే. పి.గోపాలకృష్ణ, డా॥ పురుషోత్తం గార్ల కృషి ద్వారా లేఖలలో సమాచారము తెలుసుకోగలిగాము. పుస్తకరూపంలో ప్రచురిస్తే "అమ్మనుడి" చదవని వారికి చాలా ఉపయోగముగా వుంటుంది. వారిది మెచ్చుకోదగిన గొప్ప కృషి. డా॥ శివనాగిరెడ్డి గారి శసనయాత్ర (శాసనాలకొరకు) ద్వారా చరిత్ర విషయాలు తెలుసుకోగలిగాను.

–శేషారావు.పి.వి, హైదరాబాదు. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా విశ్రాంత సంచాలకులు, సెల్:9490683101

---

మన 'అమ్మనుడి' పత్రికకు యు.జి.సి గుర్తింపు వచ్చినందుకు చాలా సంతోషము. అమ్మనుడి నవంబరు పత్రికలో 'మన భాసే మన గురించి సెప్తది' అనే కవిత బాగుంది. మరియు శ్రీ సి.వి.క్రిష్ణయ్య గారి 'చదవడం అంటే ఏమిటి' అన్న వ్యాసంలోని కొన్ని మాటలు చాలా విలువైనవి. అలా చేస్తే విద్యావిధానము వృద్ధమని వారి సందేశము.

నా.వెం.అశ్వత్థరెడ్డి, డెంకణీకోట, తమిళనాడు, సెల్: 9865171591

### మీ స్పందనలను తెలియజేయండి

**'అమ్మనుడి'**లోని రచనలపై

మీ స్పందనలను క్లుప్తంగా తెలియజేయండి.

సంపాదకుడు **'అమ్మనుడి'**
జి–2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి,
మాచవరం, విజయవాడ–520 004.
ఇ–మెయిల్ : editorammanudi@gmail.com

కవిత

# జన సమరసతా"నానీలు"

నీవు నేను కలిసి
మనమయితే
'మనుగడ'కి
భయమెందుకు?

చదువుల్లో
సమత్వం చెప్పినా
సర్టిఫికెట్లలో
కులం రాసుడేంది?

నిన్ను నన్ను
ఒకేలా మోస్తున్న తల్లి
ఒక్కరే!
తన్నుకోవడమెందుకు?

నీ రక్తం నా రక్తం
ఎరుపే అయినా
గొడవల్లో
'రక్తం' పారుతోంది.

కుంపటి మండేది
చలికాలమే
కులకుంపట్లో
మూడుకాలాల మంట

చేతివేళ్ళు
సమానం లేకున్నా?
ఒక్కటయితేనే
పిడికిట్లో బలం!

సద్గుణాలు
చూడటం నేర్చుకుంటే!
సమత్వమే
కనపడుతుంది

బాహ్యాకృతిని
చూస్తే అంతా భేదమే!
హృదయాకృతిని
చూస్తే అంతా ఏకమే!

చదువులు
డాక్టరేట్ దాకా!?
సమత పంచటంలో
ఫెయిలే అందరు!

గాలికి
కులపిచ్చి లేదేమో!
అందరిని
సమానంగా చూస్తది.

అద్దుతొలగమన్నారు
శంకరుని శిష్యులు
తొలగాల్సింది
శరీరమా? ఆత్మనా?

రంగురంగుల పూలకి
బలమే దారం
మానవుల మధ్య
మమతే ఆధారం

భేద భావాలకి
సరైన మందు
పైన కాదు
లోపలి"గుండె"కి పూయాలి

రాజ్యాంగంలో
అంటరానితనం నిషేధం
కొందరిళ్ళల్లో
"మనుషుల" నిషేధం

బతికుండగా
బహు తేడాలున్నా
చావులో
అందరు సమానమే!

గుండెల్లో నిల్చె పనులు
ఎవరు చేస్తున్నా
కులం వెతుకుతుంద్రు
గూగుల్ లో....

**సామల కిరణ్**
9951172002

–వాచస్పతి

# పదనిష్పాదనకళ 4

*The joy of coining new words!*

(గత సంచిక తరువాయి...)

**తెలుగులో అనేక భాషాపదాలున్నప్పుడు ఇంగ్లీషు పదాలు ఎందుకు ఉండకూడదు ?**

అరువు దెచ్చుకున్న పదాలతో తదుపరి పదనిష్పాదన సాధ్యం కాదు. వాటి మూలధాతువులూ, నిర్మాణసరళీ తెలియకపోవడం వల్ల అలాంటి పదాలనుంచి స్వతంత్రంగా పదకుటుంబాల్ని నిష్పాదించే స్వేచ్ఛని జనసామాన్యం కోల్పోతుంది. అందువల్ల ఈ వాదాన్ని ఇంతకుముందే పరాస్తం చేయడం జఱిగింది. ప్రత్యామ్నాయం లేనప్పుడు పరభాషాపదాలు వాడొద్దని ఎవఱూ అనరు. పునరుద్ధరించి వాడుకోవడానికి, కొత్తగా సృజించడానికీ తెలుగులో విస్తారమైన అవకాశ మున్నప్పుడు కూడా, ఆ ప్రయత్నం ఇసుమంతైనా చేయకుండా, బస్తాలకొద్దీ విదేశీ పదాల్ని కృత్రిమంగా దిగవెయ్యడాన్నే ప్రశ్నిస్తున్నాం. కొత్త తెలుగుపదాల్ని కల్పించినప్పుడు "ఆ రూపకర్తలు సొంత పాండిత్యాన్ని ప్రదర్శిస్తున్నా"రని ఆరోపించే ఆంగ్లాభిమానులు తెలుగంతా ఇంగ్లీషుపదాలతో నింపడం ద్వారా తమ ఆంగ్ల పాండిత్యాన్ని ప్రదర్శిస్తున్నారు కాదా? భాషా ప్రయోజనమూ, వాడుకా –వీటన్నింటి కంటే ముఖ్యమైనది భాషాభిమానం. అదంటూ అసలుంటే, వాడుక మొదలైనవన్నీ చిన్న విషయాల్లా కనిపిస్తాయి. ఆ అభిమానమే లోపించాక ప్రతి చిన్నవిషయమూ ఓ పెద్ద సమస్యై కూర్చుంటుంది. చర్చల స్థానంలో అహంకార ప్రదర్శనలు బయల్దేఱతాయి.

**"ఇది వాడాలి, అది వాడకూడదు" అని కాదు భాషాభిమానులు చెబుతున్నది. ఈ భాషాజాతిలో జన్మించినందుకు ఈ భాష మీద అభిమానాన్ని పెంచుకోమని చెబుతున్నారంతే. అది మనిషి యొక్క కనీస ధర్మం . కర్తవ్యం కూడా ! భాష అనేదొక వ్యక్తి కాదు, దానంతట అది వృద్ధి చెందడానికి. దాన్ని ఎవఱు మాట్లాడతారో వారే దాన్ని వృద్ధిచేయాలి. ఆ బాధ్యత వారిదే. అన్ని ఇతర భాషల విషయంలోనూ ఇప్పటిదాకా ఇలాగే జఱిగింది. మన ప్రయత్నం లేకుండా మన భాష వృద్ధిచెందదు, వ్యాపించదు. అది వృద్ధి చెందకపోతే ఆ పాపం మనదే. భాషది కాదు.**

తెలుగులో ఉన్న పదవైవిధ్యం దాన్ని ఇతర భాషాపదాలతో నింపెయ్యొచ్చు నన్నదానికి సమర్థకం గానీ, అనుమతిపత్రం (license) గానీ కాదు. ఒక భాషలో ఉన్న వైవిధ్యం ఆ భాషాప్రజల వైవిధ్యభరిత ఆలోచనావైఖరి (variety thinking) కి నిదర్శనం. **భాష ఎంత ఎక్కువ భౌగోళిక విస్తీర్ణంలో మాట్లాడబడితే– అంత వైవిధ్యభరితంగా ఉంటుంది దానిలోని పదజాలం ! తద్విరుద్ధంగా ప్రతిపదాన్నీ అరువు దెచ్చుకోవడం సృజనాత్మక శక్తిలోపానికి తార్కాణం.** అది కనీసం మూడు విషయాల్ని సూచిస్తుంది.

1. ఆ వ్యక్తుల్లో సృజనాత్మకత లేదని, స్వకీయంగా (original) ఆలోచించడం సంగతినలా ఉంచి వారు కనీసం అనువాదాలు కూడా చెయ్యజాలరని !

2. వారికి తమ భాషపైనే పట్టులేదని! తమ మాతృభాషాపదాల నిర్మాణాల్ని వారు అర్థం చేసుకోలేకపోతున్నారని, వాటి ననుసరించి సరికొత్త పదనిర్మాణాలు చెయ్యడానికి అవసరమైన భాషా–శాబ్దిక–వైయాకరణ–శిక్షణ వారిలో దయనీయంగా లోపించిందని !

3. అలాంటివారి చేతుల్లో ఉండడం వల్ల ఆ భాష ఎదగాల్సినంతగా ఎదగడం లేదని !

మనం కల్పించిన పదాల్ని తక్షణమే వాడడం మొదలుపెట్టాలి. మనం ఇప్పుడు వాడినా, అవి విస్తృతంగా వ్యవహారంలోకి రావడానికి చాలా కాలం పట్టుతుంది. మొదలే వాడకపోతే, ఇంకా ప్రమాదం. ఔత్సాహిక పదకల్పకులు/ వ్యవహర్తలూ తమ రచనల్లో కొత్త పదాల్ని పతాక శీర్షికలుగా పెట్టి వ్రాస్తే బావుంటుంది. పదాల్ని ప్రచురపఱిచేందుకు చిన్న కిటుకు ఏమిటంటే– ఒక్కొక్క వాక్యంలో ఒకటి, రెండు కన్నా ఎక్కువ కొత్త పదాలు ఉండకూడదు. అలా ఉంటే పాఠకుడిలో "ఈ రచయిత దారే వేఱు" అనే భావన ఏర్పడి, మొదటికే మోసమొస్తుంది. కొత్త పదాలు వాటి ఉద్దిష్ట అర్థంలో వెంటనే అర్థం కావడం కష్టం కనుక, ప్రతి కొత్త పదానికీ కుండలీకరణాల (brackets) లో దాని ఆంగ్లసమార్థకాన్ని ఇవ్వడం ప్రయోజనకరం. ఇలాంటి జమిలి ప్రయోగాలు చాలాకాలం పాటు తప్పవు. మన రచనలన్నీ ఇలా కుండలీకరణాలతో నిండిపోయినా విచారించకూడదు.

**కొత్త పదాల నిష్పాదనకు తెలుగులో ఉన్న వనరులేంటి?**

చాలా భావాల వ్యక్తీకరణకి ఇంగ్లీషులో చేస్తున్న వాడుకలు ఇంగ్లీషు కానేకావు. అవి లాటిన్, గ్రీకు పదప్రత్యయ నిర్మాణాలు. అది వారికి చేతైనప్పుడు మన తెలుగు సంస్కృత పదప్రత్యయ నిర్మాణాలతో స్వకీయత (originality) కలిగిన దేశీయ ప్రత్యామ్నాయాల్ని రూపొందించడం మనకెందుకు చేతకాదని మనల్ని మనం ప్రశ్నించుకోవాల్సి ఉంది. **మన భాష అంత పదదారిద్ర్యంతో అలమటిస్తున్నది కాదు. తన పదాల్ని నేర్పేవారూ నేర్చుకునేవారూ దూరం చేయబడి అల్లాడుతున్నది మాత్రమే.** మన భాషకి ఇంగ్లీషు కంటే ప్రాచీన చరిత్ర ఉంది. ఇంగ్లీషుకంటే ప్రాచీనమైన సాహిత్యమూ ఉంది. **పదాలు ఒక జాతి యొక్క మేధశ్చరిత్రని సూచిస్తాయి. పరాయిపదాల్ని భారీగా వాడడమంటే ఒక జాతిగా మనకి బుద్ధి లేదని, స్వకీయత (originality) శూన్యమనీ ఒప్పుకోవడమే అవుతుంది.** తాత్కాలికంగా పని జఱిగడం కంటే ఒక భాషాజాతిగా మన అస్తిత్వమూ, మన సంప్రదాయమూ, మన ప్రతిష్ఠ శాశ్వత ప్రాతిపదికన నిలబడ్డం ముఖ్యం. ఆ దృష్టి లేనివారూ, రోజువారీ మనుగడ గుఱించీ, **"జఱిగడాల"** గుఱించీ మాత్రమే ఆలోచించే స్థాయిలో ఉన్నవారూ మేధావులు (intellectuals) కాజాలరు. అలాంటివారి చేతుల్లో జాతి భవిష్యత్తు అంధకార బంధురం.

**నిఘంటువులు/వ్యాకరణాలూ పనికొస్తాయి, అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ !**

1. మనం మర్చిపోయిన పదాల్ని మనకి గుర్తుచేస్తాయి.

2. మనకి పనికొచ్చే/మనం అనుసరించదగ్గ పదనిర్మాణ నమూనాల (word construction models)ని సరఫరా చేస్తాయి.

3. మనం అర్థాన్ని అన్యథాప్రకల్పన చేసి వాడుకోదగ్గ పర్యాయపదాల్నీ, ప్రత్యామ్నాయాల్నీ అందిస్తాయి.

4. మనం కార్యవ్యగ్రులం కావడానికి కావాల్సిన ముడిసరుకుల్ని సమకూఊస్తాయి.

5. మనం అనవసరశ్రమ తీసుకుంటున్నామా? ఇప్పటికే ఉన్న పదాల్ని మళ్ళీ కష్టపడి కనుక్కుంటున్నామా? కాదా ? తనిఖీ చేసుకోవడానికి ఆచూకీలు (references) గా ఉపకరిస్తాయి.

**మన జాతి సుదీర్ఘకాలం పాటు నిరక్షరాస్యతలో గడపడం చేత పెక్కు పదాలు వ్యవహారదూరమైపోయాయి. మన వారు అక్షరాస్యులయ్యేలోగా నాగరికతా, సంఘజీవనమూ కూడా మారిపోయి, 'వియ్యంకుడు, షడ్డకుడు, ఏరాలు' లాంటి వరసలూ, 'దబ్బనం, గుండ్రాయి, ఊతిచిప్ప, గిలక, కొబ్బరికోజం, మరచెంబు' మొదలైన సామాన్య గృహోపకరణాల పేర్లు కూడా అర్థం కాని పరిస్థితి దాపురించింది.** Dashboard కి 'యుగంధరం' లాంటివి సూచిస్తే "సద్యఃస్ఫోరకాలు (వెంటనే అర్థమయ్యే తరహావి) కావా"లని మొండిపట్టు పట్టుతారు. అన్ని బౌద్ధిక ఉరువుల (intellectual items) కీ వాడుకభాషలో వ్యక్తీకరణలు ఉండవంటే వినరు.

**కనుక కొత్త పదాల్ని కనుగొనడం ఒక్కటే కాదు. పాతపదాల్ని పునరుద్ధరించడం కూడా భాషావే.**

## రెండో అధ్యాయం

### పదజాలాల ఆవిర్భావ గతం

తెలుగు పదజాలం (Telugu vocabulary) ఎలా పుట్టింది ?

తెలుగులోని పదజాలాన్ని పదిరకాలుగా వింగడించవచ్చు.

**1. అచ్చతెలుగు మూలధాతుజన్యం** :- తెలుగుపదాలకు తమవంటూ కొన్ని మూలధాతువులున్నాయి. Dravidian Etymological Dictionary (DED) లో కనపడనంత మాత్రాన, అవి లేవనుకోకూడదు. వాటినుంచి వందలాది తెలుగుపదాలు జన్మించాయి. అవి ఇప్పటికీ వాడుకలో ఉన్నాయి. ఉదాహరణకు చెర్ (తడి, నీరు) అనే మూలధాతువు నుంచి చెఱువు, చెలక, చేను, చేపు, చేద, చెఱుకు, చెక్క, చెమ్మ, చెలమ, చెఱమ, చెత్త, చెట్టు, చెంబు మొదలుగా గల విస్తారమైన పదకుటుంబం ఆవిర్భవించింది. ఇవన్నీ నీటిలో/ నీటితో పెఱిగేవి. లేదా నీరు కలిగినవి. లేదా నీరు అవసరమైనవి. లేదా నీటి కోసం ఉన్నటువంటివి. ఇలాంటి ముప్ఫై-నలభై మూలధాతువుల నుంచి సుమారు ఒక వెయ్యి పదాల దాకా ఆవిర్భవించాయి.

**2. అచ్చతెలుగు దేశ్యం** :- సంస్కృతప్రాకృతాల నుంచి గానీ, తోటి ద్రావిడభాషల నుంచి గానీ, ఉర్దూ-ఇంగ్లీషుభాషల నుంచి గానీ, పరిసర రాష్ట్రాల నుంచి గానీ అరువు దెచ్చుకోకుండా తెలుగుగడ్డపై తెలుగుప్రజల స్వోపజ్ఞామూలకంగా, స్వయంభువుగా వెలసిన పదజాలవే అచ్చతెలుగు దేశ్యం. అయితే వీటికి మూలధాతువులతో నిరుక్తి (etymology) చెప్పడం సాధ్యం కాదు.

ఉదా:- *అంచన, అందం, అకరువు, అక్కసు, అచ్చు, అటుకులు, అట్టువ, అతివ, అత్తము, అదనము, అలుసు, ఆకు, గిన్నె, పళ్లెం, గరిటె, మిల్లి మొ॥*

**3. ద్రావిడ మూలధాతుజన్యం** :- దక్షిణ భారత భాషలన్నింటికీ ఉమ్మడిగా ఉన్న మూలధాతువుల నుంచి (తెలుగు ఒక ప్రత్యేకభాషగా ఉనికిలో లేని కాలంలోనే) వచ్చిన పదజాలమిది.

ఉదా :- *కాలు, చేయి, కన్ను, గోరు, మ్రాను, కాయ, నీరు, వాన, విన్ను (మిన్ను), ఉప్పు, కడలి, కాదిలి., వచ్చు, పోవు, తిను మొ॥*

**4. అర్వాచీన ద్రావిడ ఆదానం** :- తెలుగు తక్కిన ద్రావిడభాషల నుంచి విడిపోయి ఒక ప్రత్యేకభాషగా రూపొందిన అనేక శతాబ్దాలకి, వాటిల్లోంచి తెలుగులోకి రాజకీయ, మత, సాంస్కృతిక కారణాల వల్ల మళ్లీ ప్రవహించిన పదజాలం. ఇది ఎక్కువగా తమిళ-కన్నడ జన్యం .

**ఉదా:-** *తిరుమణి, అడియేను, మాళిగ, వరుమానం, హొన్ను, హెగ్గడి, హెచ్చు, తొణికిసలాడు మొ॥*

**5. ప్రాకృతసమం మఱియు ప్రాకృతభవం** :- సంస్కృతంలోంచి నేరుగా కాకుండా, ముందు ప్రాకృతంగా వికృతి చెంది, ఆ ప్రాకృతం నుంచి తెలుగులోకి వచ్చిన పదాలు. ఇవి ఎక్కువగా ఆంధ్ర శాతవాహన చక్రవర్తుల కాలంలో వచ్చాయి. కారణం - అది ఆ రాజుల మాతృభాష కావడం. పైగా అదే అప్పుడు దక్షిణాపథానికి రాజభాషగా ఉండడం.

**ఉదా** :- *అగ్గిపెట్టె, సింగారం, సిరి, కంబం, కారం, అయ్య, అమ్మ, తనం, పనస, కకపాల మొ॥*

**6. సంస్కృతసమం** :- దీనికే తత్సమమని నామాంతరం. సంస్కృతంలోని పదాలకి డు,ము,వు,ల వంటి పదాంత మార్పులు చేసి గానీ, చేయకుండా గానీ చాలావఱకు సంస్కృత వర్ణక్రమాన్నీ, గుణింతాలనే అనుసరిస్తూ తెలుగులోకి తెచ్చిన పదజాలం. దీనికి మన భాష యావత్తూ నిలువెత్తు ఉదాహరణే. నిజానికి తెలుగువారి దృష్టిలో తెలుగూ, సంస్కృతమూ రెండు వేఱువేఱు భాషలు కావు. మన కావ్యసంప్రదాయాన్ని అనుసరించి, తెలుగుని యథేచ్ఛగా సంస్కృతపదాలతోనూ, సమాసాలతోనూ నింపి వేయవచ్చు.

**7. సంస్కృతభవం** :- దీనికే తద్భవమని నామాంతరం. ముందు సంస్కృతంలోంచి పండితాంధ్రం (Scholarly Telugu)లోకి వచ్చినాక, మళ్ళీ ఆ పండితాంధ్రంలోంచి సామాన్యప్రజల వాడుకలోకి ప్రవహించి, వారి నోళ్ళల్లో కొంత కాలం పాటు నలిగి, కాలక్రమేణా రూపాంతరం చెంది వినపడుతున్న పదజాలమిది.

**ఉదా:-** *అచ్చం, దెయ్యం, రాకాసి, మచ్చరం, వెధవ, తావు, పగ్గాలు, రచ్చ, నిస్సంతు, చక్కెఱ, అక్కరాలు మొ॥*

8. **ఇస్లామిక ఆదానం** : ఇది వాస్తవానికి ఏకభాషాజన్యం కాదు. అనేక భాషల పదాలు ఆనాటి అధికారభాష అయిన ఉర్దూ ద్వారా తెలుగులోకి ప్రవేశించాయి. ఆ భాషల్లో అరబ్బీ, తుర్కీ, ఫారసీ, హిందూస్థానీ ఉన్నాయి. ఏ ఉర్దూపదానికి ఏ భాష మూలమో మనకి తెలియదు గనుకా, ఈ తెలుగు పదజాలమంతా మహ్మదీయుల ద్వారా మనకి సంక్రమించింది గనుకా, వాటన్నింటినీ కలిపి ఇస్లామిక ఆదానాలనే ఒక స్థూల వింగడింపుతో సరిపెడుతున్నాం.

ఉదా :- *ఆఖరు, ఆఖరి, ఆజమాయిషీ, ఆబ్కారీ, ఆరిందా, ఆవర్జా, ఆసరా, ఆసామి, ఈనాం, ఇలాఖా, ఉడాయించు, ఉల్టా, కచ్చేరి, కబురు, కబుర్లు, కబేళా, కమాను, కమామిషు, కలేజా,*

*కలం, ఖరారు, కవాతు, కసరత్తు, కసాయి, ఖాతా, ఖామందు, ఖాయిలా, ఖాళీ, కితాబు, కుమ్మక్కు, కుర్చీ, కిరాయి, కుస్తీ, ఖుషీ, ఖూనీ, ఖైదీ, కైఫీయతు, కొజ్జా, కొత్వాలు, కౌలు మొదలగునవి*

**9. ఆంగ్ల ఆదానం :-** ఇంగ్లీషు మన దేశంలో గత 200 సంవత్సరాలుగా పరిపాలనాభాషగా, వ్యాపారభాషగా, విద్యాభాషగా ఉండడం వల్ల- ఆ భాషాపరిచితీ, పాండిత్యమూ గలవారి ద్వారా సామాన్యప్రజల్లోకి సైతం వందలాది ఇంగ్లీషు పదాలు చొచ్చుకుపోయాయి. ముఖ్యంగా ఇవి ఆధునిక యంత్రసాధనాల వాడకం మూలానా, వృత్తిపరమైన అవసరాల్ని పురస్కరించుకునీ, అంతకంటే ముఖ్యంగా ఇంగ్లీషు పదాల ప్రయోగం- ఒక ఉన్నత సామాజిక హోదాని ప్రసాదిస్తుందనే అభిప్రాయం వల్లా వాడుకలోకి వచ్చాయి.

**10. ఆంగ్లద్వార ఆదానం :** ఇంగ్లీషులో ఉన్నవన్నీ అచ్చ ఇంగ్లీషు పదాలు కావు. తెలుగులో మాదిరే ఇంగ్లీషులో కూడా అనేక భాషల పదాలు ప్రవేశించాయి. అయితే వాటిని ఇంగ్లీషువారు వాడుతున్నారనే కారణం చేత మనం కూడా వాడుతున్నాం. వారి యందలి ప్రమాణబుద్ధిని బట్టి వారు వాటిని ఏ అర్థంలో వాడుతున్నారో మనమూ అదే అర్థంలో వాడుతున్నాం, వాటి యథార్థమైన మూలభాషా- అర్థాలు ఏమైనప్పటికీ ! అలాగే వారు వాటిని ఎలా వ్రాసి పలుకుతున్నారో మనమూ అలాగే వ్రాసి పలుకుతున్నాం. ఆంగ్లం ద్వారా మనకి సంక్రమించిన ఈ బహుభాషాపదాల ఆదానాన్ని ఆంగ్ల ద్వార ఆదానాలు అని చెప్పుకోవచ్చు.

**ఉదా:-** *సుమో మోటు, సునామి, పీజా, హాంబర్గర్, కిండర్ గార్టెన్, కంగారూ, కాఫీ, ఆల్కహోల్, క్యారట్, జిరాఫీ, హెన్నా, సిరప్, బ్రాందీ, బండిల్, కోకో మొదలగునవి.*

**ఆంగ్ల పదజాలం ఎలా పుట్టింది ?**

తెలుగులో కొత్త పదాల కల్పన చేసేటప్పుడు ఇంగ్లీషు పదాల్ని మక్కికి మక్కి దించుకోవడమో, అనువదించడమో కాక, ఇంగ్లీషులో పదాలు ఏర్పడిన విధానాన్ని ముందు సమగ్రంగా అధ్యయించి ఆ పద్ధతుల వెలుగులో తెలుక్కి వర్తించే సూత్రాల్ని ఏర్పఱచుకోవాలి. ఇంగ్లీషు పదాలు స్థూలంగా రెండు చారిత్రిక రకాలుగా ఏర్పడ్డాయి.

**1. అచ్చ ఇంగ్లీషు పదాలు 2. ఆదానాలు.**

వీటిల్లో అచ్చ ఇంగ్లీషు పదాలు నాలుగు రకాలుగా ఏర్పడ్డాయి.

**(అ) జెర్మానిక్ పదాలు :-** తోటి జెర్మానిక్ భాషలైన డచ్, జర్మన్ ఇత్యాది భాషలతో పోలికలు గల ఇంగ్లీషు పదాలివి.

**ఉదా :-** friend, thanks, good, God, church, round, free మొదలైనవి.

**(ఇ) ఆంగ్లో-శాక్సన్ పదాలు :-** మొదట్లో Angles అని పిలవబడ్డ ఆదిమ ఇంగ్లీషు వలసదార్లు ఇంగ్లండులోని స్థానిక శాగ్సన్ జాతివారితో సమ్మేళనమై మాట్లాడ నారంభించిన భాష. ఇంగ్లండులో 11 వ శతాబ్దం దాకా ఈ భాషని మాట్లాడారు. ఉదా :

| | | | |
|---|---|---|---|
| an - one | twa - two | preo - three, | feower - four |
| siex or syx - six, | seofan - seven | eahta -- eight | nigon- nine |
| twentig - twenty, | hundred-hundred | hwæt - what, | hwaer - where |
| hlaf - bread (loaf) | cese - cheese | scyld - shield | reod - red |
| grene - green | geolu - yellow | man -- human | wifman -- woman |
| modor - mother | fæder - father | dohtor -- daughter | sunu - son |
| hors - horse | cu - cow | bridd - bird | daeg - day, |
| nihte - night | middae - midday | | |

**(ఉ) కెల్టిక్/ గేలిక్ పదాలు :** ఇంగ్లీషుకు పరిసర భాషలైన గాలిష్, ఈరిష్, స్కాటిష్, వెల్ష్ భాషల ప్రభావంతో ఇంగ్లీషులోకి వచ్చి చేఱిన పదాలు. కార్నిష్, కంబ్రిక్ , బ్రిటన్ భాషల నుంచి కూడా ఇదే విధంగా పదాలు ఇంగ్లీషులోకి దిగుమతయ్యాయి.

**ఉదా :-**

ఈరిష్ నుంచి – drum, galore, hooligan మొ॥

స్కాటిష్ నుంచి – clan, pet, pillion, slogan మొ॥

వెల్ష్ నుంచి – crag, flannel మొ॥

**(ఎ) నోర్డిక్** (Old Norse) **పదాలు** :- వైకింగులు ఇంగ్లండుని పరిపాలించిన కాలంలో వచ్చి చేఱిన పదాలు.

ఉదా :- aloft, anger, awe, awkward, axle, bag, bait, ball, band, bark, bask, berserk, birth, bleak, blunder, bulk, bylaw, cake, call, clip, club, call, crook, die, dirt మొ॥

ఇంగ్లీషులో రెండో అతి పెద్ద శబ్దవర్గమైన ఆదాన పదాల్ని కూడా 4 రకాలుగా వింగడించవచ్చు.

**(అ) ప్రామాణిక ఆదానాలు** (Learned Borrowings): సంస్కృత ప్రాకృత భాషల పదాల్ని తెలుగు గ్రహించినట్లే మత- మతేతర కారణాలవల్ల ముఖ్యంగా పునరుజ్జీవన (Renaissance) కాలంలో లాటిన్, గ్రీకుపదాలు ఇంగ్లీషుని ముంచెత్తాయి. ఈ సంప్రదాయం ఇప్పటికీ కొనసాగుతోంది.

**(ఇ) చారిత్రిక ఆదానాలు** : తెలుగు ఉర్దూ రాజుల ప్రభావానికి లోనైనట్లే, ఇంగ్లండుని నార్మన్ రాజులు పరిపాలించిన కాలంలో ఇంగ్లీషు ఫ్రెంచి ప్రభావానికి గురైంది. ఫ్రెంచి వారిని అనుకరిస్తూ ఇంగ్లీషువారు కూడా పదాల చివఱ ఒక అన వసరమైన ఆ చేర్చి వ్రాయసాగారు.

**ఉదా :-** wyf కాస్తా wife అయింది.

**(ఉ) సామ్రాజ్య ఆదానాలు :** ఇంగ్లీషువారు ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో తమ రాజకీయాధికారాన్ని స్థాపించినప్పుడు స్థానిక భాషలు నేర్చుకోవడం, వాటిలోంచి అవసరమైన పదాల్ని గ్రహించడం

**తరువాయి 49 వ పుటలో.......**

ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి
98481 23655

# పడమటి గాలితో నివురు తొలగిన తెలుగు భాషాసాహిత్య సంపద 7

**తె**లుగు వారికి, తెలుగు భాషకు సేవ చేసిన తెల్లవాళ్ళని గూర్చి యింతవరకూ విపులమైన వ్యాసాలు రాలేదు. మనకు తెలిసిన బ్రౌన్, కాల్డ్వెల్, కేరీ, ఆర్డెన్, మోరిస్, ఎల్లిస్, కాంబెల్ లాంటి వాళ్లు తప్ప ఎందరో మరుగున పడిన మహానుభావులున్నారు. ఆయా చరిత్రలు కూడా మనకు లభ్యం కావడంలేదు. అలా మరుగున పడిన వారిలో తెలుగువారి అలవాట్లు, పండుగలను, భాష, నిఘంటువులు, వ్యాకరణాలు, వాచకాలు, ముద్రణ మొదలయినవాటికి తోడు భాషా నైపుణ్యం కల దుబాసీలు మొదలయినవారి చరిత్రను వెలికితీసిన మహానుభావులు ఎందరో ఉన్నారు. వీరిలో లభించినంతవరకు వరుసగా వివరించడమే ఈ వ్యాస ముఖ్య ఉద్దేశం.

**జేమ్స్ గ్రాంట్** : కన్యాకుమారి నుంచి ఒరిస్సా వరకూ తెలుగు రాజ్యాలుండేవనీ, వీళ్ళు జమిందారులుగా, సుభాలుగా, పరగణాలుగా, రకరకాలుగా విభక్తమయి నిజాము నవాబుకు ఇతర సర్కారుకూ కప్పం కట్టేవారని చారిత్రక కథన విశ్లేషణలు తెలియ జేస్తాయి. మరో విచిత్రమైన ఆసక్తికరమైన విషయం కూడా ఒకటుంది. జమిందారుల్లో పలుకుబడిలో ఉన్న వారి విశ్వసనీయత చాలా స్వల్పంగా ఉండేది. పైగా ఫోర్జరీలు, దొంగ సర్టిఫికెట్లు కేవలం ఇరవై రూపాయలకే మోహార్ ముద్ర లభించేది. అంటే దొడ్డిదారి ప్రవేశం మనవాళ్ళకి తొలినుంచే ఉంది. ఈరకం దళారుల దొంగ సర్టిఫికెట్ ముద్రలను సంస్కరించాలని జేమ్స్ గ్రాంట్ సూచించాడు. కట్టడి చేశాడు.

జేమ్స్ గ్రాంట్ బ్రిటీష్ రాయబారిగా ఉండేవాడు. ఇతను 1784-1789 ప్రాంతాల్లో బెంగాల్‌లో ఉండేవాడు. బహుభాషావేత్త అయిన గ్రాంట్ పర్షియ భాషలో ఉన్న మొఘలుల రెవెన్యూ పద్ధతులు క్షుణ్ణంగా చదివాడు. ఆనాటికి ఫోర్ట్ విలియం అధారిటి పన్నుల విధానం, ఆదాయ వనరుల విధానంపై వివిధ రకాల కసరత్తు ప్రారంభించింది. ఈ నేపథ్యంలో అప్పటికి రాయబారిగా ఉన్న జేమ్స్ గ్రాంట్ ఎన్నో విధాలుగా వివరాలు, విషయ సేకరణ, ఉత్తర సర్కారుల ఒప్పందాలు ఆయా జమిందార్ల చరిత్రలతో ఒక రహస్య లేఖను మారన్ హేస్టింగ్స్ కి పంపించాడు. ఇదికొంత అనుమానాస్పదంగాను, ఆంతరంగిక రాజ్యాల, రాజుల, జమిందార్లపై నిందారోపణలు ఉన్నందునవల్ల రెండేళ్లు ఆలస్యంగా 20-12-1784లో లండన్ అధికారులకు పంపించారు. ఆనివేదికలో ఉత్తర సర్కారుల జనాభా ఆనాటికి 24 లక్షలనీ, 70 మంది జమిందారులు ఏలుబడిలో ఆనాటికి చిన్నచిన్న రాజ్యాలు నడుస్తుండేవనీ వివరించాడు. రాజ్యాంగ సవరణలు చేయవలసిన విధానం చాల స్పష్టంగా తెలియజేశాడు. అప్పటికే ఈ ప్రాంతంలో జెంటు భాష ఉందనీ, ఈ ప్రాంతంలో దేశీయ విద్యావిధానం బాగా వెనుకబడిందనీ, దేశీయ కళలు, ప్రదర్శనలు, ప్రాంతీయ చారిత్రక వాజ్మయ సంపదను వెలికితీసి పునరుద్ధరించవలసిన అవసరం ఉందని చెప్పాడు. దీనికి తోడు సింహాచలంలో ఒక హిందూ విద్యాలయాన్ని, చికాకోలులో ముస్లిం మదరసాను స్థాపించాలని సిఫారసు చేస్తూ దీనికి సాలీనా ఒక లక్ష రూపాయలు కేటాయించాలని 5th Report 13వ అనుబంధంలోని 97వ పుటలో తెలియజేశాడు. దీనివల్ల ఆయా ప్రాంతాల అభివృద్ధితో పాటు ఎంతో మందికి వృత్తినైపుణ్యం, ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా లభిస్తాయని వివరించాడు. ఐతే ఇక్కడ ఉన్న సర్కారు గ్రాంట్ లేఖలను, ఆయన సూచనలను పెడచెవిని పెట్టినందువల్ల ఏవిధమైన అభివృద్ధికి నోచుకోలేదు. గ్రాంట్ మాట గడప దాటకుండా చేసిన ఆనాటి పాలకుల అలసత్వాన్ని నిందించి ఇప్పుడేమి ప్రయోజనం.

**చార్లెస్ వైట్:** తెల్లవాళ్ళు పరిపాలించే రోజుల్లో ప్రాంతీయ భాషలు అభివృద్ధి అంతంత మాత్రంగానే ఉంది. గ్రాంట్ దేశీయ విద్యలు ఉద్దరించాలని ఆశించాడు ప్రయోజనం అప్పటికి లేకపోయినా అనంతరం వచ్చిన చార్లెస్ వైట్ బుర్రకి బాగా నాటుకుంది. అంతే తెలుగు నిఘంటు రచనకు అంకురార్పణ చేశాడు. తెలుగు నిఘంటువు రాసిన వాళ్ళకి బహుమతి యిస్తానని ప్రకటించాడు. 1793లొ సెంట్ జార్జి కోటలో రెవెన్యూ బోర్డ్ సభ్యుడిగా వుండి ప్రాంతీయ భాషల ఉద్దరణకు శ్రమించాడు. దీనికి తోడు ప్రాంతీయ భాషలు రానివాళ్ళకు రెవెన్యూ శాఖలో ఉద్యోగాలు ఇవ్వకూడదనే హుకుం జారీ చేశాడు. దాంతో తెలుగు వ్యాకరణ రచన, నిఘంటువు నిర్మాణానికి అంకురార్పణ జరిగింది. దీనివల్ల కేవలం దుబాసీల అనువాద విధానమే కాకుండా రచనా సంవిధానానికి కూడా వీళ్ళను ఉపయోగించినట్టు 5వ రిపోర్టు 14వ అనుబంధం 140వ పుటలో స్పష్టంగా ఉంది. ఈ కారణాల వల్ల అప్పటికీ అంటే 1806లో మచిలీ పట్టణవాసి మామిడివెంకయ్య రాసిన ఆంధ్రదీపిక కొనవలసిందిగా వైట్ సిఫారసు చేశాడు. నిజానికి తెలుగులో వచ్చిన తొలి తెలుగు - తెలుగు నిఘంటువు మామిడివెంకయ్యదే అని ధ్రువీకరించాలి.

**సర్ తామస్ మన్రో 1761 -1827):** రాయలసీమను రతనాల సీమగా మాత్రమే కాకుండా, విద్యాసుగంధ సీమగా మార్చాలనీ, వ్యసాయంచేసే రైతన్నకు వెన్నుదన్నుగా నిలబడాలని కృషిచేసిన వాడు సర్ తామస్ మన్రో. స్కాట్ లాండ్ దేశంలోని గ్లాస్ గో నగరంలో 27-5-1761న అలెగ్జాండర్, మార్గరెట్ స్కార్క్ దంపతులకు జన్మించాడు. తండ్రి గ్లాసో నగరంలో ప్రముఖ వ్యాపారి తాత పొగాకు వ్యాపారంలో బాగా సంపాదించాడు. గ్లాస్ గో నగరంలోని విశ్వ విద్యాలయంలో చదువుకుని 1789లో మద్రాసు పదాతిదళం కాడెట్ గా చేరాడు. అనంతరం అంచెలంచెలుగా కలెక్టర్, గవర్నర్ గా ఎదిగి ప్రజలకు దేశానికి సేవచేసి రాయలసీమ ప్రాంత ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచాడు. టిప్పుసుల్తాన్ - నిజాం ఆధిపత్య పోరులో (1782-1783) రాయలసీమ ప్రజలు బహుబాధలు అనుభవించారు. నిరంతరం దోపిడీ, దౌర్జన్యాలకు గురయ్యారు. పాలెగాళ్ళ ఆరాచకాలకు అతలాకుతలం అయ్యారు. అలాంటి పరిస్థితుల్లో బ్రిటీష్ అధికారం మొదలైంది. బళ్ళారినుండి పశ్చిమ

చిత్తూరు వరకూ మన్రో కలెక్టర్ గా నియమితుడయ్యాడు. ఆ పరిస్థితుల్లో పాలెగాళ్ళను అణచివేసి రైతులకు, ప్రజలకు అండగా నిలిచాడు మన్రో. 1804లో కడపకు వరదలు వచ్చినపుడు చెరువులు, కాలవలు మరమ్మత్తు చేయించాడు. పేదరిక నిర్మూలన, స్వయం సహాయక బృందాలను, ఏర్పాటు చేశాడు. పనికి ఆహార పథకం ప్రవేశ పెట్టాడు. మన్రో ప్రవేశ పెట్టిన Land reforms - Revinue systemలోని జమిందారీ, రైతువారీ, మహల్వారీ పద్ధతులపై వివిధరకాల ప్రశ్నలు యు.పి.ఎస్.సి. పరిక్షల్లో వస్తున్నాయంటే మన్రో రెవెన్యూ విధానంపై వేసిన బలమైన పునాది ఎంత ఉందో తెలుస్తుంది.

మన్రో తెలుగువారి మతస్థితిని, మత సంస్కృతిని గౌరవించాడు. తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి పెద్దవెండి గంగాళం బహూకరించాడు. నేటికీ ఈ గంగాళంలోనే నైవేద్యం పెడతారు. దీన్ని మన్రో గంగాళం అంటారు. తాడిపత్రి చింతల రాయలస్వామి ఆలయ ఆస్థాన మంటపం మరమ్మత్తులు చేయించాడు. బళ్ళారి కలెక్టరుగా 1800లో మంత్రాలయ రాఘవేంద్రస్వామిని దర్శించాడు. భక్తి శ్రద్ధలతో బూటు, టోపి తీసి దైవదర్శనం చేసుకున్నాడు. కడపజిల్లా గండి క్షేత్రంలోని వీరాంజానేయ స్వామి దేవాలయానికి ఈనాములిచ్చాడు. కలెక్టరుగా ఉన్న కాలంలో తనకింద నలుగురు డిప్యూటి కలెక్టర్లుండేవారు. వారితోపాటు తెలుగు వాళ్ళయిన దేశీయ నారాయణప్పను 800 రూపాయల వేతనంతో మద్రాసు రెవెన్యూ బోర్డు దివాన్ గా నియమించాడు. మైసూరు దివాన్ పూర్ణయ్య వద్ద శిక్షణ పొందిన బచ్చేరావుకు కడప తాలూకాలోని పుట్టంపల్లి, పులివెందుల తాలూకాలోని ఇడుపులపాయ గ్రామాలను జాగీరులుగా యిచ్చాడు.

స్వయంగా ప్రజల కష్ట సుఖాలను తెలుసుకునేవాడు. గ్రామ సభలను నిర్వహించి ప్రజల అవసరాల మేరకు పాఠశాలలను నెలకొల్పి విద్యా వికాసానికి అంకురార్పణ చేశాడు. ఆకాలంలో కలరా ప్రబలి గుంపులు గుంపులుగా మరణిస్తుంటే వైద్య బృందాలను తరలించాడు. ఆక్రమంలోనే 6-7-1827లో కలరా సోకి పత్తికొండ వద్ద మరణించాడు. గుత్తి పట్టణంలో యూరోపియన్ సిమెట్రీలో సమాధి చేశారు. అనంతరం మళ్ళీ మృతదేహాన్ని వెలికితీసి మద్రాసు సెంట్ మేరీస్ చర్చ్ ఆవరణలో సమాధి చేశారు.

మన్రో డైరీలు, లేఖలు, గజిట్ పత్రికల్లో అన్ని వివరాలు లభిస్తాయి. రాయలసీమ ప్రజాబంధుగా పేరొందిన సర్ తామస్ మన్రో గౌరవార్థం ఆప్రాంత ప్రజలు మన్రోలప్ప, మన్రోలన్న, మన్రో లింగం అని పేర్లు పెట్టుకోవడంలోనే ఆయనపై గల ప్రేమాభిమానాలు తెలుస్తాయి. మన్రో 66 ఏళ్ళ ప్రాయంలో మరణించకుండా ఉంటే రాయల సీమలో విద్యావికాసం వెల్లివెరిసేది. పేదరికాన్ని నిర్మూలించాలన్న ఆయన కోరిక పూర్తిగా నెరవేరేది.

**విలియం బ్రౌన్:** తెలుగు భాషకు సంస్కృతం తల్లి కాదని తొలిగా చెప్పినవాడు విలియం బ్రౌన్. పారశీక భాషలో విరివిగా అరేబియన్ పదాలున్నంత మాత్రాన పారశీక భాషకుమూలం అరబ్బీ అనకూడదన్నాడు. పైగా తెలుగు భాష పండితుల భాష కన్నా పామరుల భాషే సజీవమన్నాడు. విజయనగర ప్రాంత పల్లె ప్రజల మాటల్లో తెలుగు భాషా సంపద ఉందంటాడు.

1783లో మద్రాసుకు రైటరుగా వచ్చాడు. ఉత్తర సర్కార్, మచిలీపట్టణం, విజయనగరం, విశాఖపట్టణం, కశింకోట, గంజాం మొదలయిన ప్రాంతాల్లో పనిచేశాడు. హైదరాబాద్‌లో నాలుగేళ్ళు పేమాష్టర్-గా ఉన్నాడు. ఉత్తర సర్కార్ లో కలెక్టర్ గా, జడ్జిగా ఉద్యోగం చేశాడు. ప్రజల వాడుక భాషను బాగా నేర్చుకున్నాడు. తెలుగును జంటు భాషగా పిలిచాడు. 1786లో తనకు సహాయకుడుగా గుండుమళ్ళ పురుషోత్తం అనే మచిలీపట్నం ప్లీడరు సహాయం చేశాడని పలుమార్లు చెప్పాడు. అలాగే మామిడి వెంకయ్య గ్రంథాలు బాగా ఉపకరించాయని అన్నాడు.

దేశవాళీ భాషను బాగా గౌరవించాడు. తెలుగు వ్యాకరణం తయారుచేసి, 1817లో ప్రచురించాడు. ఆంధ్ర భాషను జంటూ భాష అనే అంటాడు. తెలుగులో 27 అక్షరాలు మాత్రమే ఉన్నాయనీ, ఇతని అభిప్రాయం. ఇ-ఈ-ఉ-ఊ ఋ-ౠ, ఎఏఐ - ఒఓ ఔ అనే అక్షరాలు వాడుకలో లేవని వాదిస్తాడు. వీటి బదులు యీ-యిఃవు-వూ-రు-రూ-లు-లూ యె-యే-అయి-ఏ-వో-అవ్ అనే అక్షరాలే ప్రజల వాడుక అని అంటాడు. తెలుగు భాష శ్రావ్యమైనదనీ, భావ ప్రకటనలో తెలుగు భాషలో ఉన్న సౌకర్యం విలక్షణమైనదనీ, తెలుగు చాలా గొప్ప భాష అనీ కితాబిచ్చాడు.

తన వ్యాకరణానికి పూర్వమే ఫ్రెంచ్ భాషలో ఒక వ్యాకరణాన్ని ఎవరో రాశారని, అది గుంటూరు మిషనరీల ద్వారా దానిని సంపాదించాననీ చెప్పాడు. బహుశా ఈ జెంటూ వ్యాకరణానికి కొంత ఫ్రెంచ్ వ్యాకరణం మూలం కావచ్చు. ఐతే 1816లో ఎ.డి.కాంబెల్ ఒక తెలుగు వ్యాకరణం ఇంగ్లీషులో ముద్రించాడు. అంతకు ముందే 1814లో విలియం కేరీ గ్రామర్ ఆఫ్ ది తెలింగా లాంగ్వేజ్ అని తెలుగు వ్యాకరణం ముద్రించాడు. ఇది సిరంపూరులో అచ్చయింది. దీని ప్రతి నేషనల్ లైబ్రరీ కలకత్తాలో ఉంది. ప్రత్యేక అనుమతితో మాత్రమే చూడటానికి అంగీకరిస్తారు. ఈయన రచనా విధానం మచ్చుకు ఆరుద్ర సమగ్రాంధ్ర సాహిత్యం కుంఫిణీయుగంలో ఉదాహరించాడు. " వోయి రాజా నేను ఒక కథ మనస్సు సంతోష పడేటట్టు చెప్పుతాను. నిమ్మళముగావిను. కాళింది అనే నదియొక్క దరిని బ్రహ్మస్థలమనే పేరుగల వొక అగ్రహారం ఉన్నది. అందులోను మహా పుణ్యాత్ముడైనటువంటిన్ని, వేదశాస్త్రములు తెలిసినటువంటిన్ని, శ్రేష్టుడైనటువంటిన్ని యజ్ఞస్వామి అనే పేరుగల శరీరము గల బ్రాహ్మణుడు వున్నాడు. ఆయనకు పారిజాత పుష్పములవలె మృదువైన శరీరముగల మందారవతి అనే పేరుగల కూతురు గలదు. ఆమె మహాయోగ్యమైన చక్కదనమూ, వంటి తీరూ, మంచి నడవడి గలదని వినకరిని పొంది ఉన్నది. గనుక భూమి లోవల తగిన బ్రాహ్మణోత్తములు ఆ కన్యను తమ కొడుకులకు అడగవలెనని కోరి తండ్రి వద్దకు వత్తురు.

ఈ ఉట్టంకిత బాగంలో వ్యావహారిక భాషా శైలి, చక్కని తెలుగు పదాలు, ఆలంకారిక రచనా విధానం, పూర్ణాను స్వార ప్రయోగం చక్కగా తెలుస్తుంది. ఈ వ్యాకరణ రచన 1809లోనే పూర్తి చేశానని ప్రకటించాడు. కాని ముద్రణ 1817లో జరిగింది. కారణాలు ఏమైె ఉన్నా ఈ వ్యాకరణం తెలుగు నేర్చుకునే పాశ్చాత్యులకు మాత్రంరాశానని చెప్పాడు. ఏమయినా ఈ వ్యాకరణాన్ని తరువాత వ్యాకరణ రచనలు చేసినవారు అంగీకరించలేదు.

బ్రౌన్ భారత దేశంలో చేసిన వివిధ పదవులు బేరీజు వేస్తే 1783లో మద్రాసువచ్చాడు. అనంతరం మచిలీ పట్టణంలో అసిస్టెంట్ గా 1787లో నియమితుడయ్యాడు. 1793లో నైజాము సైనిక

రూపుదిద్దుకుంది. దళానికి పే మాస్టర్ గా, 1796లో విజయనగరం జమిందారిలో అసిస్టెంట్ గా, జమిందారీ దక్షిణ భాగంలో కలెక్టర్ గా, 1800లో విశాఖపట్టణం కలెక్టర్ గా, 1806లో ఉత్తర విభాగంలో కోర్టు ఆఫ్ సర్క్యూట్ జడ్జిగా, 1818లో జెంటూ పదకోశం ముద్రణ, 1819లో రాజమండ్రి కమిషనర్ గా, 1820లో ఉత్తర విభాగంలో మూడవజడ్జిగా, 1821లో విశాఖపట్టణం, గంజాం కమర్షియల్ రెసిడెంట్ అండ్ కలెక్టర్ గా, 1824లో సెంట్రల్ డివిజన్ రెండవ జడ్జిగా, 1831లో కర్నాటక క్లెయిమ్స్ అడిషనల్ గవర్నమెంట్ కమిషనర్ గా, 1832లో ప్రభుత్వానికి ప్రభుత్వానికి తెలుగు అనువాదకుడిగా, 1837లో పర్షియన్ అనువాదకుడిగా వివిధ పదవులు నిర్వహించి 1837 జూన్ 27న మద్రాసు శాంతోమ్ లో మరణించాడు.

**ఫ్రాన్సిస్ వైట్ ఎల్లిస్ (1777-1819):** విలియం బ్రౌన్ తెలుగుభాషకు మూలం సంస్కృతం కాదని రేఖా మాత్రంగా అన్నాడు. ఆ మాటకు సార్థకతచేకూర్చి ద్రావిడ భాషల మూలాలను అన్వేషించి తెలుగు సంస్కృత భాషా జన్యము కాదని తొలిగా ఆధారాలతో నిరూపించినవాడు ఫ్రాన్సిస్ వైట్ ఎల్లిస్. ఎడికాంబెల్ వ్యాకరణానికి పీఠిక రాస్తూ అందులో "దక్షిణ దేశ భాషలు" గూర్చి వివరించాడు. తమిళ, తెలుగు, మలయాళం, కన్నడంతో తోబుట్టు భాషలు అనీ, సంస్కృత భాషతో జన్యజనక సంబంధం లేదని చెప్పాడు. సంస్కృత భాషా ప్రభావం ఎక్కువగా ఉన్నందువల్ల దక్షిణ భారతదేశ భాషలకు సంస్కృతం మూలమని భ్రమించారని అన్నాడు. ఈ వివరణలో తెలుగు సంస్కృత ధాతువులకు ఏ విధమైన పోలికలేదని చెప్పటానికి పట్టాభి రామశాస్త్రి తెలుగు ధాతుమాల నుంచి అ-క-ప-వ అనే అక్షరాలతో ప్రారంభించి వాటిని అక్షరానికి పది చొప్పున మొత్తం నలభై ధాతువులను తీసుకొని ఆ అక్షరాలతోనే ప్రారంభమయ్యే సంస్కృత ధాతువులతో పోల్చి రెండు వర్గాలకు పోలిక లేదని నిరూపించాడు. అలాగే నలభై ధాతువులను తమిళ, కన్నడ భాషలనుంచి తీసుకుని వాటికి తెలుగు ధాతువులతో పోలికలు చూపించాడు. తర్వాత అథర్వణుడు, అప్పకవి మొదలయినవారు దేశ్యాలని అంగీకరించినవాటిని, మామిడి వెంకయ్య కృతమైన ఆంధ్రదీపిక నుంచి కొన్ని ఉదాహరణలు చూపి వాటిని తమిళ, కన్నడాలతో పోల్చి ఆయా భాషల సన్నిహితత్వాన్ని నిరూపించాడు. చివరిగా తెలుగు భాషకు తమిళ - కన్నడాలకు గల సంబంధాన్ని విశ్లేషించాడు.

దీనికి తోడు కారకంలో వాక్య రచనా విధానంలో తెలుగు సంస్కృతంకంటే ఎలా భిన్నమైనదో తమిళ కన్నడాలు ఈ విషయంలో ఎలా సన్నిహితాలో రుజువు చేశాడు. ఆధారంగా డాక్టర్ విల్కిన్స్ రచించిన సంస్కృత వ్యాకరణంలోని కారక పరిచ్ఛేదం నుంచి ఉదాహరణ వాక్యాలు తీసుకుని తెలుగు-తమిళ- కన్నడ భాషల్లోకి అనువదించి చూపాడు. ఈ విధంగా తెలుగు సంస్కృత వ్యాకరణంలోని కారక పరిచ్ఛేదం నుంచి ఉదాహరణ వాక్యాలు తీసుకుని తెలుగు-తమిళ-కన్నడ భాషల్లోకి అనువదించి చూపాడు. ఈ విధంగా తెలుగు సంస్కృత జన్యం కాదని ఉదాహరణతో సహా వివరించాడు.

తమిళ - సంస్కృత భాషల్లో మంచి పాండిత్యం సంపాదించాడు. తిరుక్కురళ్ ఇంగ్లీషు అనువాదం చేసి ప్రచురించాడు. ప్రతిష్ఠాత్మకమైన మద్రాసు ఫోర్ట్ సెయింట్ జార్జ్ కళాశాలను 1812లో స్థాపించాడు. దానికి ప్రథమ ప్రాచార్యుడుగా పనిచేశాడు. దేశీయ పండితులయిన పట్టాభిరామశాస్త్రి, ముత్తు స్వామి పిళ్ళై, ఉదయగిరి వేంకట రమణయ్య, చిదంబర వాత్తియార్ సయ్యద్ అబ్దుల్ ఖాదిర్ లాంటివారిని అధ్యాపకులుగా నియమించాడు. 1813లోనే ప్రెస్ నిర్మించి తమిళ గ్రంథాలు అచ్చు వేశాడు. జెస్యూట్ ప్రతి నిధుల జట్టులో నోబిలి తర్వాత వచ్చిన ఫాదర్ బెషి (వీరమామునివర్) రచించిన తమిళ వ్యాకరణం 'కొడుమ్ తమిల్'ని 1813లో అచ్చువేశాడు. తిరుక్కురళ్ తమిళంలో రాసిన తిరుక్కరళ, తమిళరామాయాణంలోని ఉత్తరకాండ మొదలయినవి అచ్చు వేశాడు. తెలుగులో విక్రమాదిత్యకథలు, పంచతంత్ర, మరో రెండు వ్యాకరణ గ్రంథాలు అచ్చువేశాడు. వీటితోపాటుకన్నడ, మలయాళ, అరబిక్ గ్రంథాలు ఎన్నో 1830 వరకూ నిరాటంకంగా అచ్చు వేశాడు. రెవెన్యూ శాఖలో ఉత్పన్నమైన మిరాసీదార్ల చట్టాన్ని, మిరాసి హక్కుదార్ల విషయాలను కూలంకుషంగా చర్చించి 1814లో చిన్న పుస్తకం ప్రచురించాడు. దీనికి సహాయకుడుగా ఆనాటి శిరస్థారయిన శంకరయ్య సహాయం తీసుకున్నట్టు తెలియజేశాడు. ఈ మీరాసి దార్ల పుస్తకం ఉత్తరోత్తరా సి.పి. బ్రౌన్ ఉపయోగించుకున్నాడు.

ఎల్లిస్ దొర నిక్కచ్చయినవ్యక్తి. ఎక్కడా గ్రంథ చౌర్యంగాని, అబద్ధపు రాతలనుగాని ఉదాసీనంగా చూడలేదు. నిర్భందంగా ఖండించాడు. అవసరం అయినచోట తూర్పార పట్టాడు. జెస్యూట్ ఫాదర్లు 1778లో 'యజుర్వేదం' పేర ఒక పుస్తకం సృష్టించి అచ్చు వేశారు. బ్రాహ్మణులు బ్రహ్మ నుంచి పుట్టారన్న వాదాన్ని ఖండించాడు. 'An Account of a discovery of a Modern imitation of the vedas with remarks on the genune work' అనే వ్యాసాన్ని 1822లో అచ్చు వేశాడు. ఇది ఒక దుమారమే లేపింది. సోప పత్తికమైన ఆధారాలు చూపించనందువల్ల ఎక్కడా ఎవరూ దానికి సమాధానంగా మరో వ్యాసంరాయలేదు.

ఎల్లిస్ జీవిత క్రమం గమనిస్తే ఐ.సి.యస్. అధికారిగా 1796లో మద్రాసులో పనిచేశాడు. అసిస్టెంట్ అండర్ సెక్రటరీ 1798లో, డిప్యూటి సెక్రటరీగా 1801లో, బోర్ఆఫ్ రెవెన్యూ సెక్రటరీగా 1802లో, మచిలీపట్నం జిల్లా జడ్జిగా 1806లో, మద్రాసుకస్టమ్స్ అండ్ లాండ్ కలెక్టర్ గా 1809లో, మద్రాసు కలెక్టరుగా 1810లో వివిధ హోదాల్లో పని చేశాడు.

భారతీయులన్నా, భారతీయ సంస్కృతీ సంప్రదాయాలన్నా అమిత గౌరవం ఉండేది. ఈ నేపథ్యంలో 'హిందూ లా' పై ఎన్నో సాధికారిక ప్రసంగాలు మద్రాసు లిటరరీ సొసైటీలో చేశాడు. ఆయన మరణానంతరం అవి అచ్చయాయి. తెలుగులో కూడా ఆయన ఎన్నో రచనలు చేశాడని అవి అముద్రితాలుగా ఉండేవని అంటారు. ఆయన అకాలమరణం వల్ల రాతప్రతుల విలువ తెలియని ఆయన వంటవాడు పొయ్యి రగల చేయడానికి ఉపయోగించాడనే కథనం ఉంది. బహుభాషా శాస్త్రవేత్త అయిన ఫ్రాన్సిస్ వైట్ ఎల్లిస్ 1819లో కలరా సోకి మరణించాడనీ, పొరపాటున విషం తాగి మరణించాడనే కథనాలున్నాయి. ఐతే మరణానికి ముందే కొన్ని రాతప్రతులు సర్ వాల్టర్ ఎలియట్ కి అందజేశాడని ఆయన వాటిని డాక్టర్ పోప్ కి యిస్తే అవి ఆక్ఫర్డ్‌లోని బొదిలియన్ గ్రంథాలయంలో భద్రం చేశారని అంటారు.

నవల

అగరం వసంత్
094883 30209




మనిసి బతుకుబాట పలుమలుపులతో వంపులు తిరిగి ఉంటుంది. మనిసి, మన్ను కలగలసి నడిచేదే బతుకు. మన్నుకు గొంతు లేకపోవచ్చు కానీ మనిసికి ఉంది. దాదాపు డెబ్బయి ఎనబయివేలేండ్ల కిందట మనిసిగొంతు నుండి నుడి పుట్టింది. తన వేలేండ్ల ఏగింపులో వేనవేల తీరులుగా పొదగట్టి నిలిచింది నుడి. తావుతావుకొక నెత్తావి దానిది. మనిసి మెలన(చరిత్ర)కు గట్టి ఆనవాలు నుడి. మెలన అంటే రాతిమీద చెక్కింపులో ఇటుకరాళ్లో కుండపెంకులో మట్టుకే కాదు. మెలన అంటే మనిసిగొంతు. రాళ్లలో పెంకుల్లో దొరికేది అరకొర మెలన, బతుకులో దొరికేది నిండుమెలన.

మచ్చుకు మొరసనాడు అనే తావును చూద్దాం. ఇది ఇప్పటి ఆంధ్రప్రదేశ్‌లో కొంత, కర్నాటకలో కొంత, తమిళనాడులో కొంతగా మూడుముక్కలుగా ఉన్న తావు. బెంగళూరు, కోలారు, చిన్నబళ్లాపురం(చిక్కబళ్లాపురం), హిందూపురం, మదనపల్లి, పలమనేరు, కుప్పం, హోసూరు, డెంకణికోట తావుల్ని కలిపితే మొరసనాడు. ఈ నాడులో నూటికి ఏభైమంది తెలుగువాళ్లూ ముప్పయిమంది కన్నడిగులూ పదిమంది తమిళులూ, పదిమంది వేరేనుడుల వాళ్లూ ఉన్నారు. బెంగళూరు కర్నాటకకు తలనగరం అవ్వడం, హోసూరు పెద్ద నెప్పాటు(పారిశ్రామిక)వాడ కావడం వలన గడిచిన ఏభైయేళ్ల తరిలో కన్నడ తమిళుల లెక్క ఇంతన్నా పెరిగింది. అంతకు మునుపు తెలుగు లెక్క ఇంకా ఎక్కువ.

మొరసనాడులో రాళ్లమీది చెక్కింపులను చూస్తే నూటికి డెబ్బయి కన్నడనుడిలోనే ఉన్నాయి. దానినిబట్టి ఇది కన్నడనాడే అని మెలనరులు తేల్చిచెప్పేస్తారు. అది కాస్తంత పక్కనపెట్టి మందిగొంతులో ఏముందనేది చూద్దాం. మదనపల్లె, హిందూపురం, కుప్పం వీటిని వదిలేయండి, ఇవి ఇప్పటి ఆంధ్రలోనే కదా ఉండేది. ఇప్పటి కర్నాటక తావులోని కోలారు, చిన్నబళ్లాపురం; ఇప్పటి తమిళనాడులోని హోసూరు, డెంకణికోటల దగ్గర చూద్దాం. ఈ మొత్తం తావులో పల్లెపాటలనూ పల్లెకతలనూ పల్లెకళలనూ లెక్కేస్తే, అవి నూటికి తొంబైకి పైగా తెలుగే. ఈ తావునున్న కన్నడిగులూ తమిళులూ(వలసవచ్చినవారు కాక) కూడా తెలుగుకళలలోనే మునిగితేలుతుంటారు.

'మాయసంద్రం' అనే పల్లె బెంగళూరు నగర పొలిమేరల్లో ఉంటుంది. ఈ పల్లెలో నూటికి తొంబైమంది తమిళులు, పదిమంది కన్నడిగులు. వీళ్లు తరతరాలుగా మొరసనాడు వాళ్లే, వలసవారు కాదు. 'దేసింగరాజు కేళిక' అనే కళారూపాన్ని తెలుగులోనే ఆడతారు ఈ ఊరివాళ్లు. ఇటువంటివి ఎన్నో ఆనవాళ్లున్నాయి, మొరసనాడు తెలుగుతావే అని చెప్పడానికి. హోసూరు తావు తెలుగువాళ్లు(వీరిలో కన్నడ తమిళనుడుల వారు కూడా ఉన్నారు). కృష్ణ.ర.సం. అనే ఉలువెన (మైక్)ను పట్టుకొని, అమ్మనుడి అరుగు మీది నుండి ఇరవయ్యేళ్లుగా అరచి చెపుతూనే ఉన్నారు, 'ఇది తెలుగుతావు, మా తెలుగుగొంతులకు ఉరి పడిపోయింది' అని.

కొద్ది నెలలకు ముందే 'సొతంత్రకాల సదువులు' పేరుతో ఒక రచన 'అమ్మనుడి'లో వచ్చింది. మరలా ఇప్పుడు 'మావూరు' పేరుతో అగరం వసంత్, హోసూరు తెలుగుబతుకును మన ముందు నిలబెట్టబోతున్నారు. ఆటా మాటా పాటా, కూతా, చేతిరాతా, బడీ గుడీ సాగుబడీ (సంస్కృతి), అన్నీ అంతా తెలుగుమయంగా ఉండిన హోసూరు తావులో తెలుగుదివ్వె కొడిగట్టి, మినుకుమినుకుమని రెప్పారుస్తూ ఉంది. ఈ మెలననంతా మనముందుకు తెస్తున్నాడు వసంత్. ఆ ఎలమి(సంతోషం)నీ అలమటనూ చదివి పట్టించుకొందాం రండి.

## ఊరంటే నాకిష్టం

ముఖ్యంగా మావూరంటే

ఓసూరంటే...

కూతవేటు దూరంలా (4 మైళ్లు) కర్నాటక, దాటవేత (40 మైళ్లు) దూరంలా ఆంధ్రప్రదేశ్ ఎల్లలను ఆనుకొని వుంటుంది మావూరు. శాతవాహన, విజయనగర తెలుగుదొరల వైభవములా మెరసునాడులా భాగంగా మెరసి, ఇంగ్లీషువాని కాలంలా కుంపిణీ ఇలాకాలా (మద్రాస్ స్టేట్) కలిసి, ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర పోరాటంలా తెలుగమ్మ కూడా తానూ వుండాలని పోరాటము చేసి అలసి, అంగలార్చి కడగా అరవరాష్ట్రంలో లీనమైంది.

"తాలే లిల్లీయలో శివతాలే లిల్లీయలో" తేటతెలుగు మాటల ఇల్లుగా, ఎబుడూ చల్లగా, కన్నడ కస్తూరిని సింగారించుకొని, తమిళనాడుకు తలమానికంగా తయారయింది ఇబుడు.

ఈడ పల్లె ఆటలకి, పాటలకి, పంటలకి, వంటలకి, కళలకి, కళారూపాలకి, కళాకారులకి ఎబుడూ కొదవ లేదు.

అమ్మనుడికి గుడికట్టి గుండెల్లో దాచుకొనే కళాచారం మా తావు సొంతం.

తెలుగుతల్లి కనిన గారాలబిడ్డ మావూరు.

ఆ లెక్కలా మీరు మా సొంతం.

మేము మీ సొంతం.

మనందరిదీ తెలుగుబంధం.

అయినా...!

తెలుగంటే ఆంధ్రాయేనా? తెలుగంటే తెలంగాణాయేనా?

రవంత మాట్లాడుకొందామా...

తమిళనాడులోని తెలుగువెలుగు ఏనాటిది?

కన్నడమ్మ పంచలా చేరిన తెలుగుతావుల కతలు ఎన్ని?

రాతో రాత్రి బరంపురము విడచి 'గిడుగు' నడిచి వచ్చిన దోవ ఇబుడు ఎట్లుందన్నా?

'తెలుగు... తెలుగు' అని కొనవూరిపి విడిచిన కోదండరామయ్య ఏవూరోడంటారమ్మా?

బళ్లారి పద్మవ్యూహంలా బలైంది ఎవరప్పా?

కాలంలా కలసిన కతల కట్టలు ఎన్ని ?

వెతల పుట్టలు ఎన్ని ?

చరిత్రను తెలుసుకోవాలే కాని చానా చానా వుంది.

దాంట్లో మా సమాచారము చానానే వుంది.

చరిత్రపుటను తిప్పుండన్నా..... అమ్మా మీరు కూడా.

×××

జగిలి (అరుగు) మింద కూకొని ఒగే వుసురులా పాతపొత్తం చదవతా వుండే నేను, నార్లపల్లన్న దణి (ధ్వని) వినుకొని వీదిలానింకా ఇంట్లోకి పోతిని.

"అమ్మి... కడపమాను(గడప)ను దాటేసినే" ఆనందము పడతా అబ్బ అనె.

అబ్బమాట విని అమ్మ మూలింట్లో (వంటగది)నింకా పారొచ్చి "నాబిడ్డ కడపమానును దాటేసె" అంటా అమ్మిని ఎత్తుకొని ముద్దులు పెడతా వుంది.

తనబిడ్డ ఆటలా గెలిచినంత, జీవితములా గెలిచినంత



ఆనందము అమ్మకి.

"మడకలుకట్టే పొద్దులా బిడ్డ కడప దాటింది, మంచి పొద్దు, మంచి గడియలు" తాత అంటా వుండాడు.

"కడపమానుకు పూజ చేయాల కదమ్మా, దానికి కావలసింది అవనిచ్చుకోకుండా నువ్వు ఇంగా ఈడే వుంటే ఎట్లమా?" అవ్వ అనింది తడువు, అమ్మ అట్లే మూలింట్లోకి పోయె.

అదెంత బిరీనా(తొందరగా) చేసెనో వబ్బట్లు(బొబ్బట్లు), కీరు (పాయసం), అన్నము, రసము చేసింది అమ్మ.

అవ్వ అమ్మికి నీళ్లుపోసి కొత్తబట్టలు వేసి సొగసుగా తయారు చేసింది.

కడపమానుని కూడా కడిగి, పసుపు, కుంకుమ పూసి, పువ్వుల అలంకారము చేసిండారు.

పక్కిండ్ల అమ్మలక్కలు వచ్చి ఆడ నిలిసిండారు.

"బిడ్డ వీదిలానింకా ఇంట్లోకి వచ్చెనా, ఇంట్లోనింకా వీదిలాకి పోయెనా?" నంజవ్వ అడిగె.

"నేను చూస్తిని మా, ఇంట్లోనింకా వీదిలాకి పోయె" అబ్బ అనె.

"అయితే వబ్బట్ల తట్టను ఇంటిలోపల పెట్టి, బిడ్డని ఎత్తుకొని వీదిపక్క రామ్మా" అంటా అమ్మకి చెప్పె.

అమ్మ అట్లే చేసి సాంబ్రాణి కడ్డు అంటిచ్చి కడపమానుకి పూజ చేసె.

ఆమీట ఇంటిలోపల పెట్టిండే వబ్బట్ల తట్టని అమ్మికి చూపిచ్చి 'పోయి తిను పోమా' అనె.

ఇంట్లోని వాళ్లంతా కూడా వచ్చి వబ్బట్లు తినమని అమ్మికి సైగలు చేస్తా వుండారు.

ఇదంతా చూస్తా వుండిన అమ్మి బొర్లుకొంటా (దోగాడుతా)

కడపమానును దాటి ఇంటిలోపలికి వచ్చేసె.

అందరూ చప్పట్లు కొడతా అమ్మికి వబ్బట్లు తినిపిస్తా వుండారు.

అట్లాటబుడు నాలా ఒగ సందేహము దూరె. అదేమప్పా అంటే నేను చిన్న బిడ్డగా వుండినపుడు నాకిట్ల చేసిరా అని, ఇదే మాట అమ్మని అడిగితిని.

"నా బంగారుకొండ నువ్వు, నీకు చేయకుండా వుంటానా, నీకు ఇంకా ఘనముగా చేస్తిని, ఆపొద్దు మర్నోమి పండగ (విజయదశమి). నేను పొద్దుపొద్దిననే ఇల్లు అలికి ముగ్గుయేస్తా వుంటే నువ్వు కిర్లుకుని లేస్తివి. నేను నిన్ను ఎత్తుకొని వచ్చి ముగ్గు వేసే తావ కూకోబెడితిని. రవంతసేపు కలకుండా ముగ్గుని చూస్తా వుండిన నువ్వు, అదెబుడు వెల్లేస్తివో వీదిలానింకా ఇంట్లోకి కడపమానును దాటి వెల్లేసింటివి" అని పాత గేణము(జ్ఞాపకం) చేసె అమ్మ.

"పోనీ ఇబుడు దాటరా, నీకు ఇంగో కిత(సారి) పూజ చేస్తాము" నంజవ్వ అంటానే అందరూ నగినగి పెట్టేసిరి. నేనూ నగుకొంటా గుడితావుకి పారితిని.

మా గుడి గురించి చెప్పేకన్నా చూస్తేనే బాగుంటుంది. తూరుపు దిక్కులా పెద్దగా పెరిగిండే మర్రిమాన్లు, పడమర పక్కలా పెద్ద బండ, ఉత్తరము దిక్కులా పెద్దేరు (దక్షిణపెన్నా), ఇది కర్నాటక నందికొండల్లా పుట్టి మావూరిలా దూరి, కిష్ణగిరి, ధర్మపురి, సిరివన్నెమల (తిరువణ్ణామలై), విల్లుపురం, కడలూరులను తడపతా తమిళనాడులా పారుతుంది. ఇంగ దక్షిణ దిక్కులా పారేదే చిన్నేరు. ఇది చానా చిన్నది. ఒగటి రెండు వానలకే పొంగి పారుతుంది. కడగా పేరండపల్లి పక్కలా పెద్దేరులా కలుస్తుంది.

పూజా పునస్కారాలకే కాదు, వీదినాటకాలకి, స్టేజి నాటకాలకి, కేళికలకి, బజనలకి, పండరి బజనకి మా గుడి పెసిద్ది.

పెద్దోళ్ల న్యాయాలు, పంచాయితీలకి పెట్టింది పేరు. అబుటికే పొద్దు మునిగి మబ్బులు ముసురుకొంటా వుండాయి. గౌడు శీనప్ప పూజకి సురువు చేస్తా వుండాడు.

గుడి ముందర బయిల్లా ఆటలు ఆడేకి చిన్నోళ్లంతా వచ్చి చేరతా వుండారు. నేను ఆడకి పోతిని.

"అనా, రానా... అ.. ఆ... ఆట ఆడదాము " అంటా మల్లి పిలిచె. నేను పోయి మల్లి ముందర కూకొంటిని.

నేను 'అరి' పేరులా ఆట ఆడతాను అంటా "అరి – గిరి – గులుగులు గురి – తారం తరి – నీ పేరు అరి" అని మొదలు పెట్టె.

"రవి – గివి – గులుగులు గువి – తారం తవి – నీ పేరు అవి" అంటా ఆట సురువు చేస్తిని నేను.

"కనకా – గినకా – గులుగులు గునకా – తారం తనకా – నీ పేరు అనక" మల్లి అనె.

"మల్లి – గిల్లి – గులుగులు గుల్లి – తారం తల్లి – నీ పేరు అల్లి" అంట్ని.

ఇట్ల మల్లి ఒగ పేరులా, నేను ఒగ పేరులా ఆట ఆడతా పోతా వుండాము. ఇది అన్ని ఆట్ల మాదిరిగా ఎగరలాడి, దుముకులాడి ఆడే ఆట కాదు. నోటి మాటల ఆట. అచ్చమైన తెలుగాట. మనలా మాటల గేణాన్నీ బుద్దినీ పెంచే ఆట.

"చేతులన్నీ ఏడకి పోయే – వాకిలి సందుకి – వాకలి ఏమిచ్చె – చెక్క యిచ్చె – చెక్కని ఏమిచేస్తివి – పొయ్యిలా పెడితిని –




పొయ్యి ఏమిచ్చె – బూడిదిచ్చె – బూడిదని ఏమి చేసిరి – చేనులా వేస్తిమి – చేను ఏమిచ్చె – రాగులిచ్చె – రాగుల్ని ఏమి చేసిరి – గాదిలా వేస్తిమి – గాది ఏమిచ్చె – రాగులిచ్చి, పిండి చేసుకొని సంగటి చేసుకోమనె – సంగటిని ఏమి చేసిరి – అందరూ తింటిమి – అయితే పదండ అందరూ మూట్లు కూర్చి పక్కకేస్తాము" అంటా మూట్లాటకి కొందరు చిన్నోళ్లు సురువు అవుతా వుండారు.

చెండాట ఆడతా ఓ గుంపు మాలగేరి పక్కపోతే, చెన్నాముల్లు ఆట ఆడతా ఇంగో గుంపు కాపుగేరి పక్కపోయె.

ఆ పక్క అప్పాలమ్మ తిప్పాల ఆడతా వుండే ఆడబిడ్డ ఆనందానికి అద్దే లేకుండా పోయె.

దిగులాట ఆడి దిగులుపడిన చిన్నోళ్ల కతలు ఈడ చానా.

కట్టాటకి కట్టెను వెతకతా సోముడు.

"సుద్దాండల్.. డబుకు డబల్... కటకల్" జల్లికట్టి ఆట సురువు చేస్తా భీముడు.

కాళంచి ఆటకని కానుగ విత్తనాలు తెచ్చిన కాసిగాడు.

"చింతగింజలాట ఆడతాము రాంద్రే" చింతగింజలు తెస్తా నంజి.

కట్టె చేతులాటకి కట్టెలు సరిచేస్తా రమేసుడు.

కట్టె కాలు ఆటకి కొటము పొడవు వుండే కట్టెని తిప్పతా కొక్కల రాముడు.

"ఏనా బట్టరా నా పాలచెంబులా చెండుని వేసింది" రాజమ్మ కిర్లతా లేస్తానే, చూరచెండాట ఆడతా వుండిన చిన్నోళ్లందరు 'కెగోని' (జోరుగా) చెల్లాచెదురై పారిపోయిరి.

నాకు, మల్లికి వాళ్లని చూసి నగువచ్చేసె. నగి... నగి నిలిసేకి కానట్లా నగతా వుండాము.

ఎవరి ఆట వాళ్లు ఆడతా వుండారు.

ఎవరి పాట వాళ్లు పాడతా వుండారు.

"ఈ విశాలమైన సృష్టే పెద్ద ఆటస్థలము. మన బతుకనే ఆటని బాగా ఆడాలా, చానా బాగా ఆడాలా, ఆడదండ ఆటలు, పాడండ పాటలు" వీదిలా నడస్తా "జగ్గునక.. కుణికినక" ఆడతా గుడి దాటి పోతా వుండాడు పాపన్న.

గుడి గంట గట్టిగా కొట్టిరి. మోటప్ప పలక (డప్పు) కొట్టేది, సాకన్న కొలువు (సన్నాయి) ఊదేది నిలిపిరి.

సెనగ్గుగ్గుళ్లు ప్రసాదము తింటా మేమూ ఇండ్లకి పోతిమి.

× × ×

"ఒళ్లంతా వెచ్చగా వుంది, మొకము మీద ఆడాడ దద్దులు వచ్చిండాయి, బిడ్డకి అమ్మ పోసినట్లుంది" అమ్మిని చూస్తా అవ్వ అనె.

"అవును కదమ్మా నేను చూడనే లేదు" అని పోయి మాలూరమ్మని పిలుచుకొని వచ్చె అమ్మ.

మాలూరమ్మ కాన్పులు చేసేదాంట్లో పెసిద్ది. ఇట్లా అమ్మల్ని కూడా మేలుచేస్తుందని నాకు అందాగంట (అంతవరకు) తెల్లేదు.

"అమ్మేనమ్మా" అంటా మాలూరమ్మ ఆడ కూకొనె.

అమ్మ అట్లే పోయి వేపాకు గంజరము (ఆవు మూత్రం) తెచ్చె.

"నట్టింట్లో గాది పక్కలా చాప పరిచి, చాపపైన వేపాకులు నెరవి, దానిపైన రగ్గు పరిచి పైన తెల్లబట్ట వేసి చుట్టూ పసుపునీళ్లు ఆవు గంజరము చల్లి పడుకోబెట్టండ, అంటూ ముట్టూ సోకకూడదు" అమ్మకి చెప్పి పోయె మాలూరమ్మ.

రెండోనాడు జెరము జాస్తి అయిందని అమ్మికి కషాయము తాగిపిచ్చిరి.

"వీదిలా ఐదుగురు బిడ్లకి అమ్మ పోసిందంట. మారెమ్మ తల్లికి సల్లముద్దలు పెట్లాల" అమ్మ తావ(దగ్గర) అమ్మలక్కలు అని పోయిరి.

ఆ పొద్దిననే మసలకే లేసి, ఇల్లూ వాకిలి ఉజ్జి, వీదిలా ముగ్గేసి ఇల్లంతా ఆవుగంజరము, పసుపు నీళ్లు చిమకరిచ్చి సల్లముద్దలు చేసేకి సురువు చేసె అమ్మ.

మంటిసట్టిలా నీళ్లు పోసి దాంట్లో పిడికెడు రాగిపిండి కలిపి పొయ్యిమీద పెట్టి అగ్గి మంటేసె. నీళ్లు బాగా మరిలినంక దాంట్లో బీము పోసి బాగా ఉడకబెట్టి, ఉడికిన అన్నాని పెద్ద తట్టలా వేసి ఆరబెట్టి ఆరినంక దాంట్లో పెరుగు పోసి కలిపి సంగటిముద్దలు మాదిరిగా ముద్దలు చేసి ఇంగో తట్టలా పెట్టుకొనె. దీన్నే సల్లముద్దలు అనేది.

సల్లముద్దల్ని పూజసామాన్నీ తట్టలా పెట్టుకొని అమ్మిని పిలుచుకొని మారెమ్మ తాకి పోతిమి. నడి వీదిలా మనిషి పొడవు నిలిపిండే రాయినే మారెమ్మ అనేది. కోటమారెమ్మకి గుడి వుంటుంది. ఈ మారెమ్మకి గుడి వుండేలేదు. ఎండకి ఎండతా వానకి నానతా నడి వీదిలా ఎబుడూ నిలిసే వుంటుంది. ఇట్లా అమ్మలు వచ్చినపుడు మాత్రమే పూజలు ఈ మారెమ్మకి.

వేపాకు, ఆవుగంజరము వాసన, సాంబ్రాణి కడ్ల వాసనలు కలిసి అదో మాదిరిగా ఆ పట్యంతా (ప్రాంతం) నిండిపోయి వుంది.

అమ్మ, మారెమ్మకు పసుపుకుంకుమ పెట్టి పూలు ముడిసి సల్లముద్దని అమ్మికి దిగదిచ్చి మారెమ్మ ముందర పెట్టి పూజ చేసె.

ఆపొద్దు నేను సల్లముద్దల్ని రుచి చూస్తిని. అయినా రాగిముద్ద తినే మాకు సల్లముద్దలు ఓ లెక్కా.

ఇట్లా పెట్టిన సల్లముద్దల్ని మూడోనాడు జలిదిలా (నిమజ్జనం) విడచిరి.

ఆమీట రెండు దినాలకి అమ్మికి పూర్తిగా జెరము తగ్గి అమ్మ ఒళ్లు దిగిపోయె.

"చింతామాను తొర్రాలోనా చిలుకా కూసె శివా చిలుకా కూసె" వీదిలానింకా వచ్చిన పాటను విని ఈ లోకానికి వస్తిని. అంటే నిద్రలేస్తిని.

జగిలి మీద కూకొని కూనిరాగాలు తీస్తా ఆవులకి జొన్నకడ్లు తినిపిస్తా వుండాడు తాత. ఆవులింట్లో చెత్త ఊడిచి, తిప్పలా వేసి వేపకడ్డిలా పండ్లు తోమతా అబ్బ. మూలింటి పనుల్లా మునిగీ తేలగా వుండారు అవ్వ, అమ్మ. అమ్మి ఇంగా నిద్రపోతా వుంది.

నేను వేపకడ్డి నమలతా వీదిలాకి పోతిని. వీది వీదంతా మసాల గమ్ములు, కమురు వాసనల్లా నిండిపోయింది. ఏమి ఈపొద్దు విశేషము అనుకొంటా వున్నట్లే నాకు గేణానికి వచ్చె, ఈపొద్దు వరసతడుకని. ఉగాది పండగని మా పక్క రెండు దినాలు చేస్తారు. మొదలు దినము ఉగాది, ఆపొద్దు మసలకే లేచి ఇంటి వాకిళ్లకి మామిడి ఆకుల తోరణాలు కట్టి వేప పువ్వులు సింగారించి తలా ఒళ్లంతా నూనె పూసుకొని రవంతసేపు అయినంక నిమ్మరసాన్ని ఉజ్జుకొంటా ఆమీట నీళ్లు పోసుకొంటాము.

కొత్తబట్టలు వేసుకొని పరగడుపున, చచ్చిపోయిన పెద్దల గుంతల (సమాధులు) తావుకి పోయి పూజ చేసి, వేపాకు, బెల్లము, కొమ్మరి కలిపి తిని, ఆమీట వబ్బట్లు, రసము అన్నము తింటాము.

ఇంగ రెండోనాడు చేసే పండగే వరస తడుకు. ఈపొద్దు పల్లె పల్లెలంతా కారం వంటలు, నంజర చార్లు (మాంసం వంటలు) చేసి తినేది బలే వాడిక.

మా ఇంట్లో ఎబుడంటే అబుడు నంజర చారు చేసేలేదు. ఇట్లా పండగలబుడే చేసేది. 'ఏలిట్ల' అని అమ్మని అడిగితే "కాసులకి కొదవప్పా" అంటుంది. తినేదానికీ కాసులు కొదవకీ అదేమి సంబంధమో నాకు తెల్లేదు. ఈపొద్దు ఒక పట్టు పట్టిడాలా, చానా నంజర తినిడాలా అనుకొని ఇంట్లోకి పారితిని.

అంతలానే కానుగుమాను తావ గొర్రెని కోస్తావుండారనేది నా చెవిలా పడె. నల్లీ (కొళాయి) నీళ్లలా మొకము కడుక్కొని ఆడికి పారితిని.

అబుటికే గొర్రె బందము (ఉన్ని) తీసి కడుపులా వుండే పొట్టా, పేగులు ఒగ మక్కిరి(గంప)లా వేసిండారు. గొర్రె దొమ్మని కట్టెకి కుచ్చుకొని కాలస్తా వుండాడు పెద్దయ్య. మాపక్క గొర్రె దొమ్మని గోడదొమ్మ అని అంటారు. ఏలంటే ఈ దొమ్మని కోసినంక గోడకేసి కొడితే అది అట్లే బిగ్గా గోడకి కరుసుకొనేస్తుందంటా. దాన్నింకానే గోడదొమ్మ అని అనేది.

దొమ్మ(కాలేయం) బాగా కాలినంక ఆడ ఎందరు వుండారో అన్ని సమభాగాలుగా కోసి అందరికీ ఇచ్చె పెద్దయ్య. నేను నాదీ మా అబ్బదీ రెండు తునకలు లొటకలు వేసుకొని తింటిని.

అందరూ నంజర ఉద్దలు ఎత్తుకొని ఇండ్లకి పోయిరి. నేను అందాగంట చూడనే లేదు, మా నంజర ఉద్ద చానా చిన్నగా వుంది. ఇదేమని అబ్బని అడిగితిని.

"వాళ్లంతా చేరి కాసులు ఇచ్చి కొనుక్కొని వచ్చిండే గొర్రెప్పా అది. నేను కాసులు ఈలే, గొర్రెని కోసి బాగాలు వేస్తిని కదా, దాన్నింకా నాకు రవంత నంజర ఇచ్చిండారు" అంటా ఆడుండే గొర్రె తలకాయను ఎత్తుకొనె.

"ఇదీ మనకేనా?" ఆశగా అడిగితిని.

"కాదురా... ఇది గౌనోళ్ల సేద్దెగానిది. కాల్చుమని నాకు ఇచ్చిండాడు."

"నాకు అదంతా తెలీదు. గొర్రె తలకాయ నంజర తినాల, నేను తినే తినాల" అని ఆటము చేస్తిని.

"అట్ల ఆటము చేస్తే ఎట్లప్పా, కావాలంటే ఈకిత (సారి) ఊరి పండక్కి తెస్తాలే" అంటా గౌర్రె చెవుల్ని కోసి కట్టెకి కుచ్చి కాల్చుమని నాకిచ్చె.

ఈపక్క ఆపక్క తిప్పేసి మల్లేసి బాగా కాల్చితిని.

కాలిండే గొర్రి చెవుల్ని బాగా ఉజ్జి రవంత తిని చూసి "కాలింది ఇందా తిను" అంటా నాకిచ్చె.

ఇచ్చింది తడువు 'లబుకు.. లబుకు' అంటా తిని మింగేస్తిని.

ఇంతకి ముందర అత్తాన (హస్తకార్తైవాన) పొంగలిపండగ నాపొద్దు(నాడు) పందిని కాల్చినబుడు దాని తోకని కాల్చుకొని తినింది గేణానికి వచ్చి కుశాలు పడితిని.

"నీ అట్లా అంకునాబట్టని (ఆశతో కూడిన ఆత్రగాడు) నేను ఏడా చూడలేదురా" మాను పైనింకా కాకమ్మ అనె.

"ఇపుడు చూస్తివి కదా" అంటిని.

'ఏమి కుశాలురా నీది" అని అది తలపట్టుకొనె.

"ఇంగ చాలు నిలుపు కాకమ్మ నీ కూతలు. మీకేమి నంజరకి కొదవా. ఎబుడు కావాలంటే అబుడు తింటారు. నాకు ఆ యోగము లేదే" అని అంగలారిస్తిని.

"నీ అట్లా గిరాము (గ్రహచారం) చెడినోన్ని ఈ ఇలాకాలా చూడలేదురా" మాను మద్యలా నింకా కుందిలి (కుందేలు) అనె.

"నాకు రేగిందంటే నంజరయిపోతావు" అంటా కోపముగా కుందిలి పక్క చూస్తిని.

"పోరా లత్తనా కొడకా నేను నంజరయి నీ నోట్ల పడే కన్నా నక్కకో కుక్కకో కూడయితా" అంటా పారిపోయె.

మీకు ఒగ విషయము తెలుసా? అన్ని నంజర్లూ ఉడికినంక తగ్గుతాయి కానీ కుందిలి నంజర ఒదుగుతుందంట (ఎక్కువ అవ్వడం).

"రేయ్! కౌసు నాయాలా వూరువూరంతా వరసలు కలపతా, వెదకతా వుంటే నువ్వు ఈడ ఏమి చేస్తా వుండావురా, కళిసి(తొలగి) పోరా కల్లి వబ్బ(పొద)లా నింకా కేకరిచ్చి ఉమిసే కెంబారు కాకి (జెముడు కాకి).

అది ఉమిసింది కూడా నాకు లెక్కలే. మంచి గేణము చేసె అనుకొని వీదిలాకి పారితిని.

ఆడ అబిటికే పెండ్లీడుకి వచ్చిండే పడుచులు (కన్నెలు) వయసు చిన్నోళ్లు మాటల్లా మునిగి, చూపుల్లా తేలతా వుండారు. 'వరస తడుకు' పండగ సురువు అయింది.

దూరమూ దగ్గరీ చుట్టాలు వాళ్లవాళ్ల బిడ్లకి వరసలు చెప్పతా వుండారు.

"చిన్నా! ఈ తెల్లతోలు పడచు నీకు అక్క వరస, ఆ నల్లతోలు బిడ్డ చెల్లెలి వరస, ఎర్రగా బుర్రగా వుండే అది నీకు మరదలి వరస."

"ఈడ చూడు అమ్మీ. ఆ కరాపు జుట్టోడు నీకు అన్న వరస, ఆ చిలకముక్కోడు నీకు మామ వరస, ఆ మోటోడు నీకు బావ వరస."

అందాగంట దొంగచూపులు, నంగిమాటలు చెప్పిన చిన్నోళ్లంతా ఇపుడు నిజముచూపులు చూసేకి సురువైరి. వావి వరసలు తెలిసి ఒగర్ని ఒగరు మెచ్చుకొనిరి, ముట్టుకొనిరి, మాట్లాడిరి.

"ఇట్లా పండగని విడిచి ఈనడమ దేశములాని వయసు చిన్నోళ్లు పడుచులు 'లవర్స్ డే' అనే పండగని బలే బెమగా చేసుకొంటారంట కదప్పా" జరగన్న అదో మాదిరిగా అంటా పోతావుండాడు.

"చూడరా నీ మామకూతురు చిలకలా వుంది. నీకు సరైన వరస" అంటా గోపమ్మ అంటానే అందరూ నగేసిరి. మీ నగువులకేమి, నాకు ఆకలి అవుతా వుంది అని ఇంటికి పారిపోతిని.

సంగటిముద్ద, నంజరచారు, పెద్దబేరొడ్ల అన్నము తిని ఆయిగా పనుకొంటిని.

కోడిగుజ్జాముకే కిర్లుకొని లేస్తిని. కడుపు నొప్పిగా వుంది. తడిసేకి (తట్టుకోడానికి) అయితా లేదు. అమ్మ బిర్నా వచ్చి ఆముదము కాంచి (కాగబెట్టి) దాన్ని తమలపాకుకి బాగా పూసి నా బొగ్గిలి (బొడ్డు) తావ మెత్తించె.

రవంత సేపుకి కడుపునొప్పి తగ్గె కానీ కడుపు ఆరేది (విరేచనాలు) సురువాయె.

ఇదేమప్పా ఒగటి మేలయి ఇంగొగటి తగులుకునే అని అమ్మకి చెప్పితిని.

"అత్తిపాలు బొటికె వేపించుకొని రాపో" అంటా అబ్బకి చెప్పె.

"రాప్పా పోదాము" అంటా పిలస్తానే నేనూ లేస్తిని. కుమ్మరోళ్ల ఇంటి దోవ సాగితిమి.

ఆవులింట్లో గోపన్న, గొర్రెలదొడ్డిలా రాజన్న, కసువు వామితావ కాకన్న, చెత్త ఎత్తతా చిన్నిముని, చెత్త తోస్తా సాకవ్వ, ముగ్గేస్తా మునెమ్మ, కసువు, కగ్గును ఆవులకి, దూడలకి వేస్తా ఎర్రన్న. ఇట్లా ఎవరి పనులు వాళ్లు చేస్తా వీదంతా పారాడతా వుండారు.

"ఏమప్పా! పొద్దిననే కొడుకుని పిలుచుకొని వచ్చిండావు. రాత్రి నంజరచారు బాగా తినెనా?" మమ్మల్ని చూస్తానే అనె కుమ్మరన్న.

"ఏలనా! నువ్వు తినలేదా?" అని అడగాలనుకొని అడిగేకి సత్తువ లేక అట్లే ఆ మాటని మింగుకొంటిని.

"ఏలరా, అట్ల గుటకనీళ్లు మింగుతావు. తెలెలా (కంచం) నంజరచారు పోసినబుడు సిక్కినబుడు తినరా కుక్కతినేట్ల అనే మాదిరి తినకూడదురా" అనె.

వీడు సరేని కులాకారం చెడిన కుమ్మరోడు వున్నట్ల వుండాడు. నేను మాట్లాడకుండానే నా జాతకమంతా చెప్పతా వుండాడే. వీనికేమైన కైవారం నారాయణతాతగారి మాదిరిగా శీకనపల్లి ఆంజనప్ప సాముల మాదిరిగా కాలజ్ఞానము తెలుసా, నాలా నేను యోచన చేస్తా వాన్ని ఎగాదిగా చూస్తా వుండా.

"చూసింది చాలు ఇందా ఈ బోకిబిల్ల (కుండపెంకు) తిను" అంటా నా చేతికిచ్చె.

"బోకిబిల్లని తినాలనా?" అదో మాదిరిగా అంటిని.

"నువ్వు కలకుండన్నా, వాడు ఇబుడే దిగులు పడిండాడు" అంటా నా చేతిలాని బోకిబిల్లని తీసుకొని అత్తిమాను పక్కకు పోయె మా అబ్బ.

ఈడే వుంటే వీడు నన్ను మాటల్లానే చంపేసే మాదిరి వుండాడని అబ్బ వెనక నడిస్తిని.

అత్తిమాను ఆకు తొటాల్ని (కాడల్ని) వించి దాంట్లో వచ్చే పాలని బోకిబిల్లకి బాగా పూసి దాన్ని బొగ్గిలికి (బొడ్డుకు) మెత్తించె.

రవంతసేపు అయినంక అది నా బొగ్గిలికి బిగ్గా (గట్టిగా) కరుసుకొనేసె.

ఆపొద్దు మద్దేనానికే నాకు కడుపు ఆరేది నిలిచె. బొటికె మాత్రం రెండుమూడు దినాలు అట్లే కరుసుకొని వుండి ఆమీట కింద పడె.

(తరువాయి వచ్చే సంచికలో...)

నవల

డి.పి.అనూరాధ
90100 16555




*(జరిగిన కథ)*

***ప్రవల్లికను వెతుకుతూ సూర్యవర్మ శ్రీలంక వెళతాడు. కంది కోటలో తెలుగు జాతి వైభవాన్ని కళ్లారా చూస్తాడు. ఆ రాజుల ఘనకీర్తిని తెలుసుకుంటాడు. తెలుగు మాతృభాషగాగల మనజాతి వాళ్లని కలుసుకుని ఆశ్చర్యపోతాడు. ప్రవల్లిక కూడా మనజాతి మగువ కావడం చూసి సంతోషిస్తాడు. తన కలలో థాయిలాండ్‌లో ఇంతకు ముందే కలుసుకున్న సంగతిని ఆమెకు ఎలా తెలియజేయాలో తెలియక తర్జనభర్జన పడుతుంటాడు.***

**ఉ**దయం కాలువ గట్టుకి స్నానానికి వెళ్లినప్పుడు మసన్న చెప్పాడు. ఎనిమిదింటికి లచ్చిమి వస్తుంది. సి గిరి కొండకు తీసుకువెళ్తుందని. మనసు కాస్త నెమ్మదించింది. తనతో ఎక్కువ సమయం గడిపే అవకాశం దొరకుతుందని.

ఎనిమిదింటికల్లా లచ్చిమి వచ్చింది. మేం బయల్దేరాం తన హోండా డియో టూవీలర్ మీద. నాకూ హెల్మెట్ ఇచ్చింది. తను డ్రైవ్ చేస్తుంటే నేను వెనక కూర్చున్నా. అమ్మాయి బండి నడుపుతుంటే వెనుక కూర్చోవడం ఇదే మొదటి సారి. తను ఎర్రని ఫుల్ షర్టు, తెల్ల చొక్కా వేసుకుంది. పొడవాటి గిరిజాల కురులు.. మధ్యలో క్లిప్ పెట్టుకుని జుట్టునంతా అలా వదిలేసింది. గాలికి ఆ మెత్తని కురులు నన్ను తాకి ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. దారి పొడవునా పెద్ద పెద్ద వృక్షాలు. వాతావరణం ఎంతో అహ్లాదకంగా ఉంది. డబుల్స్ బాగా అలవాటున్నట్టుంది. అవలీలగా నడుపుతోంది.

గంటన్నరకంతా సీ గిరి కొండను చేరిపోయాం. పర్వతం లాంటి పెద్ద రాతికొండ దూరంగా కన్పిస్తోంది. లచ్చిమే ఎంట్రీ టికెట్ తీసుకుంది. విదేశీయుడిని కాబట్టి నా పాస్‌పోర్ట్ వివరాలు తీసుకుని టికెట్ ఇచ్చారు. నా టికెట్ 25 యుఎస్ డాలర్లు. ఆ డబ్బంతా తను సింహళ రూపాయల్లో చెల్లించింది. నేను డాలర్లు ఇస్తుంటే వారించింది. 'మీరు మా గెస్ట్' అంది.

అహికుంటికలకు నాకూ ఎలాంటి సంబంధం లేదు. కానీ నేను తెలుంగు వాడినని ఇంత గౌరవం ఇస్తున్నారు. వీళ్లు ఇండియాకి వస్తే మనం ఇలాగే గౌరవం ఇస్తామా?

'ఇప్పుడు మనం ఆ కొండను ఎక్కబోతున్నామా' లచ్చిమిని అడిగాను.

'అవును, సగం కొండైతే సులభంగా ఎక్కొచ్చు. ఆ తరవాత మీ ఇష్టం. మీకు ఓపిక ఉంటే.. ఈ కొండను సింహగిరి అనే అర్థంలో సిగిరియా అని పిలుస్తారు. మన తెలుంగు వాళ్లమైతే సీగిరి కొండ అంటాం. క్రీస్తు శకం 5వ శతాబ్దిలో కశ్యప అనే రాజు 660 అడుగుల ఎత్తున్న ఈ రాతికొండ పై భాగంలో కోటలను నిర్మించాడు. అనురాధపుర నుంచి సి గిరియాకు రాజధానిని మార్చాడు. ఇప్పటికీ ఈ కొండనెక్కడం ఎంతో కష్టం. ఎలాంటి టెక్నాలజీ లేని ఆకాలంలో అంతెత్తున ఎలా నిర్మించారో తెలియదు. అందుకే మా దేశంలో ఎయిత్ వండర్‌గా చెప్పుకుంటాం. ఎండ ఎక్కువైతే కొండ ఎక్కడం కష్టం. వెళదామా..' అంటూ తను ముందుకు సాగింది.

ఎంట్రీ పాయింట్ నుంచి అర కిలోమీటరు నడిచిన తరవాతే కొండ సమీపానికి వచ్చాం. కొండ చుట్టూ కందకాలు. నిండుగా నీళ్లున్నాయి. అనేక చిన్న చిన్న ఫౌంటెయిన్లు.. అందమైన తోటలూ మలిచారు. చెట్లూ, వృక్షాలూ లేకపోలేదు. వెడల్పైన మెట్ల దారిలో జనాలు గుంపులు గుంపులుగా ఓ క్రమపద్ధతిలో కొండనెక్కుతున్నారు. అన్ని మెట్లూ ఒకేలా లేవు. కొన్ని ఎత్తుగా, కొన్ని చిన్నగా ఉన్నాయి. దారి కూడా ఒకేలా లేదు. స్కూలు, కాలేజీ పిల్లలు కూడా విహారయాత్రకి వచ్చినట్టుగా ఉంది. అందరిలో ఏదో ఉత్సాహం,



నవ్వుతూ తుళ్లుతూ ఎక్కేస్తున్నారు.

నాకు కొండనెక్కడం కన్నా లచ్చిమితో ఎలా మాట్లాడాలన్నదే గట్టిగా లాగుతోంది. నా కల చెబితే తను నమ్ముతుందా, అబద్ధమని అసహ్యించుకుంటుందా అనే భయంతో కొండెక్కుతున్నాను.

'మిర్రర్ వాల్' వచ్చింది. ఒకప్పుడు వాలుగా ఉన్న ఈ గోడ ముందు నుంచి మనషులు వెళుతూ తమ ప్రతిబింబాలని చూసుకునేవారట. అంత పారదర్శకంగా ఆ గోడను రూపొందించారు. ఇప్పుడు చాలా నునుపుగా ఉంది కానీ, మన ప్రతిబింబాలేవి అందులో కన్పించడం లేదు.

అందరూ అక్కడ సెల్ఫీలు తీసుకుంటున్నారు. నేనూ, లచ్చిమీ ఓ సెల్ఫీ తీసుకున్నాం. ఒకే ఫ్రేమ్‌లో ఇద్దరం భలే ఆనందంగా ఉంది నాకు. తనలో ఎలాంటి ఫీలింగ్స్ లేవు. మామూలుగానే ఆ చుట్టుపక్కల ప్రాంతాల గురించి వివరిస్తోంది. మా మాటలు విని, మా దగ్గరగా ఇద్దరు వ్యక్తులు వచ్చారు.

'మీరు తెలుంగా, ఇండియా నుంచి వచ్చారా' నన్ను చూస్తూ ఓ వ్యక్తి అడిగాడు.

'అవును, మాది హైదరాబాద్'

'నా పేరు మాణిక్యం. ఈయన మా పెదనాన్న మునుస్వామి. మేము కూడా తెలుంగే, మా తాత నేటి తమిళనాడులోని రామనాథపురం నుంచి బ్రిటీష్ సమయంలో తేయాకు తోటల్లో కూలీగా ఇక్కడికి వచ్చారు. కొలంబోలో ఉంటున్నాం. సిగిరియాకు టూరిస్టులుగా వచ్చాం.'

నాకెంతో ఆశ్చర్యం వేసింది. శ్రీలంక అనగానే తమిళులే గుర్తుకువస్తారు. కానీ శ్రీలంకలో నేడు తెలుగు మాతృభాషగా గల వారు ఇలా అడుగడుగునా కన్పిస్తారని అస్సలు ఊహించలేదు. ఆ మాటే వాళ్లతో అన్నాను.

మునుస్వామి గట్టిగా నవ్వుతూ... **'ఇక్కడ నేటికీ ఎనిమిదన్నర లక్షల మందిమి తెలుగు వాళ్లం ఉన్నాం. కానీ మమ్మల్ని కూడా కలుపుకుని తమిళులు 19 లక్షల జనాభాగా చెపుతున్నారు. దాంతో మాకు, మా తల్లి భాషకు ఎలాంటి గౌరవం, ప్రత్యేకత లేకుండా పోయింది.** చిన్ననాడు మా గురువుగారు 'సేతుపతి' ప్రతి తెలుగు ఇంటికీ వెళ్లి అక్షరాలు నేర్పించేవారు. ఆయనతోనే అదంతా పోయింది. ఇప్పుడు తెలుగు రాయడం కాదు కదా పలికే వాళ్లు కూడా తక్కువయ్యారు. ఇంకొన్నేళ్లయితే మేం కూడా పోతాం. మా ఈ కొద్దిపాటి తెలుగు కూడా ఈ నేల నుంచి మాయమైపోతుంది. **మీ దేశం వాళ్లు కాస్త మమ్మల్ని పట్టించుకోవాలి. ఓ తెలుగు మండపం నిర్మించి అందులో ముఖ్య పండగలప్పుడు తెలుగు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలి. ఈ నేలతో రాకపోకలు సాగించాలి.** అప్పుడే శ్రీలంకలో తెలుగు బాగుపడతాది.'

'అవును, మనుస్వామిగారు మీరు చెబుతోన్నది వాస్తవం. శ్రీలంకలో తెలుగు వాళ్లు ఉన్నట్టుగా నాకస్సలు తెలియనే తెలియదు. ఇండియా తిరిగి వెళ్లాక నాకు సాధ్యమయినది చేస్తాను. రాజధానిలో ఓ ఆడిటోరియం అదే మండపాన్ని కట్టించి ఈ దేశంలో తెలుగు భాషాభివృద్ధికి పాల్పడదాం.' భరోసా ఇస్తూ మాట్లాడా. కానీ ఆ పెద్ద పని నావల్ల అవుతుందో లేదో తెలియదు.

'చీమల గస్స, తెలుంగు నగర్, అల్లం పల్లి... లాంటి స్వచ్ఛమైన తెలుగు పేర్లతో ఇక్కడ ఊర్లు ఉన్నాయి. కొలొంబోలో మేమందరమూ కలిసి 'అఖిల శ్రీలంక తెలుగు కాంగ్రెస్' పేరున రాజకీయ పార్టీ కూడా ఏర్పాటుచేశామ'ని మాణిక్యం చెప్పాడు.

నేను అస్సలు నమ్మలేకపోయా. కనీసం వార్తాపత్రికలు కానీ టీవీ ఛానళ్లు కానీ ఈ విషయాన్ని పట్టించుకోలేదు. ఆలోచనలో ఉండిపోయా.

లచ్చిమి బయల్దేరుదామా అంది. నలుగురం కలిసి ముందుకు సాగుతున్నాం.

'సి గిరియా' పేరు ఎలా వచ్చిందో గమనించారా' మునుస్వామి అడిగారు.

'ఎలా వచ్చుంటుంది?'

'సి అంటే శ్రీ, గిరి అంటే కొండ... రెండూ కలిపితే శ్రీపర్వతం అంటే మన నాగార్జునకొండ పేరునే ఈ కొండకు పెట్టుకుని ఉండారని మా గురువు సేతుపతి చెప్పేవాళ్లు. అలాగే ఇక్కడి ప్రసిద్ధ టూరిస్టు ప్రదేశం క్యాండి. అప్పట్లో కండి కోట అనే పిలిచేవారంట. మన కడప దగ్గరున్న 'గండి కోట' ఇక్కడ కండి కోటగా మారింది. ఈ కండి కోటనే కాదు గండి రాజ్యాన్ని పరిపాలించింది కూడా నాయక రాజులే. వాళ్లకీ వీళ్లకి ఏమైనా సంబంధాలు ఉండేవో. ఇక్కడ మరో టూరిస్ట్ ప్రదేశం డంబుల్లా. క్రికెట్ అభిమానులకు బాగా తెలిసిన ప్రదేశం. శ్రీలంకలో జరిగే అంతర్జాతీయ క్రికెట్ మ్యాచులకు వేదికగా ఉంటుంది ఆ నగరం. అక్కడ రాతిగుహల్లో బుద్ధుడి విగ్రహాలు ఎన్నో ఉన్నాయి.'

'మేం దాన్ని బండూల్ల అని పిలుస్తాం' లచ్చిమి ఉత్సాహంగా చెప్పింది.

'అవును మన తెలుగు బండే తిరగబడి డంబుల్లాగా అయిందని మా పెద్దోళ్లు చెప్పేవారు'.

'అంటే ఓ చోట గండి... కండిగా మారింది, మరో చోట బండ... డంబ గా మారింది. భాషలో ఇలాంటి జిమ్మిక్కులు సాధారణమే. తెలుగు నేలతో శ్రీలంకకు ఉన్న అనుబంధం గురించి ఎంతో



పరిశోధించాల'ని తేల్చినట్టుగా అన్నాను.వాళ్లందరూ నిజమేనని తలూపారు.

'సి గిరియాలో అత్యంత ముఖ్యమైన చిత్రాల దగ్గరికి చేరుకున్నాం. ఇది కొండకు పశ్చిమ ముఖం. ఒకప్పుడు ఇక్కడ ఈ గోడ నిండా ఇలా 500 వందల దాకా పెయింటింగులు ఉండేవట. నేడు పంతొమ్మిది మాత్రమే మిగిలాయి. వీటిని అయిదో శతాబ్దిలో చిత్రించారని చెబుతారు. వీళ్లు రాజు కశ్యపుడి రాణులై ఉండవచ్చన్నది ఎక్కువ మంది ఒప్పుకొనే సిద్ధాంతం. అజంతా చిత్రాల మాదిరిగా వీటిని చిత్రించార'ని మునుస్వామి అక్కడి గోడ మీద ఉన్న అద్భుత పెయింటింగ్స్ గురించి వివరించాడు.

అజంతా పెయింటింగ్స్ నేను చూడలేదు కానీ సి గిరియా చిత్రాలు అత్యద్భుతం. అన్నీ స్త్రీలవే. అప్సరసల్లా అన్పిస్తున్నారు. ఒక పెయింటింగ్ ఉన్నట్టు మరొకటి లేదు. వీళ్లంతా రాణులు, రాకుమారీలు, చెలికత్తెలుగా వాళ్ల వేషధారణని బట్టి అర్థం చేసుకోవచ్చు.

చాలా మంది ఆ చిత్రాలతో సెల్ఫీలు తీసుకుంటున్నారు. కాలగతిలో కరిగిపోకుండా మిగిలిన చిత్రాలనైనా పరిరక్షించుకొనేందుకు శ్రీలంక ప్రభుత్వం గట్టి ప్రయత్నాలే చేస్తోంది. ఎండా వానా పడకుండా కొండకి వాలుగా పరదాలను ఏర్పాటుచేశారు. ఏకకాలంలో గుంపుగా కాకుండా కొద్ది మందిని మాత్రమే పెయింటింగ్స్ దగ్గరకి అనుమతిస్తున్నారు.

మేం కూడా వాటి దగ్గర ఫోటోలు తీసుకుని ముందుకు వచ్చేశాం. కాసేపటికి చిన్న పాటి మైదానం వచ్చింది. కూర్చోడానికి ఇనుప బెంచీలు కూడా వేసి ఉన్నాయి. సెక్యూరిటీ గార్డులూ ఉన్నారు. కొండ పైకి వచ్చేశామని రిలాక్స్ గా ఫీల్ అయి, అదే మాట లచ్చిమితో అన్నా.

'లేదు సూర్య, ఇది సిగిరియా కొండ మధ్య ప్రాంతం. దీన్ని 'గేట్ వే ఆఫ్ సిగిరియా' అంటారు. ఇక్కడి నుంచి కోటకు అస్సలు దారి మొదలవుతుంది. చూడు ఈ సింహ పాదాలు.. మెట్లు'

పెద్ద పెద్ద రాతి సింహ పాదాల మధ్యలో రెండడుగుల ఎత్తున మెట్లు ఉన్నాయి.

'ఆ మెట్లు ఎక్కడం చాలా కష్టం. పెదనాన్న ఆరోగ్యానికి మంచిది కాదు. మేమిక్కడే ఆగిపోతాం' అన్నాడు మాణిక్యం. మునుస్వామి



అక్కడి బల్ల మీద కూర్చుని సేద తీరుతున్నాడు.

లచ్చిమి నన్ను చూసింది 'మీరు ఎక్కగలరా?' అన్న ధోరణిలో.

'నాకు కొండ పైదాకా వెళ్లాలని ఉంది. మనం వెళదామా' అన్నాను. తను సరేనంది. ఇద్దరమూ మాణిక్యం, మునిస్వామిల దగ్గర సెలవు తీసుకుని బయల్దేరాం. మాణిక్యం, నేనూ పరస్పరం ఫోన్ నెంబర్లు తీసుకున్నాం.

ఆ సింహం పాదాల మెట్ల దారి నుంచి కొండ పైకి ఎక్కడం ప్రారంభించాం. ఇక్కడో విషయం చెప్పాలి. వీళ్లు కొండను తొలచకుండా పక్కన ఇనుముతో చేసిన కృత్రిమ మెట్లను ఏర్పాటు చేశారు. ఆ మెట్లు ఆకాశానికి నిచ్చెన వేసినట్టుగా వాలుగా ఉన్నాయి. లచ్చిమి సునాయసంగానే ఎక్కుతోంది. నేను రెయిలింగ్ ను పట్టుకుని ఒక్కో మెట్టు ఎక్కుతున్నా. నా గుండె బయటకి వచ్చి కొట్టుకుంటున్నట్టుగా అన్పిస్తోంది. అనవసరంగా పైకెళదాం అని చెప్పానే అని బాధపడుతున్నా. ఒక్కో మెట్టు దగ్గర కనీసం రెండు నిమిషాలు ఆగితే కానీ ముందుకు అడుగుపెట్టలేకపోతున్నా. అంత కష్టంగా ఉంది ఆ మెట్ల దారి. అందరిదీ అదే పరిస్థితి. ఇంకాస్త దూరమే అని లచ్చిమి ఊరడిస్తోంది. ఆఖరికి అతి కష్టం మీద కొండ పైకి వచ్చాం.

మనసు ఒక్కసారిగా గాల్లో తేలినట్టు అయింది. మేఘాలు వచ్చి తాకి హాయ్ అని పలుకరిస్తున్నాయి. ఆ అతి చల్లని గాలి ఇంత వరకూ నేను పడ్డ కష్టాన్ని పటాపంచలు చేసింది. అక్కడి శిథిల గోడలు... ప్రాకారాలు.. పైకప్పులు లేని కోటలా అన్పిస్తోంది. ఆశ్చర్యం కలిగించేలా అంతెత్తున సరస్సులూ ఉన్నాయి. అవి ఎండిపోలేదు నీళ్లతో కళకళలాడుతున్నాయి. తామరలు కూడా విరబూశాయి. ఎంతో మంది టూరిస్టులు ఆ శిథిలాల మధ్య తిరుగుతూ, ఆకాశాన్ని తాకుతున్నట్టుగా గట్టి గట్టిగా అరుస్తున్నారు. వాళ్ల కళ్లల్లో ఏదో మెరుపు.. మహాద్భుతాన్ని జయించాం అన్నంత సంతోషం. నాలోనూ తెలియని ఉద్వేగం. **ఈ 21వ శతాబ్దిలో కొండ పైభాగానికి రావడానికి నేను ఇంత కష్టపడ్డాను. మరి 5 వ శతాబ్దిలో కశ్యపుడు, అతడి సపరివారం ఇక్కడ ఎలా బస చేశారో? అలా మిన్నకుండిపోయా.**

'కాసేపు సేద తీరుతారా' అని లచ్చిమి అడిగింది.

'లేదు, ఈ కోటంతా తిరుగుదాం' అంటూ కొత్త హుషారుతో ముందుకు వెళ్లా. తనూ నా వెనకే వస్తోంది.

ఓ నిర్మాణం మెట్లు ఎక్కుతూ పడబోయాను. లచ్చిమి నా ఎడమ



జబ్బును గట్టిగా పట్టుకుని ఆపేసింది. లేకపోతే పడిపోయేవాడినే. పెద్ద ప్రమాదం నుంచి తప్పించుకున్నాను. తను మాత్రం ఒక్కసారిగా కింద కూర్చుండిపోయింది. స్పృహకోల్పోయింది.

నాకు వెంటనే ఏం చేయాలో తోచలేదు. మొఖం పై నీళ్లు చల్లుతూ

కంగారుగా 'లచ్చిమి, లచ్చిమి...' పిలుస్తూనే ఉన్నా.

ఓ అయిదు నిమిషాల తరవాత మెల్లగా కళ్లు తెరిచింది.

'సూర్యా, నా కోసం ఇంత దూరం వచ్చావా. ఇప్పుడైనా ఆ కలువ పూవును తెంచుకొస్తావా' అని నవ్వుతూ అడిగింది.

ఒక్కసారిగా జరుగుతున్నదేమిటో అర్థం కాలేదు. మరుక్షణం మనసు పట్టలేని ఆనందం.

'లచ్చిమీ, గుర్తుకు వచ్చిందా నువ్వు ప్రవల్లిక వనీ, నువ్వంటే నాకు ప్రాణమని...'

తను తలూపుతూ 'సూర్యా.....' అంది.

పక్కనే ఉన్న సరస్సులోంచి ఎర్ర కలువను తుంచి తన ముందు కుడికాలి మోకాలిపై కూర్చున్నా....

'లచ్చిమీ... ఐ లవ్ యూ.. నన్ను పెళ్లి చేసుకుంటావా' వెంటనే ప్రొపోజ్ చేశాను.

తను పువ్వును అందుకుని 'సూర్యా, ఐ లవ్యూ' అంది. నా ఎడమ చేతి జబ్బపై ఉన్న పచ్చబొట్టును చూపిస్తూ.. మన గతం అంతా గుర్తుకు వచ్చేలా చేసింది ఇదే అంది. మనసులో మళ్లీ ఓసారి మగాడికి ధన్యవాదాలు తెలియజేశా. నా కలలో నేటి థాయిలాండ్‌లోని హరిపుంజాయి రాజ్యంలో నేనూ ప్రవల్లికా క్రీస్తు శకం ఏడో శతాబ్దిలో కలుసుకుని, విడిపోయాం. తెల్ల కలువను కోస్తూ బురదలోకి కూరుకుపోయా. అదంతా కలలా నాకు తరవాత అర్థం అయింది. కానీ కలలోని ప్రవల్లికే నాగార్జున కొండ దగ్గర బోటులో కన్పించింది. శ్రీలంకకు చెందిన ఆమెను ఎలాగైనా కలుసుకుని నా కథంతా తెలియజేసి పెళ్లిచేసుకోవాలని అనుకున్నా. దాని కోసమే ఇంత దూరం వచ్చింది కూడా. అయితే నేను కథ చెప్పే అవసరం లేకుండా నా చేతి మీద ఉన్న హంసగుర్తు పచ్చబొట్టును తాకగానే ఆమెకు గతం గుర్తుకువచ్చింది. అంటే తనకూ నా లాంటి కలే వచ్చి ఉండాలన్న మాట. నేడు సి గిరియా కొండ మీద మేం మళ్లీ కలిశాం. కోయదొర రూపంలో ఉన్న మగాడు పచ్చబొట్టు వేసిందీ నాగార్జునకొండే.

ఎంతో సంతోషంగా సీగిరి కొండ దిగి వచ్చేశాం. అదే హుషారులో ఊరుకీ వచ్చేశాం. పెద్ద వాళ్లకి మా మనసులోని మాట చెప్పాం. ఒక్కగానొక్క కూతుర్ని అంత దూర దేశం పంపించాలా అని ఎర్రన్న కాస్త బాధపడ్డారు. మసన్నా, వదినా చాలా సంతోషించారు. హైదరాబాద్‌లోని అమ్మానాన్నలకు విషయం చెప్పా. వాళ్లు వెంటనే వచ్చారు. వారం రోజుల్లో మా పెళ్లి అయింది. మేం ఇండియా వచ్చేశాం. లచ్చిమితో పాటు వాళ్ల చుట్టాలు కూడా వచ్చారు. శ్రీలంక యువతిని పెళ్లిచేసుకున్న తెలుగు యువకుడు అని పేపర్లలో వార్తలొచ్చాయి. టీవీ ఛానల్ల వాళ్లందరూ మా ఇంటి ముందు వాలిపోయారు. లచ్చిమిని చూసి ఆశ్చర్యపోయారు. శ్రీలంక మూల జాతీయుల్లో అహికుంతికలు అనే తెలుగు మాట్లాడే వారు ఉన్నారన్న విషయం అలా అంతటా పాకింది. లచ్చిమి, మసన్న, ఎర్రన్నల ఇంటర్వ్యూలు అచ్చయ్యాయి. మొత్తానికి మా పెళ్లి తెలుగు రాష్ట్రాల్లో పెద్ద సంచలనం.

నేనూ, లచ్చిమి హనీమూన్‌కు థాయిలాండ్‌లోని లంపూన్‌కే వెళ్లాం. చామదేవి సమాధి ముందు తను ధ్యానంలో చాలా సేపు కూర్చుండిపోయింది. గత జన్మ స్మృతులు ఆమెను ఆవహించినట్టున్నాయి. నేను ఆలోచనల్లో ఉండిపోయా. మయన్మార్, థాయిలాండ్, కాంబోడియా, వియత్నాం, ఇండోనేషియా, శ్రీలంకల్లో తెలుగు జాతికి సంబంధించి చాలా ఆనవాళ్లు ఉన్నాయి. కానీ వాటి గురించి తెలుగు వాళ్లకి అస్సలు తెలియదు. ఇదంతా ఎలాగైనా అందరికీ తెలిసేలా చేయాలి? అని తీర్మానించుకున్నాను.

ఇండియా వచ్చాకా అదే పనిలో ఉండిపోయా. అమ్మానాన్నలకి లచ్చిమి ఎంతో నచ్చింది. వాళ్ల తలలో నాలుకలా మెదలసాగింది. అందుకే నేను తీరిగ్గా నా ప్రాజెక్టుపై వర్క్ అవుట్ చేయడం ప్రారంభించా. ఆగ్నేయాసియాలో తెలుగు జాతి ఆనవాళ్లపై ఓ థీమ్ పార్క్‌కు రూపకల్పన చేశా. దానికి కావలసిన పది ఎకరాల నేల, తగిన బడ్జెట్ కోసం కార్పొరేట్ ఫండింగ్ కోసం వివిధ సంస్థలని ఆశ్రయించడం మొదలుపెట్టా. ఏయే దేశాలలో ఏవి ఉన్నాయో వాటిని మన తెలుగు నేల మీద ఎలా తీర్చిదిద్దాలో డిజైన్లతో సహా కంప్యూటర్‌లో గీసి, సాఫ్ట్ కాపీ తయారుచేశా. ప్రాజెక్టు రిపోర్టులతో పాటు పీపీటీ ప్రజెంటేషన్ రూపొందించా. తెలుగు భాషాభిమానులెవరైనా ముందుకు రాకపోతారా అని ఎంతో మందిని కలుసుకున్నా. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, చెన్నై, బెంగళూరు ఇలా వివిధ నగరాలలోని పారిశ్రామికవేత్తలని కలుసుకుని వాటిని చూపించా. 'కాంటెంపరరీ ఇష్యూ అయితే బాగుంటుంది... తెలుగు వాళ్లకి హిస్టరీ అంటే ఆసక్తి ఉంటుందా? రెవెన్యూ మోడల్ కాదే? ఈకాలంలో ఇవన్నీ కష్టం... ఇలా ప్రతి ఒక్కరూ ఏదో ఒకటి చెబుతూ దాటేశారు.

నెలలు గడిచిపోయాయి. మాకు బాబు పుట్టాడు. వాడికి శ్రీవిజయ్ అని పేరుపెట్టాం. శ్రీలంకలో తొలి రాజు, మన

శ్రీకాకుళానికి చెందిన విజయుడి గుర్తుగా. తెలుగు థీమ్ పార్క్ గురించి నా ప్రయత్నాలని మానుకోలేదు. 'పక్క రాష్ట్రాలలో పుట్టాల్సిన వాడివి రా. తెలుగు గడ్డ మీద పుట్టి తప్పు చేశావ్. ఇక్కడ మాతృభాషాభిమానుల్ని జల్లెడ వేసి వెదికినా దొరకుతారా' అనే వాళ్లు నా స్నేహితులు. అంతా నిరాశే. ఆఖరుకి ముఖ్యమంత్రులను కలుసుకోవడానికి ప్రయత్నించా. కానీ ఓ థీమ్ పార్క్ నిర్మాణం కోసం సీఎం అపాయింట్మెంట్ దొరకదు అని చెప్పేశారు.

వైజాగ్ నుంచి హైదరాబాద్‌కి విమానంలో వస్తుంటే ఓ వ్యాపారవేత్త కలిశారు. మాటల మధ్యలో ఏం చేస్తుంటారని ప్రశ్నించారు. నా థీమ్ పార్క్ గురించి వివరించా. ఆయన శ్రద్ధగా విన్నారు.

'ఆ థీమ్ పార్క్ అయ్యేందుకు ఇంకో పదేళ్లు... ఇరవై ఏళ్లు పట్టవచ్చు. మీరు ఏం చేయాలని అనుకుంటోంది పీపీటీ రూపొందించారు. ఫండింగ్ కోసం పెద్ద పెద్ద వాళ్లకీ చూపిస్తున్నారు. అయితే మీరు ఏం చేశారు, ఏం చేయదలచుకున్నారో సామాన్య ప్రజలకి చేరనేలేదు. అసలు మీరెవరో కూడా ఎవరికీ తెలియదు. మొదట మీ గురించి మీరు చేస్తోన్న గొప్ప పని గురించి అందరికీ తెలిసేలా చేయండి. ముందు మీ కలంతా ఓ నవలగా రాయండి. ఓ మంచి పత్రికలో ప్రింట్ చేయించండి. మీరెవరో ప్రపంచానికి తెలుస్తుంది. మీకో పేరు వస్తుంది. దాన్ని బట్టి ఎదుటి వ్యక్తి తీరులో మార్పుకచ్చితంగా కన్పిస్తుంది. మీరేం చేయాలని అనుకుంటున్నారో ఆసక్తిగా వింటారు. మీ నవలకు వచ్చే స్పందనను బట్టి సినిమా తీస్తామని నిర్మాతలే మీ ఇంటికి క్యూ కట్టవచ్చు. అనుభవంతో చెబుతున్నా నా మాట వినండి నవల రాయండి. మీరు ఇంజనీర్నని, కథలు రాసే అలవాటు లేదని అనుకోవద్దు. తెలుగు తల్లి మీ చేత ఆ పనిని నిర్విఘ్నంగా చేయిస్తుందనే నమ్మకం నాకుంది' అని ఆయన చెప్పారు.

ఆయన మాటలు నాపై మ్యాజిక్ చేశాయి. 'జగము నేలిన తెలుగు టైటిల్ తో గోదావరి నుంచి జావా దాకా ట్యాగ్ లైన్ తో..' పేరుతో నవల రాయడం మొదలుపెట్టా. ఓ ప్రముఖ పత్రికలో ధారావాహికగా రాసాగింది. దానికి విశేష స్పందన లభించింది. ఎక్కడి నుంచో భాషాభిమానులు ఫోనులు చేసి అభినందించేవాళ్లు.

ఏడాది పాటు నడిచిన ఆ ధారావాహిక పూర్తయిన తరవాత నవలగా అచ్చువేయించాను. అది ప్రింట్ అయిన వారం రోజులుల్లోనే మొత్తం కాపీలు అమ్ముడుపోయి రీప్రింట్ కి వెళ్లింది. డిజిటల్ మార్కెట్‌లో హాట్ కేక్ లా నిలచింది. అంతర్జాతీయంగా నా పేరు మార్మోగిపోయింది.

ఒకరోజు వీరనారాయణ అనే వ్యక్తి నుంచి ఫోన్ కాల్ వచ్చింది. కలిసేదాకా తెలియదు ఆయన రాష్ట్రపతి తమ్ముడని. ఆయనకి నా కథంతా వివరించా. ఇలా అనేక దేశాలలో మగ్గిపోతున్న తెలుగు జాతి ఆనవాళ్లని ఓ థీమ్ పార్క్ గా రూపొందించి భవిష్యత్ తరాల కోసం నిక్షిప్తం చేయాలని. ఆ ఐడియా ఆయనకెంతో నచ్చింది. రాష్ట్రపతిని కలిసేందుకు దిల్లీ వెళ్దామని సిద్ధంగా ఉండమని చెప్పారు.

ఓ ఉదయం ఇద్దరం దిల్లీకి వెళ్లాం. రాష్ట్రపతి భవన్ కు నేను అతిథిగా వెళతానని అస్సలు ఊహించలేదు. ఎనభై రెండేళ్లయినా రాష్ట్రపతి తల్లాప్రగడ సత్యనారాయణగారు ఎంతో చలాకీగా ఉన్నారు. హాల్లో సోఫాలో కూర్చున్న ఆయన్ని చూడగానే గౌరవం ఉప్పొంగింది. రెండు చేతులూ జోడించి నమస్కరించాను.

'థాయిలాండ్‌లో కలలో కన్పించిన అమ్మాయినే మీరు శ్రీలంకలో వెతికి పట్టుకుని నిజజీవితంలో పెళ్లిచేసుకోవడం చాలా ఇంట్రెస్టింగ్ గా అన్పించింది. ఐ అప్రిషియేట్ యువర్ ఎఫర్ట్స్... ' అని ఆయన చెప్పగానే ఆశ్చర్యపోయా.

రాష్ట్రపతికి నా గురించి ఇంత వివరంగా తెలుసా అని.

సూర్యా, మీ థీమ్ పార్క్ కి 'శ్రీపర్వతం' అని పేరు పెట్టా. మయన్మార్ - మన్ రాజ్యాలు; థాయిలాండ్ - హరిపుంజాయి, ద్వారావతి; కాంబోడియా - అంగ్ కార్ వాట్; వియత్నాం -మిసన్ సిటీ; ఇండోనేషియాలోని బొరొబుదూర్; శ్రీలంకలోని కండి కోట నిర్మాణాల రెప్లికాలను మన ఈ థీమ్ పార్క్‌లో ఆవిష్కరిద్దాం. దీంతో పాటు శాతవాహనుల నుంచి కుతుబ్ షాహీల వరకూ ప్రతి వందేళ్లకూ ఓ బిట్ గా తీసుకుని ఆయా సమయాల ముఖ్యమైన ఘట్టాల మినియేచర్లనూ రూపొందిద్దాం. ఈ ప్రాజెక్టంతా వంద ఎకరాలలో వంద కోట్ల రూపాయల బడ్జెట్ తో రూపొందుతుంది. నాలుగేళ్లలో పూర్తవుతుంది. లంచ్ కు ఇక్కడికి తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులిద్దరూ వస్తున్నారు. వాళ్లకి మిమ్మల్ని పరిచయం చేస్తాను.' ఏ ప్రాజెక్టు గురించైతే మాట్లాడాలని అనుకున్నానో రాష్ట్రపతే దాని గురించి మాట్లాడేసరికి నేను సంభ్రమాశ్చర్యాలకి లోనయ్యా. వీరనారాయణగారు ముసిముసిగా నవ్వుతున్నారు.

'సూర్యా, తెలుగు జాతికి సంబంధించి నీ నవల లాంటి కథని ఈ యాభై ఏళ్లలో చదవలేదు. ప్రతి నెలా ఏ దేశంలో తెలుగు ఆనవాళ్ల గురించి రాస్తావా అని ఎదురుచూశాను. అయితే ఈ థీమ్ పార్క్ గురించి మాత్రం మొన్న వీరనారాయణ చెప్పాడు. అందరి కథకుల్లాగా నువ్వూ ఓ నవల రాసేసి ఊరుకుంటావని అనుకున్నాను. కానీ నువ్వు వేరు అని అర్థం అయింది. అసలు అది నీ ప్రాజెక్టు కాదయ్యా... మన తెలుగు జాతి అందరిదీ. తెలుగు రాష్ట్రాలు రెండూ ఉమ్మడిగా ఆ ప్రాజెక్టును టేకప్ చేస్తాయి. నేను ఛైర్మన్ గా ఉంటాను. నువ్వు ఈ ప్రాజెక్టుకి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గా ఉంటావ్. కాబట్టి నువ్వు ఇకపై నేరుగా వచ్చి కలవొచ్చు. తెలుగు వాడిగా పుట్టి రాష్ట్రపతినయ్యాననే గర్వం ఉంది కానీ తెలుగు నేలకు ఏం చేయలేదనే వెలితి ఇంతకాలమూ ఉండేది. ఈ థీమ్ ప్రాజెక్టుతో ఆ వెలితి తీరుతుంది. తెలుగు జాతి ఘనకీర్తి చరిత్రను అలా మనం నలుదిక్కులా చాటి చెపుదాం.'

'థాంక్యూ వెరీ మచ్ సర్' అంతకన్నా నా నోటి నుంచి మరే మాటలు రావడం లేదు ఒకలాంటి ట్రాన్స్‌లో ఉండిపోయా.

'తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు వెయిట్ చేస్తున్నార'ని రాష్ట్రపతి సెక్రటరీ తెలియజేశాడు.

'లంచ్ కి వెళదాం రండి' అంటూ రాష్ట్రపతి మమ్మల్ని ఆహ్వానించారు.

(ముగింపు: వచ్చే సంచికలో...)

# మాతృభాషా మాధ్యమ అంతర్జాల వేదిక
## తెలుగు జాలవేదిక 24వ సమావేశం(వెబినార్)

**మాతృభాషామాధ్యమ అంతర్జాల వేదిక తెలుగు వెబినార్ (జాలవేదిక) ప్రతీ ఆదివారం సాయంత్రం గం.4.30నికు జరుగుతున్న సంగతి 'అమ్మనుడి' చదువరులకు తెలిసిందే. ఈ నవంబరు 1వ తేదీన ఈ విధంగా జరిగిన సమావేశాన్ని జర్మనీ నుండి శ్రీగణేష్ తొట్టెంపూడి గారు నిర్వహించారు. హైదరాబాద్‌లో ఉండే ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావుగారు అధ్యక్షత వహించగా, వివిధ ప్రాంతాల్లో ఉండే రచయితలు, ఆచార్యులు, పరిశోధక విద్యార్థులు, ఉద్యమకారులు, ఉపాధ్యాయులు, తెలుగు అభిమానులు పాల్గొన్నారు. ఆచార్య రాజ్యరమ గారి ప్రధాన ప్రసంగం చేశారు. వారి ప్రసంగ సారాంశాన్ని వారి మాటల్లోనే ఒక వ్యాసంగా ఈ సంచిక 9,10 చదవండి. చర్చలో పాల్గొన్న వారిలో కొందరి ఉపన్యాసాల సారాంశాన్ని ఇక్కడ క్లుప్తంగా ఇస్తున్నాను. దయచేసి చదవండి. ప్రతీ ఆదివారం సాయంత్రం గం.4:30ని. కు ఈ సమావేశం జరుగుతోంది. అందరూ పాల్గొనవచ్చు.**

**ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు:**

భాషను నేర్పించేటప్పుడు లేదా భాష నేర్చుకునేటప్పుడు సానుభూతి లేదా సానుకూల దృక్పథం ఉండాలి. అది భాషను నేర్చుకోవడానికి ఒకరకంగా దోహదం చేస్తుంది. కానీ నేర్చుకునే పిల్లల ఆర్థిక స్థితిగతులు సమాజంలో వారి యొక్క స్థాయి లాంటివి విద్యార్థులపైన చాలా ప్రభావం చూపిస్తాయి. ఆ పరిస్థితిల్లో వారు నేర్చుకునే విషయాలు బయటపడతాయి. వచ్చిన పంతులుగారు బాగానే ఉంటారు, పాఠశాల పరిస్థితులు బాగానే ఉంటాయి, కానీ విద్యార్థుల యొక్క ఆర్థికస్థితి వారి ఇంటికి తిరిగి వెళితే పాఠశాలలో నేర్చుకున్న పాఠాలు నెమరు వేసుకోవడానికి అనుకూలమైన పరిస్థితి ఉండదు. ఈ విధంగా 20-30 శాతం మంది విద్యార్థులు ప్రభుత్వబడుల్లో ఉంటారు. భాషాబోధనలోనే మాత్రమే కాదు సమాజంలో కూడా మార్పు తీసుకురావాలి. భాషాబోధనలో సాంకేతికత కన్నా ఇలా సమాజంలో తెచ్చిన మార్పు ఎంతో దోహదం చేస్తుందని, విద్యార్థుల కుటుంబ నేపథ్యం కూడా కీలకపాత్ర పోషిస్తుంది

1960, 1970 , 1980లలో అట్టడుగు స్థాయిలో ఉన్న పేదలు బడులకు రావడం చాలా తక్కువ శాతంలో ఉండేది. కేవలం 20 నుంచి 30 శాతం మాత్రమే ఉండేది. నేడు కూడా 100% అట్టడుగు స్థాయిలో ఉన్నవారు విద్యను అభ్యసించడం లేదు. దానికి ప్రత్యక్ష ఉదాహరణ నేటికీ మన తెలుగు రాష్ట్రాల్లో అక్షరాస్యత 60 - 65 శాతం ఉండడమే. నేడు అనేక మంది బడులలో చేరుతున్నా వారికి కావలసిన నైపుణ్యాన్ని అందించేవారు లేరు. ఇంకొకటి ఈ రోజు ఇంగ్లీషు ప్రభావం ఎక్కువగా పెరగడం. పాఠశాలల్లో కూడా కొత్తరకం పాఠశాలలు రావడం, మా పాఠశాలల్లో చదువుకుంటేనే మీకు అత్యధిక మార్కులు వస్తాయి అని నమ్మించే నారాయణ, చైతన్య వంటి పాఠశాలు రావడంవల్ల కేవలం మార్కులు సాధించడమే ప్రథమ లక్ష్యం అయిపోయింది. పైతరగతుల్లో కూడా సీట్లు మా పాఠశాలల్లోనే చదివితే వస్తాయని నమ్మించడం జరుగుతున్నది. నేడు కేవలం బట్టీపట్టిన చదువు ఉంటున్నది. బోధన మీద ప్రత్యేక శ్రద్ధ లేకుండా కేవలం మార్కుల పైన వ్యామోహాన్ని పెంచుతున్నారు. అలాగే తల్లిదండ్రుల మనస్తత్వాన్ని కూడా మార్చడం జరిగింది....

**ఆచార్య వెన్నెలకంటి ప్రకాశం :**

ఆచార్య వెన్నెలకంటి ప్రకాశం గారు వారి జీవితంలోని అనుభవాల్ని పంచుకుంటూ ఎకడమిక్స్‌లోనే రెస్ట్రిక్టెడ్ కోడ్, ఎలాబరేటెడ్ కోడ్‌కి అనుసంధానం చేశారు. ఆచార్య వెన్నెలకంటి ప్రకాశం గారు వారి సతీమణితో పటియాలలో ఒక ఇంటికి వెళ్ళినప్పుడు ఆ ఇంటి మెట్లు ఎక్కుతున్నప్పుడు ఇంటిలో నిశ్శబ్దం ఆవహించింది. ఇంట్లో ఎవరూ లేరని వారికి అనిపించింది. కానీ ఇంటిలో కొడుకు కూతురుతో పాటు తల్లిదండ్రులు మేడపై కూర్చున్నారు. నలుగురు ఉన్నా నిశ్శబ్దానికి గల కారణం ఏమిటి అని ఆచార్య వెన్నెలకంటి ప్రకాశం గారు అడిగినప్పుడు, అతడు మీకు భాష వచ్చు కాబట్టి అనర్గళంగా మాట్లాడగలరు కానీ మాకు భాష రాదుగా అని సమాధానం ఇచ్చారు. ఆ సమాధానంతో ఆచార్య ప్రకాశం గారు ఆశ్చర్యపోయారు. సమాధానం ఇచ్చిన మనిషి గోదావరికి చెందినవాడైనా ఉన్నత చదువులు చదివినవాడైనా నిశ్శబ్దంగా ఉండాలని గల కారణం ఆశ్చర్యపరిచింది. కొందరికి మాట్లాడే మనస్తత్వం ఉంటుంది. కొందరికి పనిచేసే మనస్తత్వం ఉంటుంది. దీనికి ఉదాహరణ, బేసిల్ బర్న్ స్టెయిన్, హాలిడే చాలా కాలం పాటు కలిసి పనిచేసిన రెస్ట్రిక్టెడ్ కోడ్, ఎలాబరేటెడ్ కోడ్. కొందరికి బయటికి గట్టిగా చదవడం అలవాటు చేసుకుంటారు, కొందరు మౌనంగా చదవడం అలవర్చుకుంటారు. ఇలా రెస్ట్రిక్టెటెడ్ కోడ్‌కి అలవాటు పడిన విద్యార్థులు తరగతి గదిలో మాట్లాడలేరు, చదవలేరు. అలాంటి విద్యార్థులకు పాఠ్య భాగాలను చేతికిచ్చి బిగ్గరగా చదవమని చెప్పాలి. అప్పుడు చదివిన పాఠం మస్తిష్కంలో ఉండిపోతుంది. తెలుగు రాష్ట్రాల్లోనే కాదు అమెరికాలో కూడా అమెరికా దేశస్థులకు ఇంగ్లీష్ చదవడం రాయడం విద్యార్థులకు కొంత మందికి రాదు. మన భారతీయులు అమెరికాలో పుస్తకం లేకుండా ఇంగ్లీషు వ్యాకరణం బోధించేటప్పుడు ఇంగ్లీషువారు పుస్తకం లేకుండా ఎలా చెబుతున్నారు అని ఆశ్చర్యపోయేవారట. ఈ సమస్య ప్రపంచంలోని

అన్ని దేశాలలో ఉన్నదే. విద్యార్థులకు అవసరమైన పద్ధతులను అవలంబిస్తూ విద్యా బోధన సాగించాలని, తరగతులకు తగిన పాఠాలను పొందుపరచాలని, భాష గురించి తక్కువగా చెబుతూ భాషను ఎక్కువ వాడేలా చేయాలని ఆయన తెలియజేశారు.

**ఆచార్య అయినవోలు ఉషాదేవి :**

పిల్లలు 5వ ఏట ఇంటి నుంచి పాఠశాలకు వెళ్తున్నారు అంటే మాతృభాష, దాని యొక్క వ్యాకరణం తెలియకుండానే మాట్లాడడం జరుగుతుంది. గతంలో ప్రత్యేకించి తెలుగు ఉపాధ్యాయులకు పండిట్ ట్రైనింగ్ స్కూల్స్ ఉండేవి. అందులో పూర్తి శిక్షణ పొంది విద్యార్థులకు తెలుగుని అద్భుతంగా బోధించి స్ఫూర్తి దాయకంగా నిలిచారు. పిల్లలకు వినడము మాట్లాడడమూ నిత్యజీవితంలోని అవసరాలకు తగినట్లుగా వస్తుంది. పదజాలం ఎక్కువగా నేర్చుకోవడానికి పాఠశాల ఒక చక్కటి అవకాశాన్ని కల్పిస్తుంది. 1960లలో చక్కటి విధానాలను భాషాబోధనలో అవలంబించేవారు. నేడు సమకాలీన భాషలో కూడా ఉత్తరాన్ని రాయడం, అర్జీ పెట్టడం, సరైన పదాలను ఖాళీలోనింపడం వంటి పద్ధతులను ఉపయోగించడం వల్ల విద్యార్థులు భాషను అవసరాలకు అనుగుణంగా నేర్చుకోవడం జరుగుతుంది. నీతి చంద్రిక లాంటి చక్కటి అంశాలను బోధించడం వల్ల దానిలోని నీతి తెలియడంతో పాటు వచనాన్ని రాయడం కూడా నేర్చుకోవడానికి సులువుగా ఉంటుంది. ఇలా చందస్సు, ప్రకృతి వికృతి, వ్యాకరణాంశాలు బోధించడం వలన పదవ తరగతి వరకు భాష పైన ఒక అవగాహన వస్తుంది. ప్రతి ఉపాధ్యాయ శిక్షణ కేంద్రంలో కూడా భాషాశాస్త్ర పండితుల బోధన ఎంతో అవసరమని వారు పేర్కొన్నారు.

**శ్రీమతి వనిత :**

(ఉపాధ్యాయురాలు, గిరిజన సంక్షేమ పాఠశాల, ఉప్పల్)

మా పాఠశాలలో విద్యార్థులకు మాడ్యూల్స్ తయారుచేసి పాఠ్య పుస్తకాల రూపంలో తీసుకువస్తున్నాం. చాలా మంది విద్యార్థులు గిరిజన నేపథ్యం నుంచి రావడం జరుగుతుంది. అనేక మంది విద్యార్థులకి చదవడం, రాయడం రావడంలేదు. వారు ఇంటర్మీడియట్ స్థాయికి వెళ్లిన వాళ్లకి చదవడం, రాయడం కష్టం గానే ఉంది. ఉపాధ్యాయులుగా మేము ఎన్నో విధానాలను అవలంబిస్తున్నప్పటికీ, ప్రయత్న లోపం లేకుండా బోధిస్తున్నప్పటికి విద్యార్థుల్లో పూర్తి మార్పు రావడం లేదు. ఇంకా ఎటువంటి పద్ధతులను అనుసరిస్తే మార్పు తీసుకురావచ్చు? అని వారు ప్రశ్నించారు.

**ఆచార్య వెన్నెలకంటి ప్రకాశం :**

విద్యార్థులకు పాఠాలను వల్లె వేయించడం వలన విద్యార్థులకు ఉచ్చారణ బాగా వస్తుంది. దీనివలన కఠినమైన పదాలు నాలుక తిరగడం, ధారాళంగా మాట్లాడడం జరుగుతుంది. ఇంగ్లీషు వాళ్ళు రాసిన సైలెంట్ మెథడ్ ని అంతా సులువుగా నమ్మి అవలంబించ కూడదు. ఆ సైలెంట్ మెథడ్ 40 ఏళ్ల నుంచి ప్రాచుర్యంలో ఉన్నా, దానిలో రెస్ట్రిక్టెడ్ కోడ్, ఎలాబరేటెడ్ కోడ్‌ను పొందుపరచకుండా పరిశోధనలు చేయడం జరిగింది. అయినప్పటికీ సైలెంట్ అనేది తదుపరి దశలో వచ్చేది... మొదటి దశలో కాదు. వేగవంతంగా చదివించడానికి ఆ పద్ధతిని తదుపరి దశల్లో వాడవచ్చు. కాబట్టి పిల్లలకు చిన్నప్పటి నుండే వల్లె వేయించి గట్టిగా చదివించడం ఉత్తమం.

-జె. డి. ప్రభాకర్, పరిశోధక విద్యార్థి
హైదరాబాదు విశ్వవిద్యాలయం, 8500227185

## తెలుగు వెబినార్(జాలవేదిక) నమోదు

**మన** మాతృభాష (అమ్మనుడి) తెలుగును కాపాడుకొనేందుకూ అన్ని రంగాలలో వినియోగించుకొనేందుకూ ఆయా రంగాలలో జరుగుతున్న కృషినీ, పరిశోధనలనూ, విశ్లేషించుకొంటూ ఉద్యమ స్ఫూర్తిని బలోపేతం చేయడం కోసం ఏర్పడిన అంతర్జాల వేదికే **"తెలుగు జాలవేదిక".** దూరతీరాలలోని కార్యశీలురైన తెలుగువారిని ఇంటర్నెట్ సాధనంగా స్మార్ట్ ఫోనుతోనే నడుపుకోగల చర్చావేదిక ఇది. ఏ రంగంలో పనిచేస్తున్న తెలుగువారైనా దీనిలో పాల్గొనవచ్చు.

ఈ జాలవేదికలో పాల్గొనటానికి ఆసక్తి ఉన్నవారు ఈ కింది లింకు నుండి నమోదు చేసుకోగలరు.
https://forms.gle/fDtzQiumfQ1cCxi38

## వార్తలను, విశేషాలను పంపండి

అన్ని రంగాల్లో తెలుగు అమలు కోసం, తెలుగు వారి చరిత్ర, సంస్కృతి, సాహిత్యం తదితర అంశాలపై దేశంలోనూ విదేశాల్లోనూ అనేక మంది వ్యక్తులు, సంఘాలు పలు సభలు, సమావేశాలు, చర్చలు జరుపుతున్నారు. వాటి వార్తలను ఫోటోలతో పంపండి. పుటల అందుబాటును బట్టి క్లుప్తంగా ప్రచురిస్తాము. వీటిని editorammanudi@gmail.com లేదా పోస్టులో/ కొరియర్ సర్వీస్‌లో మాత్రమే పంపాలి. దయచేసి వాట్సయాప్‌లో పంపించవద్దు. వాటిని పరిశీలించలేము. -సం.

**వినియోగించేకొద్దీ భాష వికసిస్తుంది. వాడనిభాష వాడిపోతుంది**

సడ్లపల్లె చిదంబరరెడ్డి
9440073636

# త్రాగుడును కొనసాగించాలా?

**మ**ద్యపానం గురించి విశ్లేషణో....వ్యాసమో కాదిది! సమాజంలో నేను చూసిన నా కళ్ల ముందు జరిగిన నగ్న సత్యాల్ని ఇక్కడ చెప్పదలచుకొన్నాను.

హిందూపురం పట్టణానికి ఆనుకొని ఉన్న వ్యవసాయాధారిత ఒక పల్లె మాది. 1959 నుంచి కాస్త సమాజ అవగాహన ఉంది. 1965 ఆ ప్రాంతంలో యాభైకి పైచిలుకు ఉన్న రైతుల ఇళ్లలో కేవలం రెండు కుటుంబాల ఇంటి యజమానులకు తాగుడు అలవాటు ఉండేది. మిగతా యాభై అరవై కూలీనాలి చేసి బతికే కుటుంబాలలో ఏడెనిమిది కుటుంబాల కాయకష్ట జీవులు మాత్రమే సంత రోజు కల్లు తెచ్చి తాగేవారు. అలా తాగిన వారు ఏదో చెడ్డపని చేసినట్లు గుంభనంగా ఇంట్లో పండుకొనేవారు.

1984 లో నేను ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడై చాలా గ్రామాల్లో పనిచేశాను. అన్ని చోట్లా గ్రామస్తులు సోమరులుగా ఉండకుండా పొలాల పనుల్లో కర్మాగారాల్లో చేతనయిన పనులు చేయగలిగినవారే! అయినా ఆ కుటుంబాల నుంచీ బడికి వచ్చే పిల్లల్ని చూస్తే బీదరికం కొట్టొచ్చినట్లు కనపడేది. కనీసం పేనా, పెన్సిలు, నోటు పుస్తకాలు, సరయినబట్టలు, తలకు నూనె కానీ ఉండేదికాదు. చాలా రోజులు మన సమాజ స్థాయి ఇంతేనేమో అనుకొనేవాడిని.

ఒక పల్లెలో చిన్న మంటపం లాంటి ద్వారాలు లేని ఆవాసంలో బడి నడిచేది. నేను ఏకోపాధ్యాయుడిని. ఒక రోజు అక్కడ చిన్న బ్రాందీ సీసా కనిపించింది. దానిని తీసి "మీ ఊర్లో ఎవరైనా తాగుతారా??" అని ఐదో తరగతి పిల్లల్ని ప్రశ్నించాను. వారు ముసిముసిగా నవ్వుకొంటూ ఒకరి ముఖాలొకరు చూసుకొని "వాళ్ల నాయన...వీళ్ల తాత....ఆ పాపావాళ్ల అవ్వ, వీళ్ల మామ.." అంటూ మొత్తం ఊళ్లో తాగేవారి లిష్టంతా ఏకరువు పెట్టారు. నోరు తెరిచి వినడం నా వంతయింది.

అంతా విన్నాక "అది సరేకానీ మీలో ఎవరైనా తాగుతారా? అది బాగా రుచిగా ఉంటుందా" అని అనునయంగా అడిగాను. కొంత సేపు నిశ్శబ్దం పాటించి ఒక్కొక్కరే బయటపడ్డారు. అంగట్లో కొనుక్కొని రమ్మంటే తెస్తూ దార్లో ఎలా ఉంటుందో రుచి చూద్దామని ఒక్క గుక్క తాగినట్లు, అమ్మా నాన్నలు తాగి గూట్లో దాచిపెట్టి ఉంటే దొంగగా కొంత తాగినట్లు, వాళ్ల అన్నయ్య ఇంట్లో తెలియకుండా తెచ్చి రహస్యంగా గడ్డివామిలో దాచింది చూసి మరో కంటికి కనిపించకుండా మాయం చేసినట్లు....ఇలా ప్రతి పిల్లవాడూ అమ్మాయీ తమ అనుభవాలు చెబుతూ వుంటే విని నాకు మతి పోయినంత పని అయ్యింది.

1990-96 ప్రాంతంలో కర్ణాటక సరిహద్దులో పని చేసేవాడిని. అప్పుడు మద్యపాన నిషేధం ఉండేది. పొరుగునే ఉన్న కర్నాటక నుంచి దొంగగా తెప్పించడానికి చిన్నపిల్లల్నే చాలా మంది పావులుగా వాడేవారు.

ఒక రోజు ఇద్దరు ఐదో తరగతి విద్యార్థులు బడికి హాజరు కాలేదు. మరుసటి దినం వచ్చి వారి గైరుహాజరీకి సరయిన కారణం చెప్పక పోయారు. సమాజం కుళ్లు పూర్తిగా అంటని పిల్లలతో నిజాలు పలికించే రకరకాల విద్యలు ఉపాధ్యాయులుగా మాకు తెలుసు! అలా నిజాలు కక్కిస్తే తెలిసిన అసలు సత్యం.....

బ్రాందీ సీసా తెమ్మని పొరుగున ఉన్న కర్ణాటక పల్లెకు వాళ్ల నాన్న పంపినాడు. ఒకడే వెళ్లలేక మరొకర్ని తోడుగా తీసుకొని వెళ్లి, సీసా కొని వెనుదిరిగి వస్తూ, అది ఎలాగుంటుందో రుచి చూద్దామనే కుతూహలంతో, ఒక చోట సీసా మూత తీసి కొంత తాగినారు. ఖాళీ అయిన వెలితిని నీళ్లతో భర్తీ చేద్దామని చూస్తే ఎక్కడా కని పించలేదు. అంతలో ఒక మెరుపులాంటి ఆలోచన వచ్చింది. వెంటనే ఔంటేలు పోసి అమలు చేయబోయారు. ఆ తొందరలో సీసా జారి కింద పడి పగిలిపోయింది. ఇంటికి వెళ్లి ఏమి చెప్పాలని ఆలోచిస్తూ అక్కడ దారిలో ఉన్న నిమ్మ తోటలోనికి ముళ్లకంచె కిందగా దూరి కొన్ని కాయల్ని దొంగగా కోసి ఒక హోటల్లో అమ్మినారు. ఆ డబ్బు బ్రాందీసీసా కొనడానికి సరిపోలేదు. అక్కడే పారిశ్రామిక వాడలోని ఒక కంపెనీ లోనికి దూరి పాత ఇనుప చువ్వలను తస్కరించి అమ్మి సమస్యనుండి బయటపడినారు!!

చూశారా ఒక్క వ్యక్తి యొక్క తాగుడు వ్యసనం ఇద్దరు పిల్లల్ని ఎంతగా చెడగొట్టడానికి దారి తీసిందో!!

1990 తరువాత సమాజంలో డబ్బు ఉధృతి పెరిగింది. అంతో ఇంతో కష్టపడే ప్రతి వ్యక్తీ ఎంతోకొంత సంపాదన చేసే అవకాశం ఉంది. కానీ ఆ డబ్బంతా మద్యపానానికే ఖర్చయి పోతున్నదని నా అనుమానం.

2015 లో నేను ఇల్లు కట్టాను. మేస్త్రీతో ఒప్పందం కాకుండా తాపీ పనివారినీ,కూలీలనూ దిన వేతనాలిచ్చి దగ్గరుండి కట్టించాను. నా దగ్గర పని చేసిన వారిలో 90 శాతం మంది తమ కష్టార్జితంలో 80 శాతం డబ్బును ప్రతినిత్యం తాగడానికి వెచ్చించేవారే!! తాగుడు అనారోగ్యానికి దారితీస్తుందని నేనంటే "సార్! పగలంతా కష్టపడే మాకు, తాగకపోతే నిద్దురరాదు" అనే వారు.

అయితే తాగని ఒకరిద్దరు మాత్రం తాగే వారికంటే దృఢంగా శ్రమను దాచుకోకుండా నిజాయితీగా పనిచేసేవారు. "సార్! నేను ఇరవై ఏళ్లుగా ఇలా ఇళ్ల కట్టడాల పని చేస్తున్నాను. ప్రతివారం మాంసం తింటాను. ఇంతవరకూ హోటల్లో తిని ఎరుగను. ఇంట్లో చేసింది తిని హాయిగా నిద్రపోతున్నాను. ఇదే సంపాదనతో సొంతంగా ఇల్లు కట్టుకొన్నాను. తాగుడుకు బానిసలు అయినవారు దానిని మానలేక, లేనిపోని సాకులు చెబుతారు" అని తమ నిజాయితీని చెప్పేవారు!

నా వయస్సిప్పుడు 68 సంవత్సరాలు. అరవై యేళ్ల నుంచీ నాకున్న ఊపిరితిత్తుల జబ్బుకు వైద్యులు చెప్పిన మందులు వాడుతూ కులాసాగానే ఉన్నాను. అయితే నా సమకాలికులు, నాకన్నా ఐదారేళ్ల చిన్నవాళ్లలో సగం మంది, నా కళ్ల ముందే కాలమై పోయారు!! కారణం ఒక పద్ధతీ పాడూ లేకుండా విపరీతంగా తాగి చేజేతులా చావును కొనితెచ్చుకోవడమే!! ఇలాంటి ఉదాహరణలు ఎన్నయినా

చెప్పగలను.

చివరికి చెప్పేది ఏమిటంటే ఈ మద్యం మహమ్మారి సమాజాన్ని రోగాలకు గురిచేస్తూ డాక్టర్లనూ, మందుల షాపులనూ బతికించడమేకాక అకాల మరణాలకు కారణమై ఎంతో మంది పిల్లలను అనాథలుగా, భార్యలను వితంతువులుగా ముసలీ ముతకా తల్లిదండ్రుల్ని శోకసంద్రంలో విలపించేవారుగా చేస్తూ ఉంది.

దీనిని దశలవారీగా నిషేధించడం చాలా అత్యవసరం. కరోనా వల్ల మూసివేసిన మద్యం అంగళ్లను మళ్లీ అనుమతించిన ప్రభుత్వాల నిర్ణయం వల్ల జరుగుతున్నదేమిటో చూస్తున్నాం కదా! దీనికి కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు బాధ్యత వహించవద్దా ?!

32 వ పుట తరువాయి.......

## పదనిష్పాదనకళ

జఱిగింది.

ఇది తెలుగుని ఇంగ్లీషుతో పోల్చడానికి కాదని అర్థం చేసుకోవాలి.

చాలామంది ఆ పొఱపాటు చేస్తారు. నార్మన్ రాజుల కాలంలో తప్ప, మిగతా అన్ని కాలాల్లోను, ఇంగ్లీషు ఒక దేశానికి అధికార భాషగా ఒక హోదాని వెలగబెడుతూ వచ్చింది. ఒక దేశానికి జాతీయభాషగా రాజపోషణకీ, దానిద్వారా ప్రజాపోషణకీ అది నోచుకుంది. అందుచేత అది ఎన్ని భాషల ప్రభావానికిలోనైనా తన అస్తిత్వానికి ప్రమాదం రాలేదు. **తెలుగు పరిస్థితి పూర్తి విరుద్ధం. విజయనగర సామ్రాజ్యం అంతరించాక (క్రీ.శ. 1665 ప్రాంతం) అప్పట్నుంచి ఒక అధికారభాషగా తెలుగు యొక్క అధ్యాయం ముగిసిపోయింది. అయినా ఇప్పటిదాకా ఈ భాష బతికే ఉండడం గొప్ప సర్కస్ ఫీటే.** అందుచేత చారిత్రికంగా అడుగడుగునా క్రూరమైన అణచివేతలకు గుఱై, వ్యవస్థాగతంగా అన్యాయానికి బలైన తెలుగుని అభిమానించడం – ఎంత తీవ్రస్థాయిలోనైనా సరే భాషోన్మాదం కాజాలదు.

అందుచేత చిరకాల బాధితురాలైన తెలుగుభాషని నిలబెట్టుకోవడమే మన లక్ష్యంగా ఉండాలనీ, ఆ క్రమంలో భాషని మింగేసే చర్యలకి పాల్పడకూడదనీ, అంతిమంగా మనం మన తెలుగు వ్యాప్తికే ఉపయోగపడాలి తప్ప, ఇతర భాషల భుజకీర్తులకి మెఱుగులు దిద్దే కార్యక్రమంలో పాలు పంచుకోకూడదనీ చెప్పడానికే ఇదంతా వ్రాశాను.

తెల్లదేశాల్లో వారికి తెలిసిన plain language, layman's vocabulary అనే పదాలకి అర్థం వేఱు. మన దేశంలో layman's languageకి అర్థం వేఱు. అక్కడి layman's language మన layman's language కంటే అత్యంత సంపన్నమైనదీ, శక్తిమంతమైనది కూడా. మన దేశంలో వాడుకలో ఉన్న layman's language శాబ్దికంగా ఒక బీదభాష. ఇందులో పదాలు కొద్ది. వ్యక్తీకరణలు పూజ్యం. మన laymen కనీసం ఐదో తరగతి వఱకైనా చదివినవారు కాకపోవడం ఇందుకో కారణం. పదో తరగతి వఱకు చదివినవారిక్కూడా పుస్తక పఠనాసక్తి లేకపోవడం మఱో కారణం. కాబట్టి అలాంటివారిని దృష్టిలో పెట్టుకుని మనం కొత్త పదజాలాన్ని రూపొందించడానికి పూనుకోరాదు. అలా పూనుకుంటే తెలిసిన పదాల గుడుగుడుగుంచంలోనే తిరగాల్సి వస్తుంది.

(తరువాయి వచ్చే సంచికలో...)



పీవీ చతురత:

## ఏమో గుర్రం ఎగరవచ్చు!

పీవీ నరసింహారావు గారు వేసిన ఈ ఛలోక్తి గురించి ప్రసిద్ధ సీనియర్ పాత్రికేయులు శ్రీ జి.వల్లీశ్వర్ ఒక సందర్భంలో ఈ విధంగా తెలియజేశారు. 1991లో ప్రధానమంత్రి అయ్యాక పీవీ తొలి విదేశీ యాత్రకు బయలుదేరే ముందు ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో నగర ప్రముఖుల నుంచి వీడ్కోలు తీసుకునే టీ కార్యక్రమంలో ఈ సంఘటన జరిగింది.

వరుసగా నిలబడి వున్న ప్రముఖులలో కొంత మంది పత్రికాసంపాదకులు కూడా వున్నారు. పీవీ వారి ముందు నుంచి నమస్కారం చేస్తూ వెళ్తుంటే, 'ది హిందూ' పత్రిక రెసిడెంట్ ఎడిటర్ ఆయనకు ఒక ప్రశ్న వేశారు.

"మీరు మండల్ కమీషన్ నివేదిక (బిసిల రిజర్వేషన్లకు సంబంధించినది)విషయంలో సుప్రీమ్ కోర్టును ఆరు మాసాల వ్యవధి అడిగారు కదా! ఏమి ప్రయోజనం? ఆరు మాసాల తరువాత అయినా అమలు చేయక తప్పదు కదా!" అని.

పీవీ గారు మెడపై కండువా సవరించుకుంటూ చెప్తాను వినండి అని అన్నారు. అక్కడి వారు అంతా చెవులు రిక్కించుకుని వింటున్నారు.

"అనగనగా ఒక రాజు గారు ఒక నేరస్థుడికి మరణశిక్ష విధించారు. తెల్లవారితే ఉరి తీస్తారనగా వాడు తనకు ఆరు మాసాల సమయమిస్తే ఎగిరే గుర్రాన్ని తయారుచేస్తానన్నాడు. రాజు గారు అనుమతించారు. వాడు కారాగారానికి తిరిగొచ్చాక తోటి ఖైదీ అడిగాడు. 'ఆరు మాసాల్లో ఎగిరే గుర్రం ఎలా తయారు చేస్తావురా!' అని. దానికి ఆ నేరస్థుడు చెప్పాడు కదా... ఆరు మాసాల్లో ప్రళయం రావచ్చు. రాజుగారు మనసు మార్చుకోవచ్చు. ఈ రాజే పోయి, కొత్త రాజు రావచ్చు. నేను ఎగిరే గుర్రాన్ని తయారు చేసినా చేయవచ్చు. ఏమో..ఏం చెప్పగలం? ఆరు మాసాల్లో ఏం జరిగినా జరగచ్చు". అంటూ పీవీ ముందుకు వెళ్ళిపోయారు.

మీడియా పట్ల పీవీ వ్యవహార సరళి ఎందుకలా ఉంటుందన్నది ఆయన ప్రధానిగా వున్న కాలంలో చాలా మంది మీడియా వారి మెదడు తొలిచివేసే ప్రశ్న. కొంత మంది హిందీ, ఇంగ్లీష్ పత్రికల్లో మిత్రులు వల్లీశ్వర్ గారిని అడుగుతుండేవారట–మీ వాడికి మీడియాని వాడుకోవడం తెలియదా? ఇష్టం లేదా? అని. ఈయన అది ఆయన నైజం అనే వాడట.

ఇలాంటి ప్రశ్నలన్నింటికీ సమాధానం 1994లో ప్రధాని నివాసంలో జి.కె.రెడ్డి స్మారక పురస్కారాన్ని 'ఇండియాటుడే' ఎడిటర్ అరుణ్ పురికి ఇచ్చినప్పుడు పీవీ ప్రసంగంలో దొరికిందట (అది తిక్కవరపు సుబ్బిరామిరెడ్డి గారి సభ) ఆ సభలో పీవీ ఇలా అన్నారట.

"మీడియా అంటే నాకు చాలా గౌరవం. ఎంత దూరంగా ఉంటే అంత గౌరవం. అందుకే నేను నా సాటి రాజకీయ నేతలకు కూడా ఎప్పుడూ చెప్తుంటాను ఏమనంటే.. మీడియాతో ఇంటర్వ్యూల కోసం తహతహలాడకండి. అదంతా శుద్ధ దండగ వ్యవహారం. మీరు ఎంత హేతుబద్ధంగా, ఎంత వాక్చాతుర్యంతో ఎన్ని విషయాలు చెప్పినా మీడియా వాళ్ళు ఏది ఎంత ప్రస్ఫుటంగా రాయాలనుకున్నారో అదే రాస్తారు. మీకెందుకయ్యా ఈ కంఠశోష? దూరంగా ఉండండి". – గంధం సుబ్బారావు

# గ్రంథాలయం



**ఒక వస్తువు 'ధర' కీ, ఆ వస్తువు కోసం జరిగిన 'శ్రమ' కీ, సంబంధం ఎలా ఉంటుంది?**
రచన : రంగనాయకమ్మ
పుటలు: 208, వెల :50/-
ప్రతులకు :అరుణా పబ్లిషింగ్‌హౌస్,
ఏలూరు రోడ్డు, విజయవాడ – 520 002
ఫోన్: 94406 30378



షోడశ కళావల్లభుడు **శ్రీకృష్ణదేవరాయలు**
రచయిత : జె.యస్.ఆర్.కె. శర్మ
పుటలు:208, వెల: రు.200/-
ప్రచురణ : జగర్లపూడి సీతారామకృష్ణశర్మ
తెలుగు భాష వికాస ఉద్యమం, భరత్ కుంజ్,
87-1027 బాలాజీకాలనీ, సి.క్యాంపు కర్నూలు-2
చరవాణి: 94404 43443

**మువ్వల చేతికర్ర-తాత్త్వికత**
**(శిఖామణి ప్రసిద్ధ రచన)**
రచన : జెన్ని వరదవాజు
పుటలు:104, వెల: రు.100/-
ప్రతులకు :కవిసంధ్య గ్రంథమాల 2-1-043,
అంబేద్కర్ నగర్, యానాం. 530 464
చరవాణి: 98482 02526



**కరోనా శాపమా ? వరమా?** (నవల)
రచన: శ్రీమతి పుప్పాల సూర్యకుమారి
పుటలు: 182 వెల : 100
ప్రతులకు : శ్రీమతి పుప్పాల సూర్యకుమారి,
డోర్ నెం. 68-2-6/1బి, అశోక్‌నగర్, కాకినాడ -3
సెల్: 93911 13756, 97019 73843.





**వీరగాథ** (కవిత్వం)
రచన : మల్లవరపు రాజేశ్వరరావు
పుటలు: 120, వెల:125/-
ప్రతులకు : సిక్కోలు బుక్‌ట్రస్ట్
చరవాణి: 99892 65444



**ఒంటి నిట్టాడి గుడిసె** (కవిత్వం)
రచయిత : కొప్పోలు మోహనరావు
పుటలు: 119, వెల :100/-
ప్రతులకు : కొప్పోలు మోహనరావు
ఫ్లాట్ నెం 101, ప్రమీలసదన్, కమలా నగర్,
దిల్‌సుఖ్ నగర్, **హైదరాబాదు - 500 060**
చరవాణి: 98668 99047

**ప్రపంచీకరోనా** కవితలు
రచన: డా. ఎన్. గోపి
పుటలు: 69, వెల: రు.100/-
ప్రతులకు : 13-1/5బి, శ్రీనివాసపురం,
రామంతపూర్, హైదరాబాద్-13
చరవాణి: +91 93910 28496



**వేణూనాదం**
రచన : డా.నాగసూరి వేణుగోపాల్
పుటలు: 240, వెల :200/-
ప్రతులకు : నవోదయ బుక్ హౌస్,
14వ మెట్రోస్తంభం ఎదురు,
కాచీగూడా క్రాస్ రోడ్డు, **హైదరాబాదు-27**
ఫోన్ : 040 - 24652387





**'... అంతా రామమయం' (సారస్వత వ్యాసాలు)**
రచయిత : విహారి
పుటలు :147, వెల :150/-
ప్రతులకు: జె.ఎస్. మూర్తి(విహారి)
16-11-310/12/ఏ/1/1 వినాయక గుడి వీధి,
సీలమ్ నగర్-2, మలక్‌పేట, హైదరాబాదు
ఫోన్ : 98480 25600



**సిద్దేశ్వరం అడుగు**(కథలు)
రచన : కె.సుభాషిణి, పాణి,
మారుతి పౌరోహితం, జి.వెంకటకృష్ణ
పుటలు:56, వెల: రు.50/-
ప్రతులకు :జి.వెంకటకృష్ణ
ఇంటి నెం.: 87/1287-1, సోమిశెట్టి నగర్, కర్నూలు
సెల్ : 89850 34894.



డా॥ బోయ జంగయ్య
రచించిన 'జగడం'
నవలపై డా॥ తాళ్ళపల్లి
యాకమ్మ పరిశీలన
**జగడం- ఒక పరిశీలన**
వెల రూ. 100/-



**కెరటం**(దళిత నవల)
రచయిత :
డా. తాళ్ళపల్లి యాకమ్మ
రూ.100/-



**రక్షణ (కథల సంపుటి)**
రచయిత :
డా. తాళ్ళపల్లి యాకమ్మ
రూ.100/-

ప్రతులకు: సోమరపు వీరాస్వామి, మహబూబాబాద్ – 506 101 ఫోన్ : 98499 63491, 97042 26681

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362

# తెలుగు భాషోద్యమ సమాఖ్య

(రి.నెం. 1288/2003)

# తెలుగు చరవాణి యాపుల పోటీ, తెలుగు వ్యాసరచనల పోటీ

గడువు తేదీ

1-1-2021

మధ్యాహ్నం 12 గంటలు

పోటీ కట్టుబాట్లు, అంశాలు మరియు మరిన్ని వివరాలు:

https:/ telugubhashodyamasamakhya.blogspot.com

సంప్రదింపులు: tebhasaspoti@gmail.com

**మొత్తం రు.4 లక్షల బహుమతులు!**

## చరవాణి యాపు పోటీ:

యాపు సమర్పణ

**forms.gle/koWxehnW6unooDsW8**

**మొదటి బహుమతి రూ 1 లక్ష, 1 జట్టుకు**

**రెండవ బహుమతి రూ. 50,000/-, రెండు జట్లకు**

**మూడవ బహుమతి రూ. 33,333/- మూడు జట్లకు**

## వ్యాసరచన పోటీ :

వ్యాస సమర్పణ

**forms.gle/zWRdGfk7sCaQTC4n8**

వంద ఉత్తమ వ్యాసాలకు ఒక్కొక్క వ్యాసానికి వెయ్యి రూపాయల నగదు బహుమతి.

తెలుగులో – తెలుగు నుడి (భాష) గురించి, తెలుగు చరిత్ర గురించి, తెలుగు సంస్కృతి గురించిన నాణ్యమైన సమాచారం అందరికీ అందుబాటులో లేదు. వలగూడు (అంతర్జాలం) వేదికగా అందుబాటులో ఉన్న తెలుగు వికీపీడియాను ఒక ప్రాతిపదికగా తీసుకుంటే పై అంశాల గురించి నాణ్యమైన ఒక వెయ్యి వ్యాసాలు కూడా ఉండవు. మన తెలుగు వారి జనాభా తెలుగు రాష్ట్రాల్లో, తెలుగు రాష్ట్రాల బయటా కలిపి 18 కోట్లు ఉంటే, కనీసం 18 మంది కూడా ఈ విషయమై చూపు సారించి తెలుగు వికీపీడియా లాంటి వనరుల్లో చురుగ్గా పనిచేయటం లేదు. ఏడాదికి కొన్ని పరిశోధనా పత్రాలు వెలువడుతున్నా, అవి ఏదో ఒక గ్రంథాలయ సొరుగులోకో, వెయ్యికి దాటని ప్రచురణలుగానో మిగిలిపోతున్నాయి. ఈ వెలితిని నింపుతూ, కొంతలో కొంత తెలుగు నుడి, తెలుగు చరిత్ర, తెలుగు సంస్కృతి అంశాల్లో సమాచారం వలగూడులో చేర్చే దిశగా తెలుగు భాషోద్యమ సమాఖ్య వ్యాసరచన పోటీని నడుపుతున్నది. నేడు వలగూడు అనేది సమాచారాన్ని పుట్టించటానికీ వాడుకకూ భద్రపరచటానికీ ఉన్న అతి పెద్ద వనరుగా మన ముందుంది. వలగూడులో చేర్చని వ్యాసం ఎక్కువ మంది చదువరులకు చేరదు కూడా. అందరికీ అందుబాటులో ఉండే విధంగా అంశాలను చెప్పాలంటే వలగూడే అందరికీ అందుబాటులోనికి తెచ్చే సాధనం.

అమ్మనుడి తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly)
December 2020 Vol :6, Issue 7

Date of publication : 1st of every month
Date of posting : 3rd & 6th of every month

RNI-APTEL / 2015/62362
Postal Reg NO. TEN/13/2018-20




If not delivered, please return to : 'The Publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam,ANGALAKUDURU (po),TENALI-522 211,Guntur (dt) A.P. Cell:94929 80244